సృజన

91

వేడే ప్రత్యేక సంచిక

వేడే
చిరకాలం వర్ధిల్లుగాక !



ఈ సంచికలో....

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక

91

మే 1979

సృజన పాఠకులకు మే డే విప్లవాభినందనలు

ప్రపంచ కార్మికులారా ఏకం కండి!

పోరాటంలో మీకు పోయేదేమీలేదు సంకెళ్ళు తప్ప!

పాల్‌పాట్ నాయకత్వంలో కొనసాగుతున్న కంపూచియా
ప్రజావిముక్తి పోరాటాన్ని బలపరచండి!!

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు — ఈ సంచిక 2 రూపాయలు

మేడే కర్తవ్యం

నాలుగు సంవత్సరాల క్రితం మేడేనాటికి అమెరికన్ సామ్రాజ్యవాదం ఉక్కుగోళ్ళను విరగ్గొట్టి కాంబోడియా విముక్తమయింది. కాంబోడియా ప్రజలతో కలిసి మెలిసి, అడుగులో అడుగేసి పోరాడి దక్షిణవియత్నామ్ కూడ అదే రోజుల్లో విముక్తమయింది. హోచిమిన్ కలగన్న వియత్నామ్ ఏకీకరణ జరిగింది. వలస వాదుల కాంబోడియా ప్రజల కంపూచియాగా ఆగ్నేయాసియా ఖండానికే ఆదర్శంగా కమ్యూనీకరణ దశలో కదలింది.

అమెరికన్ ఈగిల్‌ను వెదురు బాణాలతో కూల్చిన వియత్నామ్ దిడ్డిదారిన రష్యన్ గుడ్డేలుగు ప్రవేశించింది. వియత్నామ్ దారిని తానునిర్ణయించే పెత్తనం తీసుకున్నది. వలసవాదం నుంచి రాజకీయవిముక్తి స్వయంకృషితో వర్గపోరాటం విడవకుండా అభివృద్ధి సాధించడంలో వుందని, పెట్టుబడిదారులు నిర్మించిన పట్టణాలు గ్రామీణ జీవితం రక్తాన్ని పీలుస్తున్న కంతులుగామారి శరీరాన్ని శాసిస్తున్నపుడు దేశం ఊపిర్లను గ్రామాల్లో పునరుజ్జీవింపచేయాలని కంపూచియన్లు కర్తవ్యాన్ని నిర్దేశించుకున్నారు. ఒక చిన్నదేశం, ఒక వ్యవసాయ దేశం ప్రపంచ సామ్రాజ్యవాదుల ప్రమాదంనుంచి బయటపడి స్వతంత్రంగా తానుగా ఎట్లా బతకాలనడానికి నమూనాగా కంపూచియా కదలబారింది. ఇది సహజంగానే కొత్తగా దురాక్రమణ కొమ్ములు పొడుచుకొచ్చిన సోవియట్‌సామ్రాజ్యవాదానికి సహించ రానిదయింది.

కంపూచియా ప్రజల కమ్యూన్ తాత్కాలికంగా ఓడిపోయింది. పట్టణాలను రష్యా, క్యూబా, వియత్నామ్ కిరాయిసైన్యాలు ఆక్రమించుకున్నాయి. కానిగ్రామాల్లో ఇంకా పాల్‌పాట్ నాయకత్వంలో ప్రజలు విముక్తి పోరాటం కొనసాగిస్తున్నారు కంపూచియా ప్రజల విముక్తి పోరాటాన్ని బలపరచడం ఇవ్వాళ ప్రపంచ కార్మికుల పవిత్రకర్తవ్యం. కంపూచియాపై సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం వత్తాసుతో దురాక్రమణ చేసిన వియత్నామ్ చర్యల్ని ఖండించడం ఇవ్వాళ ప్రపంచ కార్మికుల బాధ్యత. ప్రపంచ కార్మికుల సుందర స్వప్నం బీజ ప్రాయంలో కమ్యూనిస్టు వ్యవస్థను కళ్ళకు కట్టిన పారిస్ కమ్యూన్‌ను బూర్జువా వర్గం పడదోసింది. అయినా పారిస్‌కమ్యూన్ ఆదర్శమూ ఉత్తేజమూ కార్మికవర్గాన్ని విజయాలవైపు నడుపుతున్నాయి.

కంపూచియా కమ్యూన్ విజయం ప్రపంచ కార్మికవర్గ విజయం. అందుకే విజయవాడలో, సికిందరాబాదులో కార్మికవర్గ చైతన్యంగల విద్యార్థులు, యువకులు వియత్నామ్ దురాక్రమణ వాదుల్ని ఎదురించి ఎలుగెత్తి కంపూచియా ప్రజలపోరాటానికి మద్దతు ప్రకటించారు. కార్మికవర్గ విజయాలను రద్దుచేయడానికి ప్రపంచ వ్యాప్తంగా

(మిగతా నాలుగవ పేజీలో)

మేడే సూరీడు

సునీత

మేడే సూరీడు
మంటవలె ఎగిసిండు।
ఎలుగుతో లోకాన్ని
నిద్దరే లేపిండు।
చికాగో కార్మికులు
చిందిన రక్తంలో
తడిసి ఎగిరిన జెండ
నిలిపిండు మనకండ ॥మేడే॥

పారిస్‌లో కమ్యూను
ప్రజల రాజ్యం తెచ్చి
కమ్యూనిజం బీజ
ప్రాయంగ చూపిండు ॥మేడే॥

నాటి రష్యాలోని
వీర చైనాలోని
వేలాది మృతవీర
రక్తాన్ని పులుముకొని
వెలిగి పోతున్నాడు।
కదిలి పోతున్నాడు। ॥మేడే॥

నాటి తెలంగాణ
నేటి నక్సల్బరీ
శ్రీకాకుళంలోన
సింగరేణి[1] లోన
చిందించినత్యాగ
కడలిలో ఈదిండు।
ప్రజల ఉద్యమాల
డోలలో ఊగిండు। ॥మేడే॥

మొన్న కంటె నిన్న
నిన్న కంటె నేడు
మిన్నగా ఎదిగిండు
ఎర్రగా ఎలిగిండు ॥మేడే॥

చివికిన బతుకులొ
చీకటొద్దన్నాడు।
కాంతికై పోరాడ
కరుకు దేలన్నాడు। ॥మేడే॥

రాత్రి నిలువదింక
రాత్రి గెలువదింక
రాత్రితో పోరాడ
రాటు దేలన్నాడు। ॥మేడే॥

భయం కూలగొట్టు।
జనం కూడ గట్టు।
ముళ్ళ దారయినాను
ముందె బతుకన్నాడు। ॥మేడే॥

ఎత్తుల్ని నరికేయ
లోతుల్ని సరిజేయ
రక్తతర్పణ నీకు
తప్పదన్నాడు।
త్యాగమే నీకంటి
కాంతి అన్నాడు। ॥మేడే॥

రాజుకో। రగులుకో।
గాలిలా పాకిపో!
ఎర్రజండే నీకు
అండ కదులన్నాడు। ॥మేడే॥

ప్రజల రాజ్యం కొరకు,
ప్రజల బ్రతుకూ కొరకు,
ఈ నాడె శపథాన్ని
ఇచ్చు కొమ్మన్నాడు।
పోరుబాటలోనె
పదునెక్క మన్నాడు। ॥మేడే॥

---

1. సింగరేణి గోదావరిలోయ పోరాటానికి, ఆదిలాబాదు, కరీంనగర్, పండితాపురం రైతాంగ పోరాటానికి సంకేతం.

సూర్యుని వారసులం

ఎన్. శేఖర్

మండేటి సూర్యుడా నువ్వన్న చెప్పు
పేదోల్ల కన్నీళ్ల కారణమ్మేదో?
పాడేటి కోయిలా నీగొంతు విప్పు
కూలోళ్ల కన్నీటి గాథలనుచెప్పు
॥మండేటి॥

సుక్కపొద్దున లేసి దుక్కుల్లుదున్ని
మసక సీకటితోడ మోటల్లు గొడితె
పండిన పంటంత దొరల పాలాయె
మాకష్ట ఫలమేమొ కన్నీల్లు మిగిలే
॥మండేటి॥

తొలికోడి కూతల్లె సైరను కూత
వినిపించె గుండెల్ల తూపాకిమోత
రక్తాలు తాగేటి రాకాసి యంత్రాల్లో
నెత్తుర్లు చిందించి నేల కరచిననూ
కట్టవోతె మాకు గుడ్డ కరువాయె
మాచెమట విలువంత ఏడచేరింది?
॥మండేటి॥

నిన్న కాంగిరేసు నేడు జనతాపార్టి
పేదోల్ల బతుకుల మారుస్త మనిరి
వాండ్లంత ఇన్నేండ్లు మాబాగె కోరితే
మమ్ములను దోచిన దొంగ లెవ్వారూ?
॥మండేటి॥

వెలుగిచ్చె సూర్యుడా నువ్వయిన చెప్పు
కూడుసాలనోల్ల తోడు ఎవ్వారో?
సూర్య చంద్రుల్లాంటి ఉారులన్నాలు
మారెక్కల్ల బొక్కల్ల కలిసి తిరిగేరు
బాధల్లు చూసేటు బతుకుమార్చేరు
కష్టాలు కడతేర్చె కమ్యూనిస్టోళ్లు ॥వెలు॥

కష్టాలు పడ్డోల్ల కాలమచ్చేదనుక
పండించినోల్లకు పంట దక్కేవరకు
నడిపెటోల్లకు మిల్లు దక్కేటంతవరకు
మరలల్ల ఉక్కోలె నిలిపిపోరాడేము
దుక్కుల్ల మొక్కోలె మొలకలెత్తేము
॥వెలు॥

మండేటి సూర్యుడా నువ్వేమాతోడు
నీ తీర్గ తూర్పున పుట్టి పెరిగేము
మండేటి సూర్యుడా మాది నీ దారే
తూర్పుగాలిని కలిసి మార్పు తెస్తాము
॥మండేటి॥

(జో అచ్యుతానంద జోజో ముకుందా! అన్న లాలిపాట మాదిరిగా పాడుకోవాల్సిన లాల్‌పాట)

(రెండో పేజీ తరువాయి)

సామ్రాజ్యవాదమూ, సోషల్ సామ్రాజ్యవాదమూ వారి దళారీ, రివిజనిస్టు ఏజెంట్లు విఫలయత్నాలే కావచ్చుకాని విరామం లేకుండా చేస్తున్నారు. పనిగంటలు సాధించుకోడానికి చికాగోలో నెత్తుర్లు చింది ఎర్రజెండా ఎగరేసిన కార్మికవర్గం తన రాజ్యాధికారం కాపాడుకోవడానికి ఎన్ని త్యాగాలుచేసి ఎంత దృఢదీక్ష వహించాలో, వర్గపోరాట ఆయుధాన్ని ఎంత పదనుపెట్టుకొని ఎంతనిశితంగా వాడుకోవాలో మేడే హెచ్చరిస్తున్నది.

— సంపాదకుడు

29 ఏప్రిల్ 79

ఎర్రెటెన్నెల దేరో!

ఎస్.కె.

ఎర్రాజెండా ఎత్తి
కూలి దండు గట్టి
కదలి రారో రారో
కార్థన పిలగ
కొత్త ఎలుగునుదేరో
కార్థన పిలగ
ఎర్ర టెన్నెలదేరో
కార్థన పిలగ ॥ఎర్ర॥

ఆదిలబాదు కాడ
సిరిసిల్లా కాడో
కరీన్నగరు కాడో
కార్థన పిలగో
గడ్డీ గాదం మండే
కార్థన పిలగ
గాంవ గాంవం మండే
కార్థన పిలగ
గడ్డీ గాదం మండే
గాంవ గాంవం మండే
ఎర్ర జెండా ఎత్తి
కూలి దండు గట్టి ॥కదలి॥

సెట్టు పుట్టాలనక
సెలక సేనూలనక
ముల్లు కంచెలనక
ఎండ అనలనక
పొద్దు మాపులనక
నిద్ర నిప్పులనక
కండ లిరుసుకోని
కట్టె గొట్టెటోడు
కండ్లు పొడుసుకోని
కాపు గాసేటోడు

పెయ్యీ పానం
పేరు ఎత్తానోడు
మన పానం పిలగో
మరువకు పిలగా
జరా కలువుర పిలగో
కార్థన పిలగా
మన పానం పిలగో
జల్ది కలువుర పిలగో
ఎర్రా జెండా ఎత్తి
కూలి దండు గట్టి ॥కదలి॥

ప్యారిస్ కమ్యూన్ కాడ
విప్లవ మాగిందా
రష్యా బోల్తా కొడితే
ఆగిందా విప్లవం
ఎర్రపువ్వు కాంపూచియ
ఎందు కట్ల పూచింది
మన గుండియ వుంది
ముందు యిండియ వుంది ॥ఎర్ర॥

పోరు మాట జెప్పి
పోరు బాట కొచ్చి
మంబ్లె గలిసి పోదాం
ఓ కార్థన పిలగా
మల్ల బుట్టా కొద్దాం
ఓ కార్థన పిలగా
మంబ్లె గల్సి పోదాం
మల్ల బుట్టాకొద్దాం
ఎర్ర జెండా ఎత్తి
కూలి దండూ గట్టి_ ॥కదలి॥

నవల - సీరియల్;

కొలిమంటుకున్నది

అల్లం రాజయ్య

(గత సంచిక తరువాయి)

14

ప్రతాపరెడ్డి గదిల కోమటి రామలింగం దొర కుర్సి పక్కకు కింద కూకున్నడు.

"నీ తెలివి తెల్లారిపోను- ఏంతెలివయ్యా- గీ పల్లెలుండబట్టి అగిపోయినవ్ గని, గదే పట్నం లుంటెనా? ఏటా నాలుగు కార్ఖానాలు గట్టెటోనివి-" దొర రామలింగం ఎన్నుమీన సెయ్యేసిండు.

షావుకారి రామలింగం సప్పుడు కాకుంట నవ్విండు.

"నీకు భూమెందుకోయి? దానితోని మాదండి తంట, బేరం పేసుకునేటోనివి- ఇత్తనం బెట్టిన కాన్నుంచి మొదలైతే ఇంట్లకచ్చేదనుక సకుల బాధలు పడాలె- నే ననేదేందంటే- ఏడికోకాడికి సూసుకో- నా మిరుప తోట బందుకు నువ్వు కాలు బెట్టాలె- ఇసారిచ్చుకో- నాదాంట్ల కలిసిపోద్ది-"

షావుకారి ఇట్టం లేనట్టుగ తలగోక్కున్నడు-

"మనోనివని ముందుగాల సెప్పుతన్న-"

"దొరవారు- నేను కాయిష్‌బడి కొన్న-"

"కొన్న కాడికి నేనడుగుత లేనుగద?"

"మీకన్నా సిన్నది గాదాయె- నాకేమొ దాని మీన కాయిషుండె-కాదు కక్కున మన బద్తిరి- తమరు పెద్దోరు- ఏంజెప్పాలే- కోపానికి రాకుంటే- ఎకురాన మూడువేల సొప్పున తీసుకోండ్రి-"

"మూడువేలిచ్చి- గందుకనే కోమటోన్ని దూరంగుంచు మన్నరు. నషిమీరోన్ని నల్లకోమటోన్ని దగ్గెరికి రానియ్యద్దట- తీస్కాని దినం గడువలే గంత లాభంగావాల్నా? నాకద్దు పో- పెరడి నీ గు....ల కుచ్చుకో పో- నా బందుకచ్చి ఎట్ల నెగుల్తవో అది కూడ సూత్త పో...."

"దొరవారు కోపానికత్తె నేం బతుకుతనా? మన్నించాలె- ఏదో మీ దయ- తమరు మాత్రం నన్ను ముంచుతరా! ఆఖరికి ఓ ఇస్నూరన్న గిట్టక పోతే నేం కోమటి పుటుక పుట్టెందుకు?

దొర మాట్లాడలేదు– మొఖం కందగడ్డసేసుకొని కుర్సిలనుంచి లేవబోయిండు.

"కూకోండి కూకోండి దొరా! ఏగిరపడ్తె అయితదా? తమరిని కొట్టిసూసిన నాకెందుకు దొరా! లాభం– పెద్దపులసొంటోరు తమరు– తమ నీడన బతికే నక్కలసొంటోల్లం మేము–" రామలింగం భయం భయంగ నవ్విండు.

"నీ నక్క– తెలివి మండిపోను– నాకుసెప్పిన అంకె సరీగనేనా? అవద్దమా? అటెనుక తెలుత్తే నీకెరికెగాదా?" దొరనవ్విండు.

షావుకారి నవ్విండు–

* * *

నర్సింహం గనాత్రంత ఇంటికి రాకుంట ఏడేడనో తిరిగిండు. పిచ్చిలేసినోని తీర్గ– ఆఖరుకు అమ్మిన పెరట్లకు బోయిండు– పన్ను పిసుక్కుంట సానసేపు గ పెరట్లనే సీకట్ల కూకుండి పోయిండు.

"కరంటోల్లు, కోమటోడు, దొరోడు తనను జబర్దస్తీగ ఎట్ల కయికిలిగానిగ జేసింద్రో–" నవ్వుకున్నడు. "తనతీర్గనే ఊరు ఊరంతటిని బాంచెగాళ్ల సేసుకున్నరు– గిట్లెంతకని సాగటం– ఎంతకాలమని సాగటం. కయికిలిగాళ్లను జేసి కట్టం సేపిచ్చుకొని కూటికి సంపుతండ్రు. ఎన్నుల మీని కెక్కుతండ్రు– కులాలంటండ్రు– కులతప్పులంటండ్రు కూడుండకుండ; దొరలు పల్లెల్ల రోజుకొకని జమీను తమ జమీన్ల కలుపుకోవట్టిరి. గీ ఊల్లె ఇంకేంమిగలున్నది? కట్టంతప్పలె. కరంటు బీదోని కోసరం గాదు. దొరల బంగులాలల్ల, గడీలల్ల దీపాలకోసం– దొరల బాయిల్ల నీల్లు తోడేందు కోసం– సడుగులు– ఆల్లమోటర్లు తిరిగేటందుకే– ఈడ ఏదచ్చినా ఆల్లకోసరమే. అన్నీ ఆల్లకోసరమే– ఆకలి– దరిద్రం, రోగాలు, నొప్పులు, సావులు, దెబ్బలు, కొట్లాటలు, కాట్లాటలు, సావటానికి సుత పుర్సతులేని పని తమకోసరం.

దునియంత తోడుదొంగలే– దొంగలదీ రాజ్జెం– దొరలదీ రాజ్జెం. కయికిలి గాల్లున్నంత కాలం దొరలుంటరు. దొరలున్నంత కాలం కయికిలి గాల్లుంటరు కయికిలి గాల్లంత కుప్పగూడితే– అడుక్కుంటే భూములిత్తరా? రామలింగం మంచి మాటకు తన పెరడి తనకిత్తడా? మంత్రాలకు సింతకాయలు రాల్తయా? ఎందుకిత్తడు? కోమటో డెన్నడన్న సెమటొడిపిండా? పల్ల అడెట్ల పెరిగి పోయిండు? దొరోడు– తాతల కాన్నుంచి నెత్తురుపిండుకొని గంత గడి కట్టుకున్నరు.

పిరికెడు మన్ను తీసి కోపంగ ఇసిరి కొట్టిండు.

"తల్లి భూదేవరా? నువ్వేపల సౌమ్మతల్లీ? మా సెమటల్ నెత్తురులు తాగి మా కట్టంలో సుఖంలో తోడుండి ఇయ్యాల్ల అమ్మడుబోయినవ్- నీకు నాకు రుడం తీరిపోయింది. ఆకలి తోని నేనుంటే ఇంతవరదనుక నర్సిమ్మా ఇగరారా! అని కూడుబెట్టి గుండెల కదుముకున్నవ్" కాలుగాలిన పిల్లితీర్గ పెరడంత గస్తీ తిరిగిండు. తెల్లారే సుక్క-పొడిసి నప్పుడు తప్ప తాగినౌనితీర్గ తూలుకుంట ఇల్లు సేరుకొని అర్రట్లనే కటిక నేల మీన ఒరిగి పోయిండు.

15

ఎండలు తగ్గుమొకంబట్టి గాడుపు దుమారాలు మొదలైనయ్- గాడుపు అచ్చేది రాక తనతోని మబ్బుల తీసుకత్తంది- అచ్చిన మబ్బులు గాలితోటి అటీటురికి ఒకదాని కొకటి డిచ్చేకొట్టుకుంటన్నయ్. మొఖాలుమాడ్చుకొని పెళ పెళ తిట్టుకున్నయ్-కత్తులు మెరువంగ కలెబడ్డయ్- జేష్ట మాసంలనే ఆనలు ఝాడిచ్చి కొట్టినయ్.

ఆగులంతలు బొబ్బలు కొట్టినయ్.

సెరువుల కింద,కుంటల కింద నారుదొయ్యాలు నవ్వినయ్, సెలుకల్ల పునాసలు మారాకు లేసినయ్.

సిత సిత బురుదలు, గుయ్యిగుయ్యిన నాత్రి దోమలు, పొద్దంతా ఈగలు తిరుగ సాగినయ్. పసురాలు పసుకబలం సూసుకొని పుట్టగడ్డలు సిమ్మకుంట రంకెలేసుకుంట సెంగ లిచ్చినయ్. ఆరిద్ర పురుగులు ఇచ్చేంత్రపడి బూమ్మీద పగడాల తీర్గ పారినయ్. బూమి తల్లి పచ్చ సీర కట్టుకున్నది.

తూములు గలగల మన్నయ్. పొలాలల్ల ఎండ్రికాయలు, కప్పలు ఈతలు గొట్టినయ్. దొయ్యల నీల్లు సూసి అనుభవం గల ముసలెడ్లు మూతులు ముడుసుకున్నయ్- పొలాలల్ల నాగండ్లు దిగినయ్- ఎదిగిన అరినారు తేమ గాడుపుకు నవ్వింది.

అగో-గసొంటి ఏల్లల షెకెదారు బాలపల్లు సిల్లర బట్టసంచి నింపుకొని ఊరు మీన పడ్డడు.కూలోల్లకు గిరాకి పెరిగింది.

"తొస్పెదుర్గి ఓ! పల్లి! కొండి ఇగరాండ్రే- కయికిలి పట్టుండ్రి. రేపు ఆర్ల కుంటెను దొరగారి జనిగలందురు నాటెయ్యాలె- పొద్దెక్కిపోతంది- పల్లెమీనికిబోవాలె- జెపజెప రాండ్రి-" మాదిగిండ్లల్ల పెద్దమ్మ గుడికాడ నిలుసుండి కేకేసిండు.

బరిబాత పోరగండ్లు పిట్టగూల్లు కడుతండ్రు- సీమిడిముక్కు-పోరొకతి సంకల పిలగాన్నేసుకొని మోయసాతకాక తిట్టుకుంట పోతంది- దూరంగా సల్లంగ పండుకున్న కుక్క- మోర మీదికెత్తి బాలుపల్లును సూసి కుయ్యి కుయ్యి మని మల్ల పండుకున్నది.

"లంజలకేం బుట్టిందిరో ఒక్కతన్న అత్తలేదు-" మనుసుల మాట మీదికే అనేసి "ఏమాయనురారి- ఒక్క లంజకానన్న ఈవలికెల్తలేదు. ఏడసచ్చిండ్రురారి ఒక్క లంజకొడుకన్నా అగుపిత్తలేడు. పల్లెసీనికిబోవాలె- ఊల్లెసుత కయికిల్లియ్యాలె మాదిగిండ్లల్లనే పగటాల్ల దాటిపోతే" బాలుమల్లు పేరుపేరున బిలిసిండు.

కూలోల్లెవలు గుడిసెల్ల నుంచి ఈవలకురాలే- గుడిసెల్లనె గుసగుసలు- ఎవరు సుత బాలుమల్లుసుట్టు మూగలేదు. బాలుమల్లు ఇచ్చంతర పడ్డడు.

"మందికేం మార్న గాలమచ్చింది? నాకంటె నాకని ఒకలమీన ఒకలు కుమ్ముకలాడుకుంట కయికిలి పట్టెటోల్లు- ఒక్కతి అత్తలేదు"

బాలమల్లుకు ఎండతీర్గనే కోపం ఎక్కవోతంది.

"ఒక్కొక్కతిని.... సీయక్క మాదుగులకు మదమచ్చింది-" అనుకున్నడు- ఈల్ల సంగతి సూడాలె- ఎల్లెట్లరారో- పనులు బందు సేపిత్త ఏం దింటరో లమ్డికొడుకులు? లంజెలు? ఏమను కుంటండ్రో?" సిర్రు బుర్రు లాడుకుంట అచ్చిందారిపట్టె బోయిండు.

సిట్ట సివరకు ఎంకని కోడలు రాయమల్లి మొకం నాలెకేసుకొని గుడిసెలనుంచి ఈతల కచ్చింది- నాలెకు సూసుకుంటనే కుడిసెయ్యి సాపింది. రూపాయి సిల్లర మీదికెల్లి సేతులేసిండు బాలుమల్లు- గుడిసెల్ల అమ్మలక్కల మూతులు ఈతల కచ్చినయ్ రాయమల్లిని కోపంగ సూసినయ్- బాలుమల్లు పైకం గలగలలాడిచ్చిండు.

ఇంకెవతో ఈతలకచ్చి సెయి జాపింది. గట్ల ఒక్కొక్కతి ఈతలకచ్చి కయికిల్లు పట్టుకున్నరు బుగులు పడుకుంటనే.

బాలమల్లు ఎల్లి పోయిండు.

ఏడినుంచచ్చిండో ఒడిసెల రాయితీర్గ గూనెంకడు. అత్తత్తనే- పెద్దమ్మగుడి గోడెక్కిండు.

"ఆడి ముండల్లాల! మరిసిపోయిండ్రు- నిన్న సెందిరయ్య నందమయ్య సెప్పిన మాటలు గిప్పుడే మరిసిపోయిండ్రా! నాత్రిసెప్పంగ నిచ్చమే- నిచ్చమేనని తలకాయలూపితిరి ఎప్పుడే! మనకు బుద్దచ్చేది? ఎండకాలం నుంచి అల్లిద్దరు కాలుకు బట్టకుంట మనసుట్టు దిరిగి సెవులిల్లుగట్టుకొని సెప్పవట్టిరి- అయ్యలు అవ్వలు మనబతుకులు మారాలంటే మనం మనం ఒక్కటిగా గావాల్ననిరి- అళ్లు మనతోటిసకుల పల్లెందుల బడి సిలుకకు సెప్పినట్టు సెప్పినా మీరు సెవునబెడ్తలేరు- గిప్పుడు తీసుకున్న రూపాయినేం జేసుకుంటరు? గీ రూపాయికి కోమటోడు నాలుగు నిరుపకాయలు కొంగులేత్త

లేదు- పాపుల బెద్తె సుట్టలకు పొవాకు పుల్లర్తలేదు. మీకు శరాలు లేవు- వారీ! కడుపులమీన కొడుతండ్రా అలంజకొడుకులంటే మీరు సెవుసబెట్టరు. ఎన్నర్రాపసకు బుద్ధెచ్చేది? అవునే రాయెమల్లి! రూపాయి సూసేటాల్లకే పూనకమచ్చిందే?" కీకలేసింది.

"అయింద! మామా! నువ్వు సెప్పేటియన్ని నిచ్చమే- కని నేను సెప్పేటిది సుత ఇను- ఇగరా. నాతోటి గుడిసెలకురా- మాదకు సమరు లేక పదిదినాల పసిగుడ్డు పోరడు సాపుకేకలు బెడ్తండు- మాదగుంజి- ఎంకన్నా! నీ బాంచన్ కాల్మొక్కుత కోసంత నూనె బొయ్యి ఇగో గీరూపాయి నీమొఖన్నే గొడుత-లేకుంటే ఇప్పుడచ్చినోని మొఖం మీన ఊంచేదాన్ని- ఇయ్యాల్ల సుత నూనె లేకుంటె పోరడు సత్తడు-" రాయ మల్లు సేతుల పైసలా గల గల లాడిచ్చి అన్నది.

గూనెంకని మొకం మాడిపోయింది. తల ఏలాడేసుకున్నడు.

అప్పటికే మాదిగోల్లంత పెద్దమ్మ గుడికాడికి సేరిండ్రు.

"నువ్వట్లాగె-" అని బొత్తయ్య సుట్టాత ఉన్న మందిని జరుపుకుంట గోడ కాడికి నడిసిండు- గోడెక్కిండు.-

"రాయమల్లవ్వ అన్నది సుత నిచ్చమే- కాదిను- అరుగాలము కట్టపడ్తా నాట్లేసి నాట్లేసి నడుములిరిగినా, కోతలుకోసికోసి సేతులు కాయలు గాసినోయినా, ఎండకు పెయ్యి మాగినా గడుకెసులయిపోయినా, మెడనరాలుబ్బంగ మోతలు మోసినా, మన సిన్న పోరగండ్లకు మాద సమరు లేకుంటయిపోయింది. గీ రూపాయి సిల్లరేంజేసుకోను? ఇన్నేండ్లు పొలాలునోల్లంత అడ్లు గొలిసెటోల్లు- అడ్లకు అపుతల ధర పలుకుతంది. అడ్లను అంగట్ల అమ్మికొని మనకు కాయిదం నోట్లిసిరేత్తండ్రు- ఎంత రూపాయి-రూపాయి బెట్టి కొనబోతె ఎన్ని ఇత్తులత్తన్నయ్?- పిల్లపేక్కు సాలనన్ని- మనకు ఎనికటితీర్గ కయికిల్లు ఇత్తులే గొలువాలె- అయ్యి సుత అడిదానికి మానెడు, మొగోనికి అరునోల్లు- ఇంటన్నరుర్రి? గిట్లనుగొని అయిల్ల మంచోల్లమో సెడ్డోల్లమో కడుపుకు సాలనోల్లం కుప్పకూడి అనుకున్నం- మన రైతుకూలి సంఘం గట్లయితెనె అల్ల పనుల మీనికి బోవన్నని సెప్పింది- నేను మన సంగం తరుపున మల్ల సెప్పుతన్న- మనం అన్నంత కొలిసే దాక మనం ఇంట్ల కాలు ఈతల బెట్టేది లేదు- సంగం కట్టడి తప్పేది లేదు-" అన్నడు బొత్తయ్య.

"మాదండి మొగోని వచ్చినవ్ మాటలు నేర్సి- సరెనయ్యా! సంగం గింగం మాకెరుకలేదు- నువ్వు సెప్పినట్టు ఇంటమ్. పనిసుత బందుసేత్తమ్. మరి గింత

అంబలి గంజన్న నువ్వు పోత్తవా? పోరగండ్లు ఒర్రి సావరా?" ఎవతో మందిల గునిసింది.

"పెద్దమ్మగోడెక్కి పెద్దపోకిల్లు గొట్టంగనే అయిపోద్దా? మాకు సుత ఉన్నదయ మంట— ఏం మంట? కడుపుమంట— కయికిలి రామని కూసుంటె దొర ఒక్కొక్కల తుపాకినేసి సంపుతడు— అప్పుడు సీ సంగెమడ్డమత్తదా? నువ్వడ్డమత్తవా? ఎవలడ్డ మత్తరు?" పొట్టి పెద్దులు పాతపేగు ఝాడిచ్చి అన్నడు.

"ఆరీ! పెద్దిగ! గ భయమె మనల గీడికితెచ్చింది— ఇప్పుడు కడుపులు పలిగి పోంగ తింటన్నామురా! ఆకలి కిప్పుడుసత్తలేముర, కొడుకా! సతినిత్తెము సాంబరేను అరన్నము దిని అరగక సత్తన్నాముర— అంతదాకత్తె మించిక పోయిందేమున్నది— కట్టంజేసి కత్తులయిపోయిన గీ రొండు రెక్కలే పబ్బతిపట్టే బదులు మర్రేత్తాం—" బొత్తయ్య.

లొల్లి ముదిరింది. ఎవడేం సెప్పుతాండో ఎవనికినపత్తలేదు. "ఆరి - తోరి" గొట్టినందుకు పొట్టి పెద్దులు అడికీడికి సెంగ సెంగ ఎగురుతండు. పనులు బందు సెయ్యాల్నలటె మాటలుగాదని అంటండ్రు. ఆనందం, సెంద్రయ్య సెవులిల్లు కట్టుకొని సెప్పిన మాటలు సెర్ల గల్సినయ్.

ఆకరుకు బద్దిలింగయ్య పెద్దమ్మగోడ సేరుకున్నడు. సేతులు సాపి "సైసుర సైసుండ్రి. తాములు— తామూలుకు రాండ్రి— ఏగిరిపడ్తె ఏదిగాడు— ఉరుకులాడ్తె అయితాది.?" అన్నడు— బుర్ర మీసాల నవ్వు మొకం తోని— ఎక్కడోడక్కన్నే నిలుసున్నరు.

"తీరింది మాదిగోడ ఉరు దాటియ్యమని గీ లింగయ్య సభసెప్పుతండు.— దెహెం ముసలోడ ఊకోరాదు." ఓ పడుసోడు కసురుకున్నడు.

"కాదు మనుమడా! ఉరుకులాడకు— పడుసో పెడుసో—" నవ్వెండు బద్దిలింగయ్య.

"నవ్వు లాటగున్నది— ఎవారం మడుగుల బర్రె—" బద్దిలింగయ్య పెండ్లాం ఎర్రపోసు సేతులు నెత్తికి తాకిచ్చుకొని ఇరిసి కారెడ్డమాడింది.

బద్దిలింగయ్య మొకంల నవ్వు మాయమయ్యింది— అనికేసెయ్యేత్తిండు.

"పరాసికాలుగాదు— మన బతుకుమాట— బొత్తోడు సెప్పింది మంచిమాటె— కాదనెటోడు ఎవడన్న దమ్మున్నోడు నాముంగటికి రమ్మను. ఝాడిచ్చి దవడ మీన కొడుత— గులాపు బతుకు అడు బతుకనియ్— మనకద్దు— ముసలోన్నో ముడిగోన్నో నే

నెన్నో కష్టాలుసూసి పక్రిసెట్టోలె ఎన్నిగాడ్పులచ్చిన నిలబడిపోయిన- నా ఈడోల్లంత ముప్పయేండ్లు నిండకుంటనే సచ్చిండ్రు- పుట్టి బజారం గాని పోరగాండ్లు మీరు- ఎన్నేండ్లు బతికినా గీ ఎట్టి తప్పదు. గీ మురిగిన కొంపల్లనే అంలితోనే సత్తం- ఎంత కుక్క తీర్గ మెదిలినా, ఆడు తన్నుకుంటనే పోతడు- ఉరుకులాటీడిసిపెట్టి జరతామూలుగ అనుకుందాం- గీ ఒక్కూల్లెనేగాదు. మొన్న మా పోరిని తీసుకరాను అయితారపు పేటకు బోయిన- నా కండ్లు నిలబడి పోయినయ్. ఆడ దొర ఆరితోరి గొట్ట వళంగాదు- ఊల్లున్న మనసొంటి బక్క సక్కటోల్లు గల్సి మనసొంటి సంగెం బెట్టుకున్నరు- ఎన్ని సెప్పుతేమున్నది? ఒక్క ముచ్చట సెప్పుత- నేను బోయిన్నాడు పంచాతి జరిగింది- ఏం పంచాతనుకున్నరు? దొంల పంచాతు గాదు. గరీబోల్ల పంచాతు. ఆడి దొరోడు గిట్లనే పెయినిండ రోమాలు బెట్టుకొని పులసోందోడు పిల్లి తీర్గ కూకున్నడు- ఎల్లికి మల్లి బుట్టిచ్చి, తాకటాలు బెట్టి, ఒక్కొక్కని బూమి ఊడగుంజుకున్నడట- ఉంచుకునేటి దంత ఉంచుకొని- మిగిలింది మల్ల ఆల్లకే అమ్మకున్నడట- పంచాతులు పదావులు సెప్పి ఏల పైకం గుంజుకున్నడట- గయ్యాన్ని లెక్కలు గడ్తండ్రి- భూములు దున్నుకున్నరట...."

"దొరోడు అట్టిగనే ఊకున్నడా?" ఎవతో అడిగింది.

"ఊకుండకుంటే ఏంజేత్తడు? ఉరిబెట్టుకుంటడా? అందరొక్కటయినంక- ఆల్లెనుక ఎవలున్నరో ఎరికేనా? ఆడు సెప్పుకునేకాడ సెప్పుకున్నడు- సరే! నీకెవడడ్డమత్తడో సూత్తం- ఆడిదారత్తె నువ్వో మేమో ఉండాల్నని సెప్పింద్రట- దొర కుల మూకుంటడ- పోలీసోల్ల పట్టుకచ్చిండు."

"సీబాంచన్- పోలీసులచ్చిండ్రా....?" ఎవడో బయపడ్డడు.

"రాకేం జేత్తరు? అచ్చింద్రు- అచ్చి కన్పిచ్చినోన్ని పట్టుకపోయింద్రు- ఆడిముండలు దప్ప మొగోల్లు గుట్టకు బడ్డరు- నాత్రియితె పోలీసోల్లకు బుగులు- తెగిచ్చినోన్ని ఎవడేంజేత్తడు? ఆల్లెందో సకుసలేటులట- మంచిమాటకు మంచోల్లట- పోలీసోల్లకు ఆల్లంటె ఉచ్చ పడ్తదట- పొద్దందాకుండి మల్లత్తమని ఎల్లిపోయింద్రు పోలీసోల్లు- నాత్రిపొయి దొరింటిమీన దండన జేసింద్రు గరీబోల్లు- దొరకు ఉచ్చ బడ్డది- తెల్లారి దిగచ్చి, ఇగ మీరే సెప్పుండ్రా ఎట్ల సెప్పుతె అట్లింట నన్నడట- గది పంచాతి.... ఇన్నారుర్రా!"

"అబ్బో! నాలెముచ్చు దొరోడు ఎత్తేసిండాలె...." రొడ్డోడు ఇగిలిచ్చిండు.

"ఎయ్యనియ్యిరా- ఎత్తులే ఎయ్యనియ్యి, పిత్తులే పిత్తుకోనియ్యి- గయ్యన్నిడిసిపెట్టి ముంగట బడ్డదానిమీన ఇసారిచ్చుకుందాం- మనం పనులు బందుసేత్తం ఏమయ్యిద్ది? మా అంటె మంచిమంచోల్లను పిలిపిచ్చి కొడుతడనుకుంట- కొట్టనీయ్. ఇప్పుడు ఊకుంటండా? ఇగో సూడుండ్రి! తల నెరిసినోన్ని, పెద్దెద్దసొంటోన్ని, కాటికి కాల్లు జాపుకున్నోన్నిన్ని- నా పెయిల బొక్కలకు మాంసమున్నదిరాని? లేదు- కొంజీవునంతోని బతుకుతన్న గీ ఈడుల మడికట్ల దున్నుతానుర నేను? గ బురుదల కాలు లేత్తదా? దున్నంగ పాతకాక నాగలాపి ఒడ్డుమీన గేరచ్చి పన్న- ఏన్నుంచచ్చిండో? మడికట్టుమీన ముల్లుగట్టిరిగె దనుక గొడ్డును గొట్టినట్టు కొట్టిండు. నీకాల్ మొక్కుత దొర అరం రోజులవట్టి జెరంగొడ్తుంది- కాల్సేతులు సులుకు సులుకున బొడుత్తన్నయ్- నన్ను సంపకుండ్రి దొర- గిప్పుడే గేరచ్చి ఒడ్డుమీన ఒరిగిపోయిన దొర, అని కాల్ల కంగి మొక్కిన- ఊకున్నడా? తోలు పికులగొట్టిండు-" సినిగిన బనీను పేగిడిసి ఈపు అందరికి సూపెట్టిండు- ముడుతలువడ్డ నల్లటి సెర్మము పికిలిపొయి ఎన్నంత జెరిపోతులోలె దద్దులు.

అడునోల్లంత ఇసారంల బడ్డరు.

"మరందేత మనమేంజెయ్యాలె- నేను అని దెబ్బలకు సచ్చిన్ననుకో- ఇంటిమీద మొగడు సచ్చున్న నా కోడలు బతుకేం గావాలె? ఇంకా కండ్లు దెరువని దానిపోరగండ్లు నా మనుమల బతుకేం గావాలె? నెత్తురున్నంతసేపు సేపిచ్చుకున్నడు. ఇయ్యాల్ల ముసలెద్దును కోత కమ్మినట్టు నన్ను మెడల మీన కట్టేసి బాలమల్లు దొబ్బేసిండు. రక్తం ఉడిగిన నేను ఏమైపోవాలె? నా ఒక్కని బతుకేనా గిట్లున్నది? మనందరం ఎట్ల బతుకుతన్నం? ఆకరుగ నేను అనేదేందంటే- ముసలోన్నో ముడిగోన్నో అన్ని సూసినంక సెప్పుతన్న- ఇయ్యాల్ల మన సేతులేసిన రూపాయి మనదే- ఉంచుకోండ్రి- ఎవలం పనులకు కదులద్దు- బొండిగెలు కోత్తడో? మనకు అన్నన్ని ఇత్తులే ఇత్తడో, తేల్సుకుందాం-" అని సొరిగిన సిల్లుల పంచెపేగు కెల్లి సూసుకొని గోడ ఒరిగిపోయిండు.

"అరి! పొట్టి పెద్దిగ! ఇంటన్నావురా?" గూనెంకటి గునిసిండు.

"అగో- పెద్దిగాడు- ఊరిదారి బట్టిండు. బాలమల్లుకు ఊత్తడు. అని కడుపుబ్బక రావచ్చు. లంజకొడుకు- పుండకోరు- " బొత్తయ్య పండ్లు పట పట గొరికిండు.

కట్టమీన నిలుసుండి నొసలుకు సెయ్యడ్డం పెట్టుకొని నిక్కి నిక్కి సూత్తన్న బాలమల్లు ఒక్కతన్న కయికిలిది కనిపియ్యక సిర్రు బుర్రు లాడిండు- మల్ల మల్ల పల్లెకెల్లి ఎదిరెదిరి సూసిండు.

బువ్వలు దినే యేల్ల దాటి పోయినంత షెకెదాదు రాజయ్య కాళ్ళీడ్సుకుంట తిట్టుకుంట కట్టమీని కచ్చిండు.

"దొంగ లంజెలకు రూపాయి సాలదట- ఇత్తులియ్యాల్నట- ఇత్తులు. దొర నాగండ్లిడిపిచ్చి, జంబులు ఇడిపిచ్చి పొరుగూల్లలకు మనిద్దరిని పొమ్మన్నడు. ఆడి కయికిలి మూడైన సరే ఇగ్గుక రమ్మన్నడు. ఈల్ల అంతం సూడంది ఒదుల సన్నడు. ఊరుకేదో నాశిడగాలం మూడింది గని-" రాజయ్య, బాలమల్లు కట్టమీన కూకుండి సాన సేపు మాట్లాడుకున్నరు.

గ దినం ఊరు ఊరంత మల్లగుల్లాలు పడ్డది-

"తెగె దనుక లాగటం మంచిదిగాదెమొ?"

"తెగేదేంది? ఎటన్న తెగుతనే మంచిదిగద- ఎన్నేండ్లు గీ ముసుగుల గుద్దులాట?"

"యాట నోట్లె నాలుక లేకుంట ఇచ్చినంత పుచ్చుకొని సచ్చేదనుక పని జేత్తన్నమ్- యాటకేట తోకలు గోత్తండు గని- మరి గది కట్టం సుఖం అని ఇసారిత్తండా?"

"అనికేం తీటని ఇసారిత్తడు- ఒకని కడుపునొప్పి ఒకనికేం ముద్దు? కడుపు నొచ్చినోడే ఓమ బుక్కాలె-"

"అవ్వయిన అడుగంది బువ్వేయదు !"

"కడుపుకు సాల్త లేదని అడగింది తప్పేనా?"

"మంచిమాట కెవడింటడు? అల్లకు అడ్లరాసులు కనిపియ్యాలె- గవి సిన్నకొత్త ఖర్సులేకుంట అమ్ముకోవాలె- బంగులమీన బంగుల గట్టాలె-"

"కూలి లంజ కొడుకులు సత్తేంది బతుకుతేంది?"

"గ సావే- ఒంటొంటిగ సావకుంట కట్టగట్టుకొని సత్తాము-"

ఏందో అడ్లుపెరుగు గలిపినట్టున్నది. గిదంత కొత్తకొత్తగున్నది- అల్లు రాసైరి. మనమేమొ నాలుగుమట్ల సొచ్చేల్లి నోల్లం గామాయె-"

"అల్లు కమ్మంటెనే ఆకలయితందా? అల్లు అడుగమంటె అడుగుతవు గని లేకుంటె ఊకుంటనా?"

"దైర్నానికని-"

"ఎవడన్న పొయి రారాదుండ్రి-"

"ఎక్కడికని పోవాలె-"

"సెంద్రయ్య గిడుంటనని మొన్న సెప్పిండుగద-"

"నెత్తిమీన పొద్దు జారిపొయేటాల్లకు సెప్పిరావచ్చు-"

గిట్ల తలోమాట అనుకున్నరు- ఒకని గుడిసెల కొకడు రాయబారాలు సేసింద్రు. తుప్ప తుప్ప ఊంచుకుంట మొక్క సుట్టలు తాక్కుంట గునాంచుతున్నరు. ఆకరుకు బొత్తయ్య పయన మయ్యిండు.

16

ఊరులుకు మగ్గింది- ఉన్నోల్లు తిని నిర్రందిగ గుర్రు కొడుతంద్రు. లేనోల్లు కండ్లలత్తు లేసుకొని రేపటి కోసరం ఎదిరి సూత్తంద్రు- రేపటి గడియ ఎట్లత్తదో ఎవల కెరుక? కడుపే నిండుతదో- కర్మమే మూడుతదో- ఎవడు సెప్పచ్చిండు- లేనోని బతుకు గ్యారంటేమిటి? అని కడుపు నిండానన్న కర్మ కాలన్నన్నా దొరలే కదా సేసేటిది- దొరలకు ఏ గడియల ఏపురుగు దొలుత్తదో ఎట్ల సెప్పత్తది? తెల్లార్తె గద మల్ల గిదంత?

అగొ గసొంటి అద్దమ నాత్రి- మైసమ్మ సింతకింద కట్టకొమ్మకు కూడ దగినోల్లంత కుప్ప కూడింద్రు-

సెంద్రయ్య అందలేదు. ఆనందమచ్చిండు-

"గిది మన సిట్ట సిమాంటపని. మొదటి అడుగు- దొరలు ఏసే ఎత్తులన్ని ఏత్తరు- నక్క జిత్తులమారి పెకెదార్లు నానబెట్టె మాటలు సెప్పుతరు. బుదురకిచ్చి బుల్లేత్తరు- అట్లకాకుంటె అదులగొడ్తరు- ఎట్ల యితేంది? నయాన్నో బయాన్నో బెదిరిచ్చి అంగ దీయ సూత్తరు. ఎన్ని టక్కుటమారాలు, ఎన్ని పగటిబాగోత పేశాలేసినా ఎనుకకు తీసేదిలేదు-" గిట్ల నర్సింహం సెప్పవలసిందంత సెప్పిండు.

అటెనుక ఆనందం ఏయే పూల్లల్ల ఎట్లెట్ల సంగాలు బెట్టుతున్నరో, ఎట్లెట్ల బూములు దున్ను కుంటంద్రో, ఏదొర ఎంత బాకి దేలిందో, ఎట్లెట్ల జనం దొరల ఇసారిత్తంద్రో ఎరికసేసిండు.

ఆకరున బద్దిలింగయ్యను సంగం పెద్ద సేసుకున్నరు-

"మాటంటె మాటే- సచ్చిన బతికినా ఎనుకాడేది లేదు-" గిట్ల బద్దిలింగయ్య అనికే గొంతికతోని నడిఝాము నాత్రి తిరిగిపోయే దనుక సెప్పిందే సెప్పిండు. ఇనేదే మల్లింటన్న అందరు సెవులొగ్గి ఇన్నరు.

మబ్బు కమ్మకచ్చింది. తుపతుప సినుకులు పడంగనే ఎటోల్లటు ఇచ్చుక పోయింద్రు-

బొత్తయ్య అట్లచ్చి గుడిసెసూరు కింద గుడిసేపు కూకున్నడు. ఎందుకనో ఎక్కడెక్కడియో- ఎప్పటెప్పటియో, సంగతులు యాదికత్తన్నయ్. అట్ల పత్తాయించుకుంట గుడిసెలకు సడిసి నిట్టాడు కొరిగిండు- ఎప్పుడంటుకున్నదో- కన్నంటుకున్నది.

ఎవలో సెయిబట్టి లేపుతంద్రు- ఉలికిపడి లేసిండు.

"ఇగో నిన్నే- గుడిసెనుక అగ్గి పెట్టె గీకినట్టయ్యింది-" దుర్గమ్మ గుస గుస లాడింది.

బొత్తయ్య గుడిసావలికి సడిసిండు- అకాశం తేటగయ్యింది. నెల పొడిసింది. గుడ్డెన్నల గుడిసెల తింటంది- అటిటు తిరిగి ఒంటేలుగుకు గుడిసెనుక దిక్కు నడిసిండు.

నలుగురైదుగురు నిలుసున్నరు. ఒకనిసేతుల సీసున్నది. ఇంకోడు అగ్గి పెట్టె కీకిండు.

"రానే అచ్చింద్రారా -నీయవ్వల-" బొత్తయ్య మొత్తుకున్నడు- ఊరు మీన ఊరుబడ్డది- అరుపులు పెడబొబ్బలు- ఒకల మీనికెల్లి ఒకలురికింద్రు- పోరగండ్లు మొత్తుకున్నరు- అటురుక ఇటురుక మరి కాసేపటికి లొల్లి తామూలు కచ్చింది- బొత్తయ్య గుడిసెనుక గాసునూనె సీసాలు, అగ్గిపెట్టె, ఎండుగడ్డి దొరికినయ్.

"తప్పిచ్చుక పోయింద్రు నాకొడుకులు- అద్దుమ నాత్రచ్చింద్రు- దొరికే దుంటె మెడగొరికి పెద్దమ్మకు అరమిచ్చెటోన్ని" బొత్తయ్య తిట్టిండు.

"తాగున్నరేమొ లంజకొడుకులు- ఆనకాలం గుడిసెలుకాల్త యనుకున్నరా?" ఎవడో ముసలోడు.-

"మొదటి దెబ్బ తీసింద్రన్నమాట-" గూనెంకడు పత్తాయించుకుంట అన్నడు.-

* * *

"సెయ్యిపన్న దోటి, సేసిందోటి లంజకొడుకుల్లారా! తాగద్దుర్రా లంజకొడుకుల్లారా అంటె ఖాతరు సెయ్యరు-" ప్రతాపరెడ్డిదొర నర్సిమ్మావతారం మెత్తిండు.

ఒకడు కట్టుకున్న దోతిల్నే ఉచ్చుబోసుకున్నడు- కడుమోల్లు గజగజ అనికింద్రు- ఒకడు మెల్లంగ దైర్నంజేసి-

"ఊరులుకు మగ్గిన కాన్నుంచి సూసినందొరా! ఏడబోయింఁడ్రో గుడిసెల ఒక్కడు సుత లేడు- తెల్లారి పోయేటట్లున్నది. అట్లిగత్తె తమరు ఊకోరని గ పనిజేసినమ్. ఊరు ఊరంత ఎంటురికచ్చింఁడ్రు- లేసి నేల్ల మంచిదిదొరా! తల్లి కడుపుల నుంచి పుట్టచ్చి నట్లు ఉరికచ్చినమ్- లేకుంటే- సిత్యాసిత్యా సితుక బొడిసెటోల్లు- అల్లు ఊనిన పులులోలె కోపంగున్నరు దొరా!"

ఏమనుకున్నదో ఏమో అందిరిని పొమ్మన్నడు. బాలమల్లును పిలిపిచ్చి అంక సెందాలం తిట్టిండు.

పరాయి ఊల్లోల్లు నాట్లేయ రాలే- ఎటు దిక్కులేనోల్లు కొందరచ్చి పదెకరాలు నాటేసెటాల్లకు సుక్కలు రాలినయ్- పది దినాలు గిట్లనే గడిసిపోయినయ్.

కయిలిసేసిన పొలాలు బల్లసరుసుక పోయినయ్- నారుమల్లు పెరిగిపోయినయ్- పరితాపరెడ్డి కాలుగాలిన పిల్లోలె తిరిగిండు- బాలమల్లును, రాజయ్యను తిట్టిండు, ఎటు సాతకాక.

రాజీ బేరాలు మొదలయినయ్.

"అడ్లే అన్నంత గొలుత్త గని, కరకర పొద్దుపొడుపంగ పొలంల ఉండాలె- పొద్దుగూకినంకనే ఇంటికి బోవాలె-" అనే శెరుతు బెట్టిండు.

కూలోల్లంత ఉపాసలుప్పిల్లుండి కంటగతికచ్చింఁడ్రు.

మొత్తంమీన పదిదినాలు ఆగిపోయిన నాట్లు మల్ల మొదలయినయ్.

"పొద్దుపొద్దూన లేసి పొలమెల్లినాడే- దమ్మసారి దమ్మన్న-
పొలమెల్లినాడే దమ్మసారి దమ్మన్న-"

సెరువుల తడల తీర్గ పొలాలల్ల కూలోల్ల పాటలు మోగినయ్.

"అగో దొర ఆకరుకు దిగచ్చిండా లేదా? ఇగ మనమంత గిట్లనే కట్టుమీనుండాలె" నన్నడు బద్దిలింగయ్య.

"నిచ్చమే.... నిచ్చమే...." అన్నరు కయికిలిగాల్లు.

"గిప్పుడేమయ్యింది- ముంగటున్నది ముసుల్ల పండుగ-" నర్సింహం అన్నడు.

17

ఏడాది తిరిగి పోయింది-

గీ ఏడాదిల ఎన్నెన్ని జరుగాల్నో అన్నన్ని జర్గిపోయినయ్- ఎప్పటినుంటో జర్గుతన్నయే మల్లమల్ల జర్గుతన్నయ్- కని అన్ని ఒక్క తీర్గనే జరుగుతన్నయ్- దొరలు

సేయవలసిన కిరాతకాలు సేత్తనే ఉన్నరు- కూలోల్లు కూటికి సాలక తిరుగ బడతనే ఉన్నరు.-

అగో గసోంటి ఎన్నో తిరుగుబాట్లను, అనిసివేతలను, కూలోల్ల పోరులను, జరుగు బాటులేక సేనుకొనే సర్దుబాట్లను కాలం తన కడుపున కుమ్మకొని సాగుతనే ఉన్నది. దినాలు గడిసినయ్- నెలలు గడిసినయ్- గ ఊల్లెఉన్న ఎకరా అరెకురం పేద రైతుల బూములు, దొర, షావుకారి, మాలిపటేల్, పట్వారి, మోతెపరి రైతుల బూముల్ల కల్సినయ్. కూలోల్ల సింతలకు కాసిన సింతకాయ, ఇంటెనుక పబ్బులకు గాసిన సిక్కుడుకాయ- పెంచుకున్న కోడిపెట్టలు, పోవల్సిన కాడికి పోయినయ్- నజరుబడ్డ ఆడోల్లు మరి కొంతమంది దొర లోగింట్లకు ఈడ్సుకపోబడ్డరు- కని గట్ల జరిగిన అన్నిటికి అందరు కుప్పకూడి అనుకున్నరు- ఏడ్సిన ఏడ్పులు మైసమ్మ సింత కింద మంటలు రగులగొట్టినయ్- తర్జబర్జనలు లేసినయ్.

మరి కొంతమంది పాలేరోల్ల ఈపులు పలిగినయ్- ఇంకొంత మంది ఉన్నదంత ఊడ్సుకపోయి రెక్కలు మిగిలిచ్చుకున్నరు- కొందరి తలలు తాకట్లు బడ్డయ్.

గింత కాలం నర్సింహం పౌరుషంకొద్ది మోతెపరి రైతుల బూముల్ల కయికిలి జేసిండు- ఏడికిబొయిన ఏదే మానుకలు.... ఆకరుకు ఊల్లె మూడుసుక్కల భూమి గలిగున్న దొర చేండ్లల్లకు పనికిబోక తప్పలేదు.

పది దినాలు ఎర్రటెండల కర్రెపిట్టోలె మాడి, కత్తెరపెళ్ళల్ల అరిపాదాలు సిలసిల నెత్తుర్లు సిమ్మంగ, అంచిన నడుమెత్తకుంట తెల్జొన్న కోతలుగోసి, పదోనాడు గంపలు బట్టుకొని కయికిల్లకు అందరు బోంగ తనుసుత బోయిండు నర్సింహం.

బాలమల్లు కాయిదం సదివి ఒక్కొక్కల పేర్లుబెట్టి పిలుత్తుండు- పెద పాలేరు సిన మొండోడు జొన్నలు గొలిసి గంపల్ల పోత్తుండు.

నర్సింహం అంతు రావుటం దొర రావుటం ఒకపే అయ్యింది.

నర్సింహం పేరినంగనే దొరనోట్ల సికిలేటు కిందబడ్డది.

"నర్సయ్యా పటేలా ! ఎంతమాట ! తమరు కయికిలి సెయ్యటమా ! ఛ-ఛ-" సెప్పుకాలుతోని నర్సింహం ముంగటున్న గంపను తన్నిండు దొర.

నిలబడ్డ నర్సింహం మాట పలుకు లేకుంట దొరను ఎగదిగ సూసుకుంట నిలుసున్నడు- కయికిలిగాడు నర్సింహం పెదవుమీన గావు పడ్డది.

"ఇంకెందుకు నిలుసున్నవుర ?"

"బిచ్చానికి నిలుసుండలే– నీ జొన్నసేండ్ల పురిసెడు సెమటడ్పి కయికిలిత్తుల కచ్చి నిల్సున్న–"

"ఇంక పులుసు సాపలేదన్నమాట! మోర మాదండిగున్నది– నా ఉప్పు పప్పు తినెటందు కచ్చిన పన్నమాట."

"నీ ఉప్పుగాదు– నా కయికిలి–"

"ఇగో పిరికెడిత్తులు నీ మొఖాన గొట్ట– నీ తాత ముత్తాతతోని సెప్పుక పో– లఫ్డికొడుక! ఎవల్నడిగి నా సేండ్లకు కోతలకచ్చినవ్? లీడరువుగాదుర? లీడరవు! పుచ్చిన కుక్కలందరిని కుప్పేసి కయికిల్లు పెంచుమంటవు గాదుర? పద్దెంటుక లేవట్ట సాతగాదు– మాటలు మాదండియి."

కూలోల్లంత బీరిపోయింద్రు.

"దొరవారు, అయిపోయిందేదో అయిపోయింది– నా కర్మమే తక్కువయ్యిందో, నొసలే గాడుదలకాసిందో? మొత్తానికి రెక్కలుసింగులంగ నిలబడ్డ– నేను, నా పెండ్లాం, పోరి పది దినాలు నీల్లు నిప్పులు దాగి కోతలు గోసినమ్–" నర్సింహం దిగచ్చిండు– దిగిరాకుంటే పది దినాల కయికిల్లకు నీల్లు దారిడువాలె.

దొర మాట్లాడలే–

నర్సింహంకు నాబిల కలుక్కుమన్నది– దుఃఖం పొంగుకచ్చింది. పది దినాలు ఎండల్ల సప్పల్లమీని నీల్లుతాగి, నడుములు నొయ్యంగ గొడ్లోలె అంగి, సిలసిల నెత్తుర్లు సిమ్మంగ సేసిన కయికిలి.

"కయికిలోనితోనేంది పంతాలు దొరా!"

"కయికిలిగానివా! లఫ్డికొడుక! నాముంగట అద్దుపద్దులేకుంట ఏమాటదొరుకుతె ఆమాటనంగ ఏడబోయింది గీ బుద్ధి– బంచత్! గిప్పుడే మర్సిపోయిన్ననుకున్నవ– ముందిక్కన్నుంచి కదుల్.... లాకపోతే ఇరిసి కట్టేపిచ్చి తోలు ఒలిపిత్త– ఏ గులాపు లంజకొడుకడ్డమత్తడో సూత్త– మతికుంచుకో! ఇన్నిరోజులు దమ్మిగాసిన గని...." మాట పురాగ అనకుంట పండ్లు గొరికిండు దొర.

"కట్టంజేసి కయికిలడుగుతన్న గని, నీతోటి తిట్లుదినేటందుకు రాలే– దొరవైతే దొరతన ముంచుకోంద్రి– ముందుగాల ఎట్లయిన నీకాడికచ్చిన్నని ఏదిబడితె అదన కుంద్రి– మాజలు జెగర్తగ రానీయ్– ఇంకెన్నేండ్లు మమ్ముల అరిగోస పెట్టుకుంటవ్– ఇంకెన్నేండ్లు మా రెక్కలకట్టం దోసుకుంటవ్?" నర్సింహం అరిసిండు.

" సంధిల దొరికిచ్చు కున్నడు–" ఎవలో మందిల నుంచి–

నర్సింహం అడ నిలుసున్న కూలోల్ల కెల్లి దిరిగిండు.

"సెప్పుంద్రె బానపోసు, సమ్మక్క, శాయన్న, కొంరన్న, బొత్తన్న,

లింగన్న, మీరన్న సెప్పుండ్రే- నేను సుత మీతీర్గనే నల్ల రేగల్లల్ల మాడిన్నని సెప్పుండ్రే-" కడుపు దేవేటట్టుగ అన్నడు.

"పోరాపో- పోరా కుక్క- నీ అసొంటోల్లను నావొంటికలంత మందిని సూసిన- గీ మునలేడుపులు- కుక్క కుయికుయిలు నారోమం బీకలేవు- మాదెర్ సోదు- ఈడు సెప్పుకునే మొగోడట- ఏలంజకొడుకో ఇనే మొగోడట- ఏం జేత్తవురా! నీదిక్కున్న కాడ సెప్పుకపో- సెందురుగాడు మల్ల గీఊల్లె కాలుబెడితె సింత సెట్టుకు సిరుసు ఏలాడ గట్టిత్త- మాకెలవుడ! సంగాలు పెడుతార్రా- మూతిమీన మీసాలు మొలిసి నాయిరా! అప్పుడే కండ్లు నెత్తికెక్కినయ్- పాటలు పాడుతారు- లొల్లిపాటలు గడుతారు- ఏం బీక్కుంటబడిరా నీసంగం గింగం- బంచత్ తుపాకినేసి సంపిత్త ఏమనుకున్నరో! నీయవ్వల కుక్కల్ దెం.... ఎవడన్న నోరు దెరిసిండో సెప్పుతోని నాలుకె తెగ్గోత్త-" నని ఎటంటె అటు దిట్టి బుర్రలరాల్లు పోసి ఊపినట్టుగ నవ్వి నర్సింహం మెడబట్టి దొబ్బిండు.

నర్సింహం మూడు మొగ్గులు మొగ్గి అడికి అసక కింద మల్లె ముక్కు మూసుక పడ్డడు. ముక్కు బెదిరింది. మొఖమంత ఘట్టి కొట్టుక పోయింది. నర్సింహం లేవలేక లేసి ముక్కు తుడుసుకున్నడు. సేతుల నిండా నెత్తురు- ఇగ అట్లచ్చింపె కోపం- కోపంతోని గాలికూగిన జొన్నకర్ర తీర్గ ఊగిపోయిండు.

"నీఅంతం కండ్ల జూత్త- నీరకుతం కండ్లసూత్త-" నని దొరకెల్లి గిదగిద ఉరికిండు.

కయికిలిగాల్ల గుండెలదిరి పోయినయ్. నర్సింహంను పట్టుకున్నరు.

దొర కుడికాలు మొలల సెప్పు నూడబీకి పెడిపెడిన గొట్టిండు- గిరుక్కున ఎనుకకు దిరిగి ఎట్లచ్చిండో అట్ల ఎల్లిపోయిండు మర్రి సూడకుంట.

"దొరోడా! ఇయ్యాల్ల బతికిపోయినవ్- అన్నయిపోయినంక గీ నర్సిమ్మడు ఆఖరేందో తేల్సుకుంటడు- నువ్వన్న ఉండాలె నేనన్న ఉండాలె-" నర్సింహం అందరికి ఇనచ్చేటట్టుగ అన్నడు.

"ఎర్రికుక్క ఊల్లె కుక్కలన్నిటిని కరుత్తది- ఇయ్యాల్ల నర్సిమ్మ... నీ...." దొర మనుసుల అనుకుంట నడిసిండు.

"సూసిండ్రా! అంగి బతుకుతె అఖ్రు మన మానాన మనల బతుకనిత్తరేమొ? కండ్లార సూసిండ్రా- దమ్మిడికి గొరగాని మన బతుకుల...." నర్సింహం నోట్లె ఊరిన నెత్తురూంచిండు.

నర్సింహం ఊంచిన నెత్తురు పడమటి మొగులు పులుముకున్నది- సూరీడు బనం కోపాన్ని దిగమింగుకున్నట్టుగ గూకిండు- గొడ్లు దుమ్ములేపుకుంట ఒర్రుకుంట ఊల్లెకచ్చినయ్.

(ఇంకా వున్నది)

మికాంగ్ నది మళ్ళా కళ్ళు తెరుస్తుంది

1

వియత్నాం ! వియత్నాం !
మొన్నటి నీ చరిత్ర గతిలో
ఉవ్వెత్తున లేచిన వీరత్వం
తల తెగిన మింగ్, ఫ్రెంచి
సామ్రాజ్యవాదం
విముక్తి గీతాలాపం
నిన్నటి నీ చరిత్ర పుటల్లో
పొలం, స్థలం, బడి, గుడి
అణువణువు విప్లవ రణరంగం
పారా, పలుగు, తుపాకితో
జతకలిసి అణుబాంబులై పేలడం
అణచబడ్డ ప్రతివ్యక్తి అగ్నికణమై
సాగించిన మహాసమరం
తోకతెగిన యాంకీ సామ్రాజ్యవాదం
ప్రాణభీతితో పలాయనం చిత్తగించడం
విశ్వప్రజావళి నీ విప్లవ సమరదీక్షకు
సగర్వ నివాళు లర్పించడం—
అంతా మరిచావా ?

2

ఫ్రెంచి ముష్కరుల
మిలిటరీ వ్యూహాన్ని చిత్తు చేసి
డీన్ బీన్ పూలో విజయ పతాక నెగిరించి
ప్రపంచాన్ని మంత్రముగ్ధం గావించిన
ప్రజాసైన్య వీర మాతృమూర్తివి నీవు,
వియత్నాం !
దేశదేశాల యువత గుండెల్లో
త్యాగాల ధృవతారగా వెలిగే
గువాన్ ట్రాయ్‌కి జన్మనిచ్చిన దేశం నీవు!
"అంకుల్ హో" అధ్యాపకుడిగా
విముక్తి పాఠాలు
దిద్దుకున్న పోతుగడ్డవు నీవు !
నాలుగువేల సంవత్సరాలుగా
ప్రకృతిని, సాటి మానవ దౌర్జన్యాన్ని
ఎదుర్కొన్న
మొక్కవోని శౌర్య తేజస్వినివి నీవు !
సింహద్వారం గుండా అమెరికన్ పులిని
తరిమి కొట్టిన నీవు
దొడ్డిదారిలో రష్యన్ గుడ్డేలుగు
నాహ్వానించావు
మూర్ఖంగా నీ భవితవ్యం నెత్తిపై
నీవే పంచుకొండ నెత్తుకున్నావు.

3

పొంచున్న సోషల్ సామ్రాజ్యవాద
ఎలుగుబంటు
నిన్ను నిలువునా మింగేసింది
వోడ్కా సామ్రాజ్యవాదం
కసాయి తనానికి ఉసిగొల్పింది
చావు బతుకుల సమరంలో
కంపూచియా నీకై సాచిన
స్నేహ సౌహార్ద హస్తాన్ని
క్రూరంగా అపుడే మరిచావు
సరిహద్దుల్లో "స్నేహద్వారం" వద్ద
శత్రుత్వానికి ద్వారాలు తెరిచావు
స్నేహ మందారాలు పూయించే చోట
బందూకుల, టాంకుల కవాతు చేయించావు
కంపూచియా విప్లవ పసికందును
వెన్నుపోటు పొడిచావు
నీ మహోజ్వల చరిత్రను
నీ చేతుల్తోనే తుడిచేశావు.

4

గతంలో—
ప్రగతివైపు నీవేసిన ప్రతి అడుగుకు
శత్రువుతో అగ్రశ్రేణిన నీవు
జరిపిన ప్రతి పోరుకు
మా హృదయాలు ఉప్పొంగాయి
వియత్నాం! వియత్నాం!
ఎంత మహోన్నత తేజస్సువి ఆరోజున!

5

నీ విప్లవోద్యమాల స్పందనతో ఉప్పొంగి
గర్వంతో గగనతలాన్ని తాకిన పర్వతాలు
నేడు నీ విప్లవ ప్రతిఘాతకానికి
సిగ్గుతో తలొంచుకున్నాయి
శత్రు సంహారంలో రక్షణ దుర్గాలుగా
తోడ్పడి
నీ విప్లవ కీర్తి ప్రతిష్ఠలకి సాక్షీభూతంగా
పులకించిన అరణ్యాలు
నీ దివాళాకోరు రాజకీయ దౌష్ట్యానికి
మనసంతా గాయమై శోకిస్తున్నాయి
నీ పోరాట గీతాలను
ఉధృత తరంగ రాగంతో పాడుకొన్న
ఎర్ర నది, మికాంగ్ నది
నేడు నీ దగాకోరు పోకడలకు
రక్తాశ్రువులొలికిస్తూ బతిమాలుతున్నాయి
వియత్నాం పేరు నిలపమనీ,
విప్లవ సీమగా బతకమనీ!

6

మిత్రద్రోహీ! వియత్నాం!
దగాకోరు జారు ప్రతినిధీ!
గుర్తుంచుకో—
విప్లవం జయిస్తుంది
సామ్రాజ్యవాదం నశిస్తుంది
కంపూచియా విద్రోహాన్ని జయిస్తుంది
కంపూచియా ప్రజాసైన్యం
మికాంగ్ నదీ సైకత తీరాల్లో
నీ దురాక్రమణ మూకల్ని
ఇసుక గోతుల్లో పాతిపెడుతుంది.

— సి. రామచంద్రారెడ్డి
సాకం నాగరాజు

"అతడు - ఆమె"లో ప్రేమ భావన

వుప్పల లక్ష్మణరావు గారి నవల "అతడు-ఆమె" చదివిన తర్వాత జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఏర్పరచుకోవడం చాలా ముఖ్యమనిపిస్తుంది. ఈ నవల భార్యాభర్తల దినచర్య రూపంలో వుంది. ఒక్క రోజు గురించే దంపతులు తమ తమ డైరీల్లో ఏ విధంగా రాసుకున్నారా అనేది చాల కుతూహలం కలిగించే విషయం ఈ పుస్తకంలో. ఆ దినచర్యల ద్వారానే మనకు ఆ దంపతుల వ్యక్తిత్వాలు, వారి దాంపత్య జీవితం, వారి అభిప్రాయాలు తెలుస్తాయి.

నవల లోని పరిస్థితులు స్వాతంత్ర్యం రాక ముందువి, స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆ రోజులు, గాంధీ, నెహ్రూ తదితర దేశ నాయకుల వుద్యమాలు- అన్నీ

నవలలో వస్తాయి. ఈ స్వాతంత్ర్యోద్యమం యొక్క ప్రభావం శాంతం చిదంబర శాస్త్రిల దాంపత్యంపై పడుతుంది. శాంతం వుద్యమంలో పాల్గొనడం, గాంధీ వాది కావడం శాస్త్రికి యిష్టముండదు. కాని ఆమెకు అడ్డు చెప్పలేక పోతాడు. దేశం గురించి, స్వాతంత్ర్య పోరాటం గురించి వారి మధ్య చిన్న చిన్న అభిప్రాయ భేదాలు వస్తాయి.

ముఖ్యంగా ఈ నవల రెండవ; మూడవ భాగాల్లో నిశితం పరిశీలించిగా తెలుసు కోవలసిన విషయం ఒకటుంది: అదే ప్రేమ విషయం. యువతీ యువకుల మధ్య ప్రేమ ఎలా పుడుతుంది, అవి క్రమక్రమంగా ఎలా వృద్ధి అవుతుంది- అనే విషయాన్ని రచయిత చాల సున్నితంగా పరిశీలన చేశారు. ప్రేమ అనేది అందచందాల వల్ల కలిగే ఆకర్షణతోనే ఏర్పడేది కాదు; మోహానికీ, కామానికీ సంబంధించింది మాత్రమే కాదు అని చాల జాగ్రత్తగా వివరించా రాయన.

సుభ, శాంతం చిదంబరశాస్త్రిల పెంపుడు కూతురు. చాల చురుకైంది, తెలివైంది. ఇంజనీరు జనార్దనరావు ఆమెకు పరిచయస్తుడు. కొన్నేళ్ళుగా ఒకరినొకరు ప్రేమించు కుంటూనే కేవలం పరిచయస్తులుగా వుంటారు చాలా కాలం. అదే వారిలో వున్న గొప్పతనం. సుభ కెంతో మంది అందమైన యువకులు పరిచయమైతారు. వారంతా జనార్దనరావు కంటె పెద్ద పదవుల్లో, హోదాల్లో వున్నవారే. సుభను చేసుకోవడానికి వారంతా వుత్సాహపడుతున్నవారే. సుభ సహజంగా వారి గురించి కొంత ఆలోచించినా అది కేవలం ఆకర్షణే అనుకొని వూరకుండి పోతుంది. సుభ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఏదో ఒకటి చేసి కీర్తి సంపాదించుకోవాలనుకుంటుంది. తన అయిడియాలజీ యింకా గట్టి పడనిదిగా, ఎటూ తేలనిదిగా భావిస్తుంది. తను చేయదలచుకున్న వుద్యమానికి వ్యతిరేకియైన వ్యక్తినే తనకు తెలియకుండానే యిష్టపడుతుంది. దీనికి కారణం- అతని నిజాయితీ, అతని ప్రయోజకత్వం, అతని చిన్ననాటి కష్టజీవితం ఆమెను ప్రభావితం చేయడమే, ఆలోచింపచేయటమే. మనిషికుండవలసినసి న్సియారిటీ ఆమె కతనిలో కనిపిస్తుంది. మెల్లగా అతనివైపు ఆకర్షితురాలవుతుంది- అతనూ అంతే. ఆమె చురుకుదనాన్ని, కలుపుగోలుతనాన్ని, తెలివితేటలను చూసి చాల యిష్ట పడతాడు. కానీ ఆమెను చేసుకోవాలనుకుని, ఆమె చుట్టూ తిరిగే యువకులను చూసి వెనుకాడతాడు. అయినా ఆమెపట్ల అతనికున్న ప్రేమనూ, గౌరవాన్నీ మాత్రం తీసి వేసుకోలేకపోతాడు. ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకోకముందు తొందర పడడం ఎందుకనే మనస్తత్వం వాళ్ళిద్దరిదీ. పెద్దపెద్ద పేరీజీల నుంచి లంచాలుకాదన్న

జనార్దనం సుభకు గొప్పగా కనిపిస్తాడు. ఎన్నో సందర్భాల్లో ఈ విషయం గురించి మాట్లాడాలనుకుంటారు- కానీ మాట్లాడలేక పోతారు. ఇద్దరు కలిసి ఏ రంగంలోనైనా పనిచేస్తే ఒకరికొకరు మరింత దగ్గరకు రావచ్చనుకుంటాడు జనార్దనం. ఏది ఏమైనా కడుపులోని మాట ఖచ్చితంగా బయటపెట్టడం అవివేకం అనుకుంటాడు. ఈ విధంగా ఎవరికివారు యింకొకరి గురించి మథనపడతారు, ఆవేదన చెందుతారు- వారిమధ్య మానసిక ఆకర్షణ ఎక్కువవుతుంది. మానసికంగా వారు దగ్గరై పెళ్ళిమాట మాట్లాడుకునే సరికి చాలాకాలం పడుతుంది. అప్పటికి ఒకరికొకరు పూర్తిగా తెలిసిపోతారు.

ఇద్దరు కలిసి ఏదేనా ఒక పని సమిష్టిగా సాధించాలని జనార్దనం ఆశ. అవిధంగానైనా వారి మనసులు ఏకమవుతాయని, ఇవన్నీ- సుభ పెళ్ళి గురించి అడిగినప్పుడు మనసు విప్పి మాట్లాడుకున్న విషయాలు. అప్పటికీ వాళ్ళిద్దరు చేతిలో చేయేసి ఏ ఖరారూ చేసుకోరు. పెళ్ళి రెండు మూడేళ్ళు వాయిదా వేస్తారు. ఈ లోపు వేరే ఎందరో పరిచయమవుతారు యిద్దరికీ. అప్పటికీ పెళ్ళి గురించి వారి అభిప్రాయం మారకపోతే చేసుకుందామనుకుంటారు. సుభ జనార్దనంతో అన్న మాటలు చూడండి; "నువ్వు ఈ మూడు నాలుగేళ్ళు నీ యింజనీరు ఆఫీసుతోనే ముడి పడిపోక నలుగురితో తిరుగు. ఆంధ్ర సభలో చేరు. నాటకాల్లోనూ, వేడుకల్లోనూ పాల్గొను. నా కంటె వుత్తములైన అమ్మాయిలతో పరిచయం కల్గొచ్చు, అప్పుడు నిన్ను మళ్ళీ అడుగుతా- నన్ను చేసుకుంటావా?- అని" జనార్దనం ఏమీ అనలేకపోతాడు. అతనికి చాలా నమ్మకం- తనకు ఎంత మంది అమ్మాయిలు కొత్తగా పరిచయమైనా సుభే తనకు భార్య అవుతుందని. అటువంటి నమ్మకం, ఆత్మ విశ్వాసం నిజమైన ప్రేమికుని లక్షణాలు. ఇదే యువతీ యువకుల మధ్య ప్రేమ పరిణామగతి. ఇదే ఎప్పటికీ నిలిచేది. వాళ్ళిద్దరి మధ్య కలహాలు రావని కాదు, కానీ వచ్చినా వారి జీవితాల కంతరాయం కలిగించ లేవు. అటువంటి నమ్మకం యిద్దరి కుండాలి.

యువతి తాను చేసుకోబోయే వ్యక్తిని పూర్తిగా అర్థంచేసుకున్నరోజే సంతోషపడాలి; పెళ్ళి చేసుకున్న రోజు కాదు. మానసిక పరిచయంలేని వ్యక్తుల అట్టహాస వివాహం కంటె- ఎంతో చెలిమిచేసి ఒకరినొకరు తెలుసుకున్న వ్యక్తుల నిరాడంబర వివాహమే చాలా గొప్పది, చైతన్యవంతమైందీ.

పెళ్ళిళ్ళు చేసుకునేది ప్రకృతి సహజమైన అనుబంధం కోసమే కాదు: యిద్దరూ కలిసి సంఘానికి న్యాయం చేకూర్చడానికి, దాన్ని చైతన్యవంతం చేయడానికి కూడా. పెళ్ళి చేసుకునేది శరీరాకర్షణలోపడి పిల్లలను కనడం కోసం మాత్రమే కాదు; పుట్టిన

పిల్లల్ని యిద్దరూ కలిసి సక్రమంగా తీర్చిదిద్దుకోవడం కోసం కూడా, శృంగారం పెళ్ళిలో ఒక ముఖ్య భాగమే అయినా అది పెళ్ళికి నాంది కాదు. ఇద్దరు వ్యక్తుల్లోని మానసిక చైతన్యం ఏకమైతేనే పెళ్ళి. అది సాధించడానికి వ్యక్తిగతంగా ఎంతో కృషి అవసరం. కానీ, డాబుగా, దర్పంగా, ఎంతో డబ్బు వెచ్చించి పెళ్లి చేసుకొని- తర్వాత ఒకరి నొకరు అర్థం చేసుకొని సంఘం కోసం కృషి చేయడం వట్టి మాట. సాంఘికాభివృద్ధికి కృషి చేసే యిద్దరి వ్యక్తిత్వాలూ నిండుగా వుండడం అవసరం. అందుకోసం ఎంతో జాగ్రత్తగా అభివృద్ధి పరంగా, చైతన్య వంతంగా, గట్టిగా పునాది వేయాలి. అదే పెళ్లి. ఈ విషయాల్ని కథగా అల్లి ఈ నవలలో చక్కని సందేశం యిచ్చారు రచయిత.

— రేణుక

సింగరేణిలో సితికెడు బతుకులు

హుస్సేన్

సింగరేణి కంపినీలో
సితకాబడ్డ బతుకూలోడ
ఒక్కబయ్యి సెడువరో
బరిగీసి నిలువరా ||సింగ||

ఊరూ విడిసి పల్లెవిడిసి
బతుకూ కొరకు బాయిలకచ్చి
బాధల కోరిస్తివా
బతుకునె సాగిస్తివా ||సింగ||

సిన్నా గుడిసె సీకాటిల్లు
తలుపూలేని తడకా కొంప
బతుకూ మార లేదురో
బాధా తీర లేదురా ||సింగ||

చేసేటోడు కూలోడాయె
చూసేటోడు దొరోడాయె
కూలోడు కుంగిండురో
దొరోడు పెరిగిండురా ||సింగ||

కండకరుగ కష్టపడి
కంపిన్నేమొ పైకీతెస్తె
కార్లు దొరల కచ్చెరో
కాలీ నడకె సీదిరా ||సింగ||

కొత్తాదొర కొలువూకస్తె
కొత్తా బంగ్లా నిలువూకచ్చె
దొరలకు కరువు లేదురో
బతుకు బలే సాగురా ||సింగ||

బంగ్లాసుట్టు పూలా చెట్లు
ఖరీదైన బంగ్లరో
గుడిసేసుట్టు తంగెడు చెట్లు
కంకా బొంగుల గుడిసెరా ||సింగ||

వందా యిండ్ల కొక్కాదిక్కు
వాడా కంత ఒక్కానల్ల
చిమ్మని చీకట్ల రో –
గుడిసె కాన రాదు రా ||సింగ||

పొయ్యి కాడ నల్లా దొరకు
పాయకాండ్ల నల్లా దొరకు
స్తాన మాడ నల్లా దొరకు
బట్టాలుతుక నల్లా దొరకు
చెట్లా కొరకు నల్లా దొరకు
ఇంటీ మీద ట్యాంకు దొరకు
బంగ్లా సుట్టు లైట్లు దొరకు
అర్ర కొక్క ఫ్యాను దొరకు
దొర బతుకును సూడరో
మన బతుకును సూడరా ॥సింగ॥

దోపీడోల్లు ఉన్నన్నాల్లు
దొరలా రాజ్యమున్నన్నాల్లు
బతుకూ మార బోదురో
బాధ తీర బోదురా ॥సింగ॥

ఓపీకేమొ ఒడిసీ పాయె
సంగా తేమొ తెలిసీపాయె
సంఘా పోల్ల గల్సు కోని
సంఘా బలం పెంచూకోని
సెమ్మాసులే ఎత్తరో
శ్రమ జెండా ఎత్తరో ॥సింగ॥

ఆమె

ఆర్. పి.

ఆమె-
పుట్టింది
ఆకలి మంటల ఆర్తనాదాలలో
ఆమె-
పెరిగింది
చనుబాలు లేని
తల్లి కుంపటి గుండెలలో

ఆమె-
చదివింది
కండ్లకు కునుకు లేక
శ్రమ చేస్తూ
రాత్రింబగళ్లెరుగని
దడి లేని
గుడిసెల మాటున
క్రుంగి క్రుశించి పోతున్న
అభాగ్య జీవుల
మూగ హృదయాల స్పందన

అందుకే

ఆమె
ఊపిరి "విప్లవం"

ఆమె
మాట "పోరాట బాట"

ఆమె
నివాసం ప్రజల ఆకాంక్ష

ఆమె
"కో" అంటే
కోటి గొంతులు ప్రతిధ్వని చేస్తూ
పొలాలల్లో ఒళ్ళు విరుచుకున్న
మాగన్ను చైతన్యాన్ని
తట్టి లేపుతాయి

ప్రజలతో
ఆమె

ఆమెలో
ప్రజలు- నివసిస్తారు

ఆమెకు
చావన్నది లేదు
చావుకే
చావు పాడె

తయారు చేస్తున్నదామె
ప్రజా వాహిని
పోరాట స్రవంతి ఆమె.

దీక్ష

వెంకన్న

అమరుల రక్తం జడివానలుగా కురిసి
చెట్లూ, చేమలు, ఎర్రపూలు పూచాయి
కాలువలూ, నదులూ, ఆకాశం
అన్నీ ఎర్ర బారాయి
కొత్త పొద్దును చూసి జనం మేల్కొన్నది
వసంతాగమనానికి మా పల్లెలు
పులకించాయి
కోయిలలు ఎర్రి పాటలు పాడాయి
రైతు- కూలీల చేతుల్లో
ఎర్రి జండాలు రెపరెప లాడాయి
వసంతాగమనంపై ఉక్కు పాదం మోపి
కల్లోలం సృష్టించింది భూస్వామ్యం

ఎన్ని కష్టాలైనా అధిగమించి
వసంతాన్ని కాపాడుకొంటాం;

ఇనుప చేతులతో
మండే గుండెలతో
యుద్ధానికైనా సిద్ధ పడతాం
గాలి వానలకు వెరవం
హద్దులు లేని చైతన్యంతో
కొండ గట్లను సైతం ఢీ కొంటాం
శోషలిజం కోసం ఎత్తిన మా
చేతుల్ని దించం
రక్తాన్ని చిందించడానికైనా వెరవం.

[కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల
రైతాంగ పోరాటాల ఉత్సాహంతో]

గడ్డి పోచలు

కె. భాస్కర్

విశాల ఆకాశం కింద
నీడలేని నిర్భాగ్య సోదరులారా!
గడ్డి కోసే నా గరీబు అన్నలారా!
కుటిల నేత్రపు చావు ఉక్కు గోళ్ళు
మిమ్మిలా ఘోరంగా ఎత్తుకు పోయినపుడు
ఒక్క కన్నీటి చుక్కైనా కార్చడానికి
ఎవరికి పట్టింది?
ఈ విశాల ప్రపంచంలో
మీ వెలితిని ఎవరు స్పందిస్తారు?

అయినా,
మీ మరణం
పూరించ లేనంత గొప్పది కాదు కదః
పత్రికల పతాక శీర్షికల్లోనో
ప్రత్యేక అక్షరాల అలంకరణల్లోనో
చేరేందుకు
మీ అర్హత ఏమిటి కనుక?
అద్భుతంగా మీరు చావు నుండి
బయటపడ్డా

రచన - భాష

కె. రాంమోహన్‌రాజు

ఒక రచనను రచయిత పాఠకులకు అందించేటప్పుడు అతని భావం విశాలమై వుంటుంది. ఆ రచన విస్తృత ప్రయోజనకరంగావాలని అతడు కోరుతాడు. అతనట్లా కోరడం న్యాయమైనదే. అయితే ఒక ప్రాంత రచయిత అక్కడి ప్రజా జీవితాన్ని అక్కడి మాండలికంలో రాసినందువల్ల ఆ రచనకుద్దేశించబడిన విస్తృత ప్రయోజనం అనే లక్ష్యం సిద్ధిస్తున్నదా! ఆంధ్ర ప్రదేశ్‌లో జనరల్‌గా మూడు నాలుగు మాండలికాలున్నాయని అనుకున్నా క్షుణ్ణంగా చూస్తే ఏ జిల్లాకి ఆ జిల్లా తన ప్రత్యేక మాండలికాన్ని కలిగివుంది. ఒక జిల్లా మాండలికంలో రాయబడ్డ రచన వేరే జిల్లాల ప్రజలకి కొంచెం శ్రమపడితే అర్థంకావచ్చు గానీ తన రచన నేరుగా పాఠకులకి చేరాలంటే రచయిత భాషకు సంబంధించినంతవరకు పాఠకులకి ఇబ్బంది ఇవ్వగూడదనే అనుకుంటాను. మాండలికంలో రాయడంవల్ల రచనయొక్క ప్రయోజనం సంకుచితం కాకుండా చూడాలి. ఈ విషయం నేను ఒక సుప్రసిద్ధ కవితో మాట్లాడితే— ఆయన "ఒక ప్రాంతంలో ఉద్భవిస్తున్న విప్లవ శక్తుల గూర్చి తెలుసుకోవాలనే జిజ్ఞాస ఇతర ప్రాంతాల ప్రజలకి ఉంటే వారు మొదట్లో కొంత ఇబ్బంది పడేమాట నిజమేఐనా ఆభాషను నేర్చుకొని అక్కడి పోరాట సాహిత్యాన్ని దాని అభివృద్ధిని అర్థంచేసుకుంటారు. ఒక విశాల ప్రాంతంలో మాట్లాడబడుతున్న భాషను నిర్లక్ష్యం చేయడం తగదు గదా!" అని చెప్పారు.

మన రాష్ట్రంలో విద్యావంతుల సంఖ్య, దానిలో పత్రికలు చదివేవారి సంఖ్య, దానిలో రాజకీయాసక్తివున్న పాఠకుల సంఖ్య, ఇంకా దానిలో విప్లవ రాజకీయాసక్తి వున్న పాఠకుల సంఖ్య బేరీజువేస్తే సాధారణ భాషలో రాయబడిన విప్లవ రచన ఐనా గూడా కొద్దిమంది పాఠకులకు మాత్రమే చేరుతుంది అనేది స్పష్టమవుతుంది. భారత దేశపు అక్షరాస్యుల సంఖ్య నూటికి ఇరవైమూడు మాత్రమే. దీనిలో విప్లవ రచనలను తమకు పరిచయంలేని మాండలికంలో నైనాసరే చదివి తీరాలనే ఆకాంక్ష ఎంత మంది పాఠకులకుంటుందో ఆలోచిస్తే కొంచెం విచారించాల్సి వుంటుంది.

నేలను కరుచుకున్న మీ గుడిసెల్లోకి
ప్రవాహంలా వచ్చి
మిమ్మల్ని అభినందించేది ఎవరు?
మీరు ముఖ్య మంత్రులు కారు
వి. ఐ. పీలు కారు
నగర ప్రముఖులూ కారు
మరణించిన మీరు ఎందరైతే నేం
సముద్రంలో ఒక నీటిబొట్టు!

(చెన్నారెడ్డిని బతికించిన విమానం గడ్డి కోసుకునే వాళ్ళను చంపినపుడు)

మాండలికంలో రాస్తే మాత్రమే జనానికి బాగా అర్థమవుతుందా? అట్లా లేకపోతే అర్థంకాదా? దీనికి వుదాహరణగా- సినిమాలని చూపించవచ్చును. సినిమాల్లో భాష ఎలావుంటుందో అందరికీ తెలిసిన విషయమే. ఆ భాష ఏ ప్రాంత ప్రజలకైనా ఎంత వెనుకబడ్డ జనానికైనా అర్థం అవుతూ వుండగా సాధారణ భాషలో రాయబడ్డ రచనలు ప్రజల్లోకి ఎందుకు పోవు? మాండలికం అనడంలోనే ఒక మండలానికే పరిమితం అన్న సంకుచితార్థం వున్నది. విప్లవం విశాల ప్రజానీకం కొరకైనప్పుడు, విప్లవ ప్రయోజనాన్ని నెరవేర్చడానికి లక్షించబడ్డ రచన గూడా విశాల ప్రజానీకం కొరకే ఉండాలి. అట్లాకాక మాండలికంలో వున్నందువల్ల అది తన విశాలతను కోల్పోయే ప్రమాదం వుంది. మాండలికం అనే పదాన్ని నేను రచనలో ఉండే ప్రతీ పదం గూడా మాండలికంలోనే వున్న రచన కుద్దేశించి వాడుతున్నాను. దానిలోని వస్తువు ఎంత గొప్పదైనా, ఎంత ఉన్నతమైనదైనా విస్తృత ప్రచారార్హం కాకపోతే అంత గొప్ప విషయం గూడా నిరర్థకమవుతుంది. మాండలికం మాత్రమే జీవభాష అనీ, నిజమైన ప్రజల భాష అనీ భావిస్తే అది ఏకపక్షమవుతుంది. రచయిత ఏ ప్రజలకర్థంకావాలని వారి భాషలో రాస్తున్నాడో ఆ ప్రజలు నిరక్షరాస్యులై వుంటారు. వారికి తమనుగూర్చే తాము మాట్లాడే భాషలోనే సాహిత్యం వుందన్న విషయంగూడా చదువుకున్న వాళ్ళు వెళ్ళి చెపితేనే- చదివి వినిపిస్తేనే గానీ అర్థం కాదు. అట్లాకాక చదువుకున్న వాళ్ళ కోసం- స్థాయీ పాఠకుల కోసం ఐతే మాండలికం అక్కరలేదు. వంగపండు ప్రసాదరావుగారి పాటలు తెలంగాణా ప్రాంతంలో ఏమంత ఆసక్తిని కలిగించకపోవటం నేనెరుగుదును. ఆ పాటల్లో లోపం ఏమీలేదు. వాటిలోని వస్తువూ ఉపదేశం అక్కడి జనానికి అర్థం కావాలంటే అక్కడి మాండలికంలో వుండాలి. భాషకు సంబంధించిన ఈ సున్నితమైన సమస్యని రచయితలు అర్థంచేసుకోవాలి. లేకపోతే ప్రాంతీయ కవులు- రచయితలుగా వుండిపోయే అవకాశం వున్నది. ఇంకా పాటలకు సంబంధించి కొంతవరకు నయం- రాగమూ, అభినయమూ వుంటాయి కనుక అవి ప్రాంతీయం కాకపోయినా ప్రచారం పొందే అవకాశం వుంది. కథలు, నవలలవంటి ప్రక్రియలకు చెందినంతవరకూ ఇది జటిలమైన సమస్య. రచయిత జనంలో కలిసిపోవాలనే మాట వాస్తవమే ఐనప్పటికీ దాని అర్థం వారి మనోభావాలు, జీవన విధానమూ పరిశీలించి పోరాట సంసక్తి లేని కష్టసహిష్ణుత, ప్రపంచం పట్ల వారి దృక్పథమూ మార్చడానికి జనానీకపు సంస్కృతిని సంస్కరించాలనేదే. దాని కోసం అతడు తన పూర్వ సంస్కారాన్ని వదిలివేయాల్సిన అవసరం ఏమీలేదు. తాను నేర్చుకునేదంతా తిరిగి వారికి చెప్పడానికే అని గుర్తుంచుకోవాలి. అసంస్కృతమైన

వారి జీవితానుభవాలను, అర్థరహితమైన నైతిక సూత్రాలను, యథాతథంగా స్వీకరించి నూతన జీవన విధానానికి అనుగుణంగాసంధించి తిరిగి జనానికి అందించాలి. అయితే తాను తిరిగి ఇస్తున్న వస్తువు వారి జీవిత వాస్తవికతతో తులతూగ గలగాలి. రచనలో పాత్రల సంభాషణ మాండలికంలో వున్నా రచయిత ఇచ్చే వివరణలూ, వర్ణనలూ సాధారణ భాషలోనే వుండటం మంచిది. మాండలికంయందు తనకు గల ప్రేమ చేతగానీ, వీర వాస్తవికత చేతగానీ తాను వాడే ప్రతిపదం మాండలికమై తీరాలనే నియమం రచయితకు ఉన్నట్టయితే దాని ప్రయోజనం స్వల్పమాత్రం కాగలదు. ప్రాంతీయ భాషల్లో తప్పనిసరిగా రచనలు జరిగితీరాలి. ఆ పనికి మన రచయితలు ఇప్పుడిప్పుడే పూనుకున్నట్టు కన్పిస్తోంది. ఐతే ఆరచన ఇతర ప్రాంతాల ప్రజలకి అర్థం అయేటట్టు వుండాలి.

ఒక ప్రాంతంలో రాయబడ్డ ప్రాంతీయభాషా రచనని ఆ ప్రాంత ప్రజలే చిన్న చూపు చూడ్డం గూడా వుంటుంది. దానికి కారణమేమిటంటే సాహిత్యానికి గూడా మతం లాగా కొన్ని నియమాలు వుండటం. ఆ భావం నుంచి వాళ్ళని రచయితలు తప్పించి ప్రజాసాహిత్యం ఎట్లా వుంటుందో చూపాలి. అయితే అది ఒక సంకుచిత పరిధి నుంచి లాగి మరో సంకుచిత పరిధిలో బిగించేలావుండరాదు. ప్రాంతీయ భాషలో రాయాలనుకునే రచయితకి ఆ భాష పూర్తిగా తెలిసి వుండాలి, లేదా తెలుసుకోవాలి. అట్లాకాకుండా ఈ మాట ఇదే అయివుంటుందిలే అని వాడటం సరికాదు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారి ఒక పుస్తకంలో అనువాదకుడు ప్రపంచానికి "పరపంచం" అని వాడాడు. ఏ ప్రాంత ప్రజలు ప్రపంచాన్ని పరపంచం అంటారో నాకైతే తెలియదు. భాషతో సరైన పరిచయం వుంటే ఇలాంటి అభాసు జరిగే అవకాశం వుండదు. భాష ప్రజల దగ్గర మాత్రమే వుంటుంది. రచయిత తదస్త్ర ప్రయోగనిపుణుడు మాత్రమే. అతను మహార్థ సృష్టికర్త కావచ్చుగానీ భాషా సృష్టి చేయలేడు. రచయిత తాను ప్రజల దగ్గర నేర్చుకున్న భాషావితరణ చేసేప్పుడు అదేమైనా సమస్యను తెచ్చిపెడుతున్నట్టయితే అతను ఏకోన్ముఖంగా మాత్రమే ఆలోచిస్తున్నాడన్నమాట. జీవిత మహాసముద్రంలో ఉప్పొంగిన, ఈతరానికి చెందిన సాంఘిక సమస్యలు, జీవిత పరాజయాలు, సమాజపు గుణదోషాలు ఇవన్నీ గూడా సాధారణీకరించబడిన భాషలో వున్నట్టయితే ఎక్కువ ప్రయోజనాన్ని సాధించగలుగుతాము. ఇవాళ విప్లవ రచయితలు నూతన భావాలోకంలో భౌతిక ప్రపంచాన్ని గూర్చిన విలక్షణ సాహిత్య సృష్టి చేస్తున్నారు. పది సంవత్సరాల విప్లవసాహిత్య చరిత్ర నీరసించి పోతున్న సాహిత్యాన్ని పునర్జీవింప చేసి మానవోచిత మైన యదార్థ భావనలన్నిటినీ ఆవిష్కరిస్తూ వచ్చినప్పటికీ, అది ఇంకా వ్యవస్థిత

రూపాన్ని పొందలేదనే చెప్పాలి. కవిత్వంలో తప్ప మరే సాహిత్య శాఖలోనూ చెప్పుకో దగ్గంత అభివృద్ధి చెందని విప్లవ సాహిత్యం కనీసం మధ్య తరగతి వారి కోసం చాలినంత సాహిత్యాన్ని ఇంకా సృజించకముందే మాండలిక సమస్యను తెచ్చి పెట్టడం కీలకమైన ప్రశ్న. ప్రాంతీయ భాషలో రాస్తున్న రచయిత భాషా స్వరూపాన్నీ, రచన ప్రయోజనాన్నీ దృష్టిలో పెట్టుకోవాలి. ఈ రెండు బిందువులూ పరస్పరం అధిగమించి ఒక దాన్నొకటి ఛేదించుకునే టట్లువుంటే ఆ ప్రక్రియ పరాజయం పొందినట్టే. ఈ సందర్భంగా బెర్టోల్ట్‌బ్రెక్ట్ మాటల్ని ఉదహరిస్తాను. కార్మిక వర్గ సాహిత్యానికి ఆయన కొన్ని సూచనలు తయారుచేశాడు (1940-41) "............— నువ్వు ఒక్కడివే పోరాడడం లేదు ; పోరాడటానికి అవసరమైన ఉత్సాహం నువ్వు ఇవ్వగలిగితే నీ పాఠకుడు కూడా పోరాడుతాడు. నువ్వు ఒక్కడివే పరిష్కార మార్గాలు గుర్తించవు; అతడు కూడా గుర్తిస్తాడు." (జర్మన్ సంప్రదాయ సాహిత్య దర్పణం- పేజీ 413.) కనుక రచయిత తనకున్న ఉత్సాహాన్ని వీలైనంత ఎక్కువ మందిలో ఆవేశింప చేసేట్టు చూడాలి. పరిస్థితుల్ని తన జ్ఞానంతో విశ్లేషించి ప్రజలకి వివరించి వాళ్లని మానసికంగా ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళాలి. కొత్త దృక్పథంవేపు నడిపించాలి. తన సృజనాత్మకతను వాళ్ల అణువణువునా ప్రసరించి నిలువెల్లా వాళ్ల స్వభావాన్ని మార్చాలి. ఇవన్నీ తాను చేస్తున్నాననే స్పృహ రచయిత కుండదు గానీ జరిగేది అదే.

అగ్ని కణాలు

ఎ. అప్పల్నాయుడు

రైతు కూలి జనాలం
రగులు అగ్ని కణాలం
ప్రజా రాజ్య మొచ్చు దాక
ప్రజ్వలించి సాగుతాము ॥రైతు॥

మోతుబరీ బుగ తోడా
మొక్కకోరా దేవుడ్ని
ఊరంతా నాదంటూ
ఊరు సొమ్ము దిన్నావు
పట్టాలు రాయించుకు
భూమి పుట్టా లాగావు
భూమి లేని రైతులపై
యమరాజుగ వెలిగావు ॥రైతు॥

కూలోల్లను దోచినావు
కులాసాలు జేసినావు
అడ్డంగా బలిసినావు
ఆడోల్లను చెరిసినావు
అధికారుల అండతోటి
అన్ను - మిన్ను - గానలేదు ॥రైతు॥

కూలి నాలీ సంఘమైతే
పోలీసుల బిలిచావు
నాయకులను దోవకాచి
గూండాలచే కొట్టించావ్

ఎదురొచ్చిన గొంతు నొక్కి-
ఎనుములాగ బతికావ్ ||రైతు||

పోలీసుల బలం తోడ
కూలి నాలిని దండించావ్
కూలోల్లు- ఏకమైతే
కొడవళ్లు- కోతకొస్తే
తోకముడిచి పరిగెట్టావ్
ఫట్నాల్లో దాగున్నవ్ ||రైతు||

నువు కట్టిన బట్ట మాది
నువు తాగిన నీరు మాది
నువు దాచిన సొమ్ము మాది
నీ వూపిరి మాదేరా
నీ దోపిడి ఆగురా ||రైతు||

అధికారం దన్ను-
నిన్ను ఆదుకోదురా
పోలీసుల బలం-
నిన్ను కాపాడదురా
నీ అన్నేయం పండింది
నీ అంతం మూడింది ||రైతు||

నువనొల్లిన భూమంతా
దున్ను తాము మేమంతా
నీ మేడల మిద్దెల్లో-
నివసిస్తాం జనమంతా
నీ జెండా దించేసి
ఎర్ర జెండా- ఎగరేస్తాం
నీ రాజ్యం తిరగ దోసి
మా రాజ్యం నిర్మిస్తాం
జన రాజ్యం స్థాపిస్తాం ||రైతు||

మే డే

టి. ఎన్. ఆర్.

ప్రజలను తొక్కి-
సంపద మెక్కి-
ఫ్యూడల్ స్వామ్యం
కూలాలంటే-
వలసవాదులకు
లైసెన్సిచ్చే
దళారి రాజ్యం
పోవాలంటే-
ప్రజాస్వామ్యం
పేరుతో బతికె
తుపాకిరాజ్యం
తొలగాలంటే-
నక్సల్బరి శ్రీకాకుళ పేదలు
తెలంగాణ రైతాంగ వీరులు
చేసిన శపథం
తీరాలంటే-
చికాగాలో చిందిన రక్తం
ప్యారిస్ కమ్యూన్ సోవియట్ విజయం
చైనా విముక్తి వియత్నాం విజయం
కంపూచియాలో కమ్యూన్ స్థాపన
అన్నది మేడే
తెలుసుకో నేడే
కార్మిక శక్తి
కర్షక శక్తి
కలిసిన నాడే
దేశ విముక్తి

మందమర్రి సంఘటనలు :

భూములు, గనులు, భూరి సంపదలు ఎవ్వరివి?

సురా

రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోవున్న బొగ్గుగనుల్లో ప్రైవేటు వ్యక్తులకు మొత్తం పనిని ఇవ్వడం అన్నది భారతదేశంలో అన్ని ప్రాంతాల్లో ఆచరణలోఉన్నట్టు కనబడుతున్నది. (ఉదా॥ "ట్రేడ్ యూనియన్ మాఫియా ఇన్ ధన్‌బాద్" అరుణ్ సిన్హా వ్యాసం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జనవరి 23, 1979.) తెలంగాణా ప్రాంతంలోని సింగరేణి కాలరీస్‌లో పెద్ద భూస్వాములే కార్మిక నాయకులుగా కూడ వ్యవహరించి కార్మికులను అదుపులో వుంచుకుంటున్నారు.

గోతులు తవ్వడానికి. పరిశీలించడానికి కార్మికులను ప్రభుత్వం నియమించినా కుప్పగావున్న బొగ్గును ఎత్తివేయడానికి చాలామంది ప్రయివేటు కూలీలు అవసరం. ప్రైవేటు కూలీల పద్ధతి, పబ్లిక్ రంగాన్ని ఎగతాళిచేస్తూ, బొగ్గు ఉత్పత్తి అస్థిరతకు ముఖ్య కారణమవుతూ మొత్తంగా పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీస్తున్నది. భద్రతలేని ఈ ఉద్యోగం కార్మికులను రోజూ భయపెడ్తుంటే అసంతృప్తి చెందిన కార్మికుల నిరసనలు ఆందోళనలు ఉత్పత్తిలో అస్థిరత్వానికి దారి తీసాయి. బొగ్గు కంపనీలు, రైల్వేలు మరియు విద్యుత్తు సరఫరా చేసేవాళ్ళు బొగ్గు కొరతకు ఒకరినొకరు నిందించుకొంటుండగా భారత ప్రభుత్వం ప్రైవేటు కంట్రాక్టర్లను తన సంరక్షణలో బొగ్గు ఉత్పత్తిని ధ్వంసం చేయడానికి అనుమతిస్తున్నది.

సింగరేణి కాలరీస్‌కు చెందిన మందమర్రి ఆదిలాబాద్ జిల్లా గనులలోని ప్రైవేటు కార్మికులు భూస్వామి శ్రీపతిరావు ఆధీనంలో ఉన్నారు. మార్క్సిస్టు పార్టీనాయకుడు సుందరయ్యగారు తన పుస్తకం "వీర తెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు"లో 1948–51 తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజలు తిరుగుబాటు చేసిన దుర్మార్గులైన భూస్వాములలో ఒకడని తెలిపిన మందమర్రి మాధవరావు (10–000 ఎకరాలకు పైగా భూమి ఉన్నవాడు) యొక్క ఏకైక పుత్రుడు శ్రీపతిరావు. 1957లో అతని భూములలో చాలా భాగం గనులకొరకు సింగరేణి కాలరీస్‌వారు తీసుకుందామనుకుంటే గట్టిగా అభ్యంతరం తెలిపాడు మాదవరావు. అతడు స్వయంగా ఆఫీసర్లమీదికి కాల్పులు జరిపి ఒకతనిని చంపినట్లు తెలిసింది. కోర్టు అతనిని పిచ్చివానిగా భావించి వదిలివేసింది. ఏమైన అతని కొడుకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారాడు. బొగ్గుగనుల వల్ల పెద్దగా లాభం పొందుతున్నవాడు ఈ ప్రాంతములో ఇతడే. ఇక్కడ సారా

కాంట్రాక్టు, వర్తకమే కాకుండా వెయ్యి ఎకరాల పైన భూమి ఉన్నవాడు. ఇదేగాకుండా సినిమా నిర్మాత, ఒక థియేటరు యజమాని. చుట్టుపక్కల గ్రామాల పంచాయతి సమితులన్నీ ఇతని ఆధీనంలో ఉన్నాయి. క్రూరమైన "వెట్టి చాకిరి" పద్ధతిని అమలు పరుస్తూ చట్టబద్ధంగా హక్కుదారు లయిన కాలరీస్ వాళ్ళ భూములపై అజమాయిషీ చేస్తుంటాడు.

1973 లో కంపనీ బొగ్గును గోతులనుంచి కొనుగోలుదారుకు నేరుగా అంద జేసే పద్ధతి అమలులోనికి తెచ్చినపుడు ప్రయివేటు కూలీలు లారీల్లోకి భర్తీచేయడానికి అవసరమయ్యారు. భూమిలేని పేదలు చుట్టుపక్కల గ్రామాల్లోంచి కూలీకి వస్తుంటారు. దెబ్బతిన్న ఆర్థిక పరిస్థితుల కారణంగా బొగ్గుగనుల్లో ఉద్యోగం పట్ల ఆకర్షింపబడు తున్నారు. చాలామంది లారీల్లోకి బొగ్గు భర్తీచేసే ప్రైవేటు కూలీలుగా మారుతున్నారు. మందమర్రి గ్రామంలో ఈ పనిలోవున్న ప్రైవేటు కూలీలు రోజుకు 400 నుంచి 1200 వరకు ఉంటారు. లారీ యజమాని లారీకి రూ. 60 ఇస్తాడు. కాని కూలీలు భూస్వామి తరఫున పనిచేసే గూండాలైన దళారీల ద్వారా రోజు కూలీ పొందుతారు. లారీ యజ మానులు ఇచ్చే డబ్బులో దాదాపు 40% దళారీలు తీసుకుంటారు. అంతేగాక భూస్వామికి అనుకూలంగా వుంటూ రూ. 1000 నుంచి 2000 వరకు లంచం ఇస్తేనే బొగ్గు గనుల్లో కూలీలకు ఉద్యోగం దొరుకుతుంది. పబ్లిక్ రంగంలో ఆఫీసర్లను భూస్వామి ఎలా అను కూలంగా చేసుకుని ఉద్యోగాలు వేయించగలుగుతున్నాడనేది ఊహించవలసిందే.

భూస్వామి ద్వారా ఉద్యోగాలు పొందే కార్మికులు ఐ.ఎన్.టి.యు.సి. చే నడ పబడుతున్న 'నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్' లో చేరాల్సివుంటుంది. ఐ.ఎన్.టి. యు.సి. చే నడపబడుతున్న వేరొక యూనియన్ 'సింగరేణి కోల్ లోడర్స్ యూని యన్' తో కలిసి ఈ యూనియన్ ప్రైవేటు కూలీలకు లారీకి కూలీ రూ. 100 కు పెర గడానికి ప్రముఖమైన పాత్ర వహించింది. రోజుకు 100 నుంచి 150 లారీల వరకు పెరగడం వల్ల భూస్వామి రోజుకు రూ. 4000 పైన అన్యాయంగా సంపాదించ గలుగు తున్నాడు. ఈ ఐ.ఎన్.టి.యు.సి. యూనియన్ల అధ్యక్షుడు వేరెవ్వరో కాదు శ్రీపతిరావే.

ఎ ఐ టి యు సి కి చెందిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కూడా ఉంది. దానికి నాయకుడు ఆప్రాంతంలో ప్రముఖ సిపిఐ నాయకుడు వి.టి. అబ్రహం. ఈ సంవత్సరం జనవరి 2న భూస్వామి దోపిడీకి వ్యతిరేకంగా కూలీలను కూడగట్టు కొని నేరుగా కార్మికులకే డబ్బులు ఇవ్వాలని అబ్రహం లారీ యజమానులను డిమాండ్ చేసాడు. మూడు రోజుల తర్వాత జనవరి 5న కె.కె. 5 గొయ్యి దగ్గర 40 మంది

గూండాలు అతని మీద దాడి చేసారు. చివరకు స్పృహ లేని స్థితిలో ఉన్న అతన్ని ఇంకా ముగ్గురితో పాటుగా మంచిర్యాల హాస్పిటల్లో కార్మికులు చేర్చారు.

మర్నాడు ఉదయం తమ నాయకునిపై జరిగిన దాడి వల్ల ఉద్రిక్తులైన 2000 మంది కార్మికులు పని వదిలేసి మార్కెట్టు దగ్గర గుమిగూడారు. కోపంతో వాళ్ళు భూస్వామి సినిమాహాలు పైకి, ఇతర ఆస్తుల పైకి వెళ్ళారు. తరువాత కార్మికులు వెళ్ళిపోయే సమయంలో ప్రత్యేక సాయుధ పోలీసులు వచ్చి హుటాహుటిన కాల్పులు జరిపారు. అక్కడికక్కడే నలుగురు గని కార్మికులు మరణించారు. తరువాత హాస్పిటల్లో ఇద్దరు మరణించారు. ఇరవై మందికి పైగా గాయపడ్డారు. ఈ వార్త ఇతర స్థలాలకు పాకగానే బెల్లంపల్లి, రామకృష్ణాపురం, కాగజ్‌నగర్‌లలో కార్మికులు గనుల్లోంచి బయటకు వచ్చేసారు. ఉద్రిక్తమైన ప్రదర్శనలు, బెల్లంపల్లి మొత్తంగా బంద్ జనవరి 7న జరిగాయి. నిషేధాజ్ఞల కింద మొత్తం బొగ్గు గనుల ప్రాంతమంతా ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సాయుధ పోలీసుల ఉక్కు పాదాల కింద నలుగుతున్నది.

కొద్ది మంది రాడికల్ విద్యార్థి సంఘం వాళ్ళు అక్కడ ఉండడం ఆసరాగా తీసుకొని కార్మికుల ఆందోళన 'మితిమీరిన తీవ్రవాదుల చర్య' అని ప్రకటన చేసాడు రాష్ట్ర ఐ జి పి. ఆదిలాబాద్ జిల్లాలోని లక్సెట్టిపేట తాలూకా గ్రామం అయిన మంద మర్రి చాలాకాలంగా సాగుతున్న భూస్వాముల దురాగతాలను ఎదుర్కొంటున్నదన్న విషయం గుర్తుంచుకోవాలి. అంత మాత్రమే గుర్తించినా చాలదు. లక్సెట్టిపేట తాలూకాతో సహా ఆదిలాబాదు, కరీంనగర్ జిల్లాల్లో భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు వేరూనుకుంటున్నాయనే ప్రభావాన్ని కూడ మరచిపోకూడదు. అందువల్ల 'తీవ్ర వాదుల చర్య' గా చిత్రించి కల్లోలిత ప్రాంతంగా ప్రకటించడానికి ప్రభుత్వానికి ఏ చిన్న సాకు దొరికినాచాలు. అది అలవాటయింది.

గాయపడ్డ ఎఐటియుసి నాయకుని మీద దాడి చేసిన వాళ్ళను ఎవ్వరినీ ఇంత వరకు అరెస్టు చేయలేదు. అంతే కాకుండా 180 కి.మీ. దూరంలో ఉన్న నిజామాబాద్ జైల్లో 25 మందికి పైగా గని కార్మికులను నిర్బంధించారు.

రగులుకునే నిప్పుకు తెలుసు-
గాలెందుకు వీస్తుందో!

– పి. సి. ఎన్.

ప్రజాభిప్రాయం

కొడవటిగంటి కుటుంబరావు

వర్గసమాజంలో జనాన్ని దోచుకొని కొవ్వుతో, అధికారం కూడా చూయించి, ఉన్నత వర్గంగా చలామణీ అయేది ఒకటి విధిగా ఉంటుంది. అయితే ఈ వర్గం గురించి ప్రజాభిప్రాయం మార్పులు చెందుతూ వస్తుంది.

ఒక దశలో ఉన్నతవర్గంగా చలామణీ అయేది, అంతకు పూర్వం ఉన్నత వర్గంగా చలామణీ అయేదాన్ని పడగొట్టి, "అభ్యుదయ" పంథాలో తాను పైకివస్తుంది. అప్పటికి పాత ఉన్నతవర్గం ప్రజాభిమానాన్ని పూర్తిగా కోల్పోయి, అది సంఘం యొక్క పురోగమనానికి పెద్ద అంతరాయమని అందరికీ స్పష్టంగా తెలిసిపోయి, సమాజంలో ఇంకా మిగిలిఉన్న చైతన్యమంతా దాని నిర్మూలనానికి ఏకంగా, ఆ చైతన్యం సహాయంతో ఒక కొత్తవర్గం పైకి వస్తుంది.

యుగధర్మం మారిందంటాం. అంటే ఉత్పత్తి సంబంధాలలో పురోగామి పరివర్తన కలిగిందన్నమాట. కొత్తవర్గం పైకిరావటంతో ప్రజా జీవితం పచ్చపచ్చగా కనబడనారంభిస్తుంది. కొత్తవర్గం తాలూకు మేలూ, సంఘం మేలూ అవినాభావ సంబంధం కలవిగా తొలిదశలో కనిపిస్తుంది. ఇది యుగధర్మంలో పెరిగే దశ.

కొత్త అధికారవర్గం పాత దానికన్నా కూడా భారీఎత్తున దోపిడీ కొనసాగించవచ్చు, కొనసాగిస్తుంది కూడా. అంతే, పాతవర్గం దోపిడీలో పొందిన వైఫల్యాన్ని ఇది జయిస్తుంది. అంటే ప్రజలదగ్గిర దోచుకునేటందుకు ఉండే పరిస్థితులు కల్పిస్తుంది. ఈ కారణంచేతనే ప్రజలు, తమ జీవితం కొత్తవర్గం కింద మూడు పూలూ, ఆరు కాయలూ అవుతున్నదనుకుంటారు.

ఒక ఉచ్చదశదాకా ఈ భావం ప్రజలలో నిలిచి ఉండి, అటు తరవాత క్షీణదశ ఆరంభమవుతుంది. దీనికి కారణం, ఉత్పత్తివిధానాలు ఎప్పుడూ ఉత్పత్తి సంబంధాలకన్నా ఒక అడుగు ముందుంటాయి. ఇందువల్ల ఆర్థిక రంగంలో వైరుధ్యాలు ఏర్పడటం తప్పనిసరి అవుతుంది. దోపిడీచేసే "చెయ్యి" (తొంట చెయ్యి) బయటపడనారంభిస్తుంది. ప్రజాభిప్రాయం ఉన్నతవర్గానికి సుముఖంగా ఉండే స్థితిలో మార్పు కలుగుతుంది. పాలకవర్గ క్షేమానికీ, ప్రజాక్షేమానికీ అవినాభావ సంబంధం లేకపోగా రెంటిమధ్యా అంతో ఇంతో శత్రుత్వం ఉన్నట్టు స్పష్టమవుతుంది. దానికితోడు పాలకవర్గం ప్రజలను సహజ నేరస్థులలాగా ఎంచినట్టు శాసనాలు చెయ్యటమూ, దండనీతితో పాలించటమూ అధికం చేస్తుంది.

ఈదశ పరాకాష్ఠ అందుకున్నాక పాలకుల దమన కాండను ప్రజాభిప్రాయం అధిగమించి, ఆచరణలో వ్యక్తమయేదాకా పాలక వర్గానికి ప్రమాదం ఉండదు. క్షీణ దశ విషమించటమే నియంతృత్వానికి దారితీస్తుంది. నియంతృత్వానికి సరిఅయిన సమాధానం సామాజిక విప్లవం.

ఇందిరాగాంధీ ఏ ప్రజాభిప్రాయాన్ని చూసి దడుచుకుని ఎమర్జన్సీ తెచ్చిపెట్టినదీ స్పష్టంగా తెలుస్తున్నది, రాజకీయ ప్రతిపక్షాలూ, కొంతమంది జర్నలిస్టులూ, కొంత మంది రచయితలూజైళ్లకు పోయారు. రాజకీయంగా తనకు అడ్డంగా ఉన్నవారినీ, ప్రజాభిప్రాయాన్ని రూపొందించగల వాళ్లను, విప్లవ రాజకీయాలను ప్రచారం చేసే వాళ్లను ఆమె నిర్బంధించింది. కాని హిట్లరులాగా, ప్రజలను మభ్యపెట్టి, తనభావ దాసులుగా కోట్లాది జనాన్నికూడ గట్టుకునే ప్రయత్నం ఆమె చెయ్యలేదు. ఆమెకు ప్రజల భయం లేనట్టు కనిపిస్తుంది.

కాని క్షీణదశలో ప్రవేశించిన దోపిడీ వర్గాలకు ప్రజలభయం ఉండటం అవసరం సామాజిక చైతన్యం గలప్రజలు దోపిడీ వర్గాలను భయపెట్టగలరు. ఇతర దేశాలలో దుష్పరిపాలనపట్ల ప్రజలు ఏవిధంగా తిరుగుబాటు చేసేదీ మనం చూస్తున్నాం. ప్రజాశక్తిని మించిన శక్తిలేదని సిద్ధాంత రీత్యామనకు తెలుసు.

అయినా ఏకారణంచేతనో మన ఈభారతదేశంలో దుష్టపాలకులను ప్రజాశక్తి ఎన్నడూ అదుపులో ఉంచినట్టు కనబడదు. 1942లో గాంధీగారు "క్విట్ ఇండియా" ఉద్యమం సాగిస్తానన్నప్పుడు వైస్రాయిగారు తన సలహాదార్లను సలహా అడిగితే, మిడ్నపూర్ కలెక్టరుగారు, ఆ ఉద్యమాన్ని 24 గంటల్లో అణిచివేస్తానన్నాడట!

ఇందిరాగాంధీ లక్షమందిని జైళ్లలో కుక్కి, చట్టాలన్నిటినీ ఉల్లంఘిస్తే ప్రజలు మూకుమ్మడిగా ఆమెమీదధ్వజం ఎత్తలేదు. ఓడిపోయినాక కూడా ఆమెకు హారతులిచ్చారు ఆమెభారత ప్రధానికాదని ఇప్పుడిప్పుడే తెలుసు కుంటున్నవారు కూడా ఇంకాఉన్నారు!

ఇందిరాగాంధీని కాదని అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ వారికి, తమ అభ్యుదయమే దేశాభ్యుదయమన్నట్టు నటించేనేర్పు కూడా ఉన్నట్టుకనబడదు. వాస్తవ పరిస్థితి చూస్తే నియో ఇంపీరియలిస్టుల అభ్యుదయమే భారతీయుల అభ్యుదయం లాగా కనబడుతుంది. ప్రస్తుతం మనదేశంలో అధికారం చలాయించేది ఏవర్గమో కూడా తెలియటంలేదు. అధికార పార్టీలోనే వర్గకలహాలున్నాయి!

ఏనాడో మెసొపొటామియాలో తొలిమానవనాగరికత ఆరంభమైనప్పుడు మతమూ దేవుళ్లు, బ్రహ్మాండమైన గుళ్లూ, గోపురాలూ ప్రజలలో బయలు దేరిన సామాజిక

చైతన్యానికి ప్రతీకలుగా రాణించాయి. ఈనాడు రాంభజనలూ, సంకీర్తనలూ, సుప్రభాతాలూ, దేవుళ్ల అభ్యుదయమూ, విగ్రహాలచౌర్యమూ, మొక్కుబడుల కైంకర్యమూ, మతరాజకీయాలూ, సినిమాసంస్కృతీ, మానసిక కామ ప్రకోపనాలూ, భారతీయుల సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా పైకి కనబడుతున్నాయి. విప్లవపరిస్థితిని ఎదుర్కోవాలంటే ఇంతకన్న నిరుపయోగమైన సామాజిక చైతన్యాన్ని ఊహించటం ఎవరి తరమూకాదు.

దీనికి విరుగుడు ఏమిటి? చీకట్లో ఒంటరివాడై పోయి, తెరమీద కనిపించేమైథున నృత్యాలూ, అర్ధనగ్నస్త్రీ శరీరాలూ చూసి తన్మయత్వం చెందేవాడిలో, "నేనుసైతం ఒక సామాజికజీవిని!" అన్న స్పృహకలిగించడం ఎలా? ప్రజలలో 40 శాతం దారిద్ర్యంలో ఓలలాడే ఈదేశంలో ప్రభుత్వం జనాన్ని తాగుడునుంచి రక్షించ జూస్తున్నది గాని క్షీణసంస్కృతి నుంచి రక్షించే ఆలోచన చెయ్యటంలేదు, చెయ్యదు. ప్రొహిబిషన్‌లో సారా పెట్టుబడి దార్లకు అపారమైనలాభాలున్నాయి. క్షీణసంస్కృతిలో కూడా అంతే. అందుచేతనే రెంటికీ అధికారుల మద్దతు!

ప్రజాభిప్రాయం ఒక తీవ్ర సమస్య. ఇదిఒక ప్రాంతానికి సంబంధించినది కాదు. దేశమంతటా, చదువు వున్నవారిలో నూ. చదువుకోనివారిలో నూ, సామాజిక చైతన్యం పెంపొందించే సాంస్కృతికోద్యమం కావాలి. ఏరకంలో ఉన్నవాడు కూడా చైతన్యం లోపించినప్పుడు తాను జీవిస్తున్నదే సహజ జీవితమనీ, అందులోనే హెచ్చు ఆధ్యాత్మిక విలువలున్నాయనీ తనను తాను నమ్మించుకోవచ్చు. గత చరిత్రను గురించీ, ప్రపంచ వర్తమానస్థితి గురించీ ప్రజలకు వాస్తవం తెలియాలి. ఒక బృహత్పథకం అవసరమనిపిస్తుంది. కొద్దిపద్యాలూ, సిద్ధాంతాలు నెమరు వెయ్యటమూ లాంటి ప్రక్రియలవల్ల కలిగే ప్రయోజనం చాలా పరిమితమైనది. అశావాదం మంచిదే— నిరాశావాది నిర్మూలన అవుతాడు; కాని ఆశావాదం కూడా భౌతికమైన ఆధారాలు చూసుకొని ముందుకు పోవాలి; గాలిలో పల్టీలు కొట్టరాదు.

<u>విప్లవ పరిస్థితులు</u>

1. విస్తృతంగా అట్టడుగు ప్రజలలో దారిద్ర్యం.

2. ఉన్నత వర్గంవారు చేసిన శాసనాలను ఉల్లంఘించి, "నేరస్థులు" కాకుండా అసంఖ్యాకులు తమ కనీసావసరాలు గడుపుకోలేని దశ.

3. ఆ వర్గం వారు తమ నాగరికతకు చిహ్నాలుగా చెప్పుకునే సంపదతో అట్టడుగు వర్గానికి ఎలాటి స్పర్శా లేకపోవడం. (పత్రికలో రోజూవచ్చే టెలివిజన్,

రేడియో, టేప్‌రికార్డర్, హైక్లాస్ దుస్తులు, యంత్ర పరికరాలు, సౌందర్య సాధనాలు నూటికి 80 మందికి ఏవిధంగానూ పట్టవు.)

4. శ్రమ జీవులు తాము తమ శ్రమ శక్తితో ఉత్పత్తి చేసే సంపదలో తమ అవసరాల మేరకు వాలుపంచుకోలేక పోవటం. (తిండికి మాడే వ్యవసాయకులూ, ఆకాశసౌధాల నిర్మాణానికి తోడ్పడి పేదకొంపలలో ఉండే తాపీవాళ్లూ, సిల్కు బట్టలు నేసి నూలు బట్టలు కట్టేనేతవాళ్లూ వగైరాలు.)

5. తమ దేశం అంతర్జాతీయంగా ఎంత కీర్తి సంపాదించినా అట్టడుగు వాళ్ల స్థితిలో ఎలాటి మార్పూ లేకపోవటం.

6. అట్టడుగు వర్గం పట్ల అత్యాచారాలు చెయ్యటం కోసం తమ చట్టాలనూ, నియమాలనూ తామే ఉల్లంఘించి, అదే సమయంలో ఆ నియమాల ప్రయోజనం అట్టడుగు వారికి అందకుండా చెయ్యటం.

ఇలాంటి లక్షణాలను మరి కొన్నింటిని కూడా చూపవచ్చు. కాని ప్రధానమైనది ఈజాబితాకాదు, ఈ లక్షణాలు ప్రత్యక్షంగా కనిపించే సమాజంలో విప్లవ చైతన్యం కార్చిచ్చులాగా చెలరేగకపోవటం: ఈపరిస్థితులకు చలించనివారు ఇక దేనికీ చలించరు.

చాలా ఏళ్ళ క్రితం నన్ను కొందరు విరసం సభ్యులు విప్లవకథలు ఎలాఉండాలని అడిగితే: జీవితంలో వాస్తవ విప్లవ పరిస్థితులను గురించి రాయమని సలహా ఇచ్చాను. నిజానికి అటువంటి రచనలవల్ల రెండు రకాల లాభం ఉన్నది. జీవితసంఘర్షణకు ఎడంగా బతుకుతున్న నాబోటి మధ్య తరగతి వాడికి అట్టడుగు ప్రజల జీవితంతో పరిచయం కలుగుతుంది. దానితోపాటు సంఘ దురన్యాయం గురించి, ఆ దురన్యాయానికి గురికాని వాళ్లు మళ్లీ మళ్లీ తెలుసుకుంటూ ఉండవచ్చు. పడక గదుల్లో పతాకఎన్ని వేశాలు చూపించే సాహిత్యం మతంకన్న కూడా ఘోరమైన నల్లమందు కదా!

ఈ రెండు ప్రయోజనాలనూ తిరస్కరించే మధ్యతరగతి సంస్కృతిలో ఎంత వరకు సామాజిక చైతన్యం ఉన్నదీ సరిగా అంచనావేసి, వారికి ఏవిధమైన సంస్కృతి గాని ఉన్నట్టు నటించడం మానాలి. ఈ వర్గంలో చైతన్యం కలిగించటానికి విప్లవ సాహిత్యం మార్గాలు చూడటం అవసరమేమో.

విప్లవ కళాకారులు కొన్నిపాతరూపాలను ఉపయోగించటం గురించి నాకు సందేహాలున్నాయి. బుర్రకథలూ, ఇతర "జానపద" కళారూపాలూ వాస్తవికతకు ఉత్తమ సాధనాలుకావు. సామాన్య ప్రజలకు సన్నిహితంగా ఉన్నట్టు భావనకలిగించే

ఈరూపాలు చాలావరకు ఇతర వర్గాల గత చరిత్రలను, పురాణగాథలను ప్రచారం చెయ్యటానికి ఉపయోగించాయి. నిజానికి వాస్తవికతను బూర్జువా కళలు ఎక్కువగా చిత్రించాయి, విప్లవ కళలు ఎక్కువగా సాధించాలి.

సామాన్య ప్రజలకు వాళ్ల జీవితాన్ని ఈపాత కళారూపాలలో ప్రదర్శించటంలో ప్రయోజనం ఉండదు; వాళ్లు తమ జీవితం వెనకఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి కళలు ఉపయోగపడాలి. మధ్య తరగతి వాళ్లకు జనసామాన్యం జీవితం గురించి స్థూలంగా తెలుసుకోవటమే ఒక అనుభవం।

రాజకీయ విప్లవాన్ని ప్రతిఘటించ దలచినవాడు విప్లవ రచయితనని ముందుకు రావటంలో అర్థంలేదు. కాని రాజకీయ విప్లవ పంథాలు అనేకం ఎదుట కనిపించినప్పుడు విప్లవ రచయిత సూటిగా ప్రజల దగ్గిరికి పోకుండా, ఎదో ఒక రాజకీయ విప్లవ రథాన్ని ఎక్కి వీరంగం వేసుకుంటూ ప్రజల దగ్గిరికి పోయేకన్న, కలం అవతల పారేసి తుపాకి పట్టటం మేలు.

ఆఖరుకు ఒక్క హెచ్చరిక. విప్లవ పరిస్థితులు సమాజంలో ఎంత ప్రమాణం లో ఉన్నదీ సరిగా అంచనా వేసి, అందుకు అనుగుణమైన చైతన్యం ప్రజలలో విప్లవ కళాకారుడు పెంపొందించిన దాకా విప్లవ రాజకీయ కార్యక్రమం ఆచరణకు రాదు. పరిస్థితులకూ ఆచరణకూ మధ్య చైతన్యం వారధి. వాస్తవ విప్లవాలు ప్రారంభమయేది భావరంగంలోనే. ఆయుధాలు పట్టి విప్లవం చేసేవాళ్లు కూడా ముందుగా చైతన్యం పొంది ఉండిన వారే.

చేతకాని చిరునవ్వు

ఒక్కొక్క ఉషోదయం నాకు
ఊహకు అందని రీతిలో ప్రారంభ
మవుతుంది—
పేదవాడి నెత్తురు చెమటలా
ఎర్రనీడలు చిమ్ముతుంది—

మండే ఆ నిప్పుకళ్ళల్లోంచి
మానవత్వపు ఛాయలు గోచరిస్తాయి.

స్వగతంలో నా ప్రశ్నకు—
"కాలగతిలో ఎన్ని మిట్ట మధ్యాహ్నాలు
నవ్వగలను?"
మరో అస్తమయం తరువాత నయినా
జవాబురాని సందిగ్ధ వాతావరణంలో నేను
అందుకే రేపటి శుభోదయం కోసం
నిరీక్షిస్తాను

— శ్రీవణ్

మేధావులు - కార్మిక వర్గం

1. విప్లవ మేధావులు

సాధారణంగా సమాజ బౌద్ధికజీవితం పాలకవర్గ భావజాల అధికారంలో వుంటుంది.

"ప్రతి యుగంలోనూ పాలక వర్గ భావాలు అధికార భావాలు. అంటే సమాజ భౌతిక శక్తిని పాలించే వర్గం ఆ సమాజ బౌద్ధిక శక్తిని కూడా పాలిస్తుంది. భౌతిక ఉత్పత్తిసాధనాలను అధీనంలో వుంచుకున్న వర్గం బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కూడ అధీనంలో ఉంచుకుంటుంది. కాబట్టి సాధారణంగా బౌద్ధిక ఉత్పత్తి సాధనాల మీద అధికారం లేనివాళ్ళ భావాలు అధికారవర్గ అధీనంలో వుంటాయి. అధికార భావాలు ప్రబల భౌతికసంబంధాల భావరూప వ్యక్తీకరణం తప్ప మరేమీ కాదు"[1]

పాత సమాజ కట్టడాలు శిథిలం కావటం ప్రారంభమయ్యే విప్లవ యుగాల్లో పాలక వర్గంలోని ఒకభాగం చీలిపోయి విప్లవవర్గ శక్తులలో కలుస్తుంది.

"వర్గపోరాటం నిర్ణయాత్మక ఘడియను సమీపించిన దశల్లో, పాలకవర్గం లోపల చీలిపోయే క్రిమం కొనసాగుతుంది. వాస్తవంగా ఈ చీలిక క్రిమం పాత సమాజపు మొత్తం రంగంలోపల- పాలక వర్గంలోని ఒక చిన్న భాగం తనను తాను పాలక వర్గం నుంచి విడగొట్టుకొని భవిష్యత్తును తన చేతుల్లో వుంచుకున్న విప్లవకర వర్గంలో చేరిపోయే తీవ్రిమైన ప్రిత్యక్షమైన స్వభావాన్ని పొందుతుంది. అందుచేత జరిగిపోయిన యుగంలో సంపన్న వర్గంలోని ఒక భాగం బూర్జువా వర్గం వైపుకు వచ్చినట్టు, ఇప్పుడు బూర్జువా వర్గంలోని ఒక భాగం కార్మిక వర్గం పక్షానికి వస్తుంది. ఒక మొత్తంగా చారిత్రిక చలనాన్ని గూర్చిన సైద్ధాంతిక అవగాహన స్థాయిని పెంచు కున్న బూర్జువా భావ జాల నిపుణులు ముఖ్యంగా కార్మిక వర్గ పక్షానికి వస్తారు."[2]

తన చారిత్రిక విజయాలతో ఆగక పెట్టుబడిదారీ సమాజం అసందర్భంగా అవినీతికరంగా రూపొందిందని అనుభవం నుంచి నేర్చుకోవటమే, ఈ మేధావులు తమ విధేయతను కార్మిక వర్గానికి మార్చటానికి కారణం.

2. పెట్టుబడి వూడిగంలో శాస్త్రం

పెట్టుబడిదారీ సమాజంలో శాస్త్రం "శ్రిమకు భిన్నమైన ఉత్పత్తి శక్తిగా, పెట్టుబడికి వూడిగం చేయటానికి బలవంతం చేయబడేదిగా" రూపొందుతుంది. గుత్త పెట్టుబడిదారీ యుగంలో శాస్త్రీయ పరిశోధన పూర్వయుగాల్లో ఎన్నడూ లేనంత సమృద్ధిగా జరుగుతుంది. కానీ ఎప్పుడూ వ్యక్తిగత లాభాపేక్షతో వేగంగా పరుగుపెడుతుంది.

అధికాధికంగా యుద్ధానికి అంకితమవుతుంది. ప్రకృతి శాస్త్రజ్ఞులకు శిక్షణా విధానం శాఖోపశాఖలు చేయబడి ఒక మొత్తంగా ప్రకృతి శాస్త్రానికి సంబంధించిన సైద్ధాంతిక అవగాహనను సముపార్జించటం వాళ్ళకు కష్టతరం అవుతుంది. ఇక మానవ సమాజ అధ్యయనంలో ప్రకృతి శాస్త్రజ్ఞులకు ఏ విధమైన శిక్షణాయివ్వరు. తల కిందుగా సామాజిక, చారిత్రిక అధ్యయనం ప్రకృతి శాస్త్రాలను మినహాయించే విధంగా నిర్వహించబడుతుంది. ఆర్థిక శాస్త్రాన్ని చరిత్ర నుంచి వేరు చేస్తారు. ఆర్థిక శాస్త్రం, చరిత్రలను రెండింటినీ రాజకీయాల నుంచి వేరు చేస్తారు. చరిత్రను అసలు శాస్త్రమే కానట్టు చెప్పటం జరుగుతుంది. ప్రకృతి శాస్త్రాల్లో విద్యార్థి మార్క్సిజాన్ని గూర్చి ఏమీ తెలుసుకోకపోవచ్చు; గతి తర్కం పేరుతో ప్రకృతి రహస్యాలు తెలియ నప్పటికీ, కనీసం ప్రకృతిలో గతితర్కక్రమాలను ప్రకృతి శాస్త్ర విద్యార్థి గుర్తిస్తాడు. కానీ వర్గపోరాటాన్ని కనీసం గుర్తించనటువంటి బూర్జువా చరిత్రకారునికి గతితార్కిక సూత్రాలు అర్థరహితంగానే కనిపిస్తాయి.

బూర్జువా విద్యావిధానంలో ప్రకృతి అధ్యయనానికీ మానవసమాజ అధ్యయనానికీ మధ్య ఈ వైరుధ్యం బూర్జువా చైతన్యంలో శాస్త్రాన్ని ఒక ఉత్పత్తి శక్తిగా అభివృద్ధి చేయవలసిన అవసరానికీ, పెట్టుబడికీ శ్రమకూ మధ్య వాస్తవ సంబంధాన్ని ప్రచ్ఛన్నం చేయాల్సిన అవసరానికీ మధ్య ఘర్షణను ప్రతిబింబిస్తుంది.

బూర్జువా శాస్త్రజ్ఞులు కొందరు తమ పరిస్థితిని జ్ఞానపురోగతి కోసం జ్ఞానమే తమ పరిధిలోని విషయం అనీ తమ కృషికి సంబంధించిన సామాజిక పరిణామాలతో తమకు ప్రమేయం లేదనీ సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తారు. కానీ సామాజిక సమస్యల ఒత్తిడి ఎక్కువైనప్పుడు ఆత్మగౌరవాన్ని కోల్పోకుండా ఈ ధోరణిలో పట్టు విడవకుండా వుండటం అసాధ్యమవుతుంది. ఈ క్రమంలో కొందరు శాస్త్రజ్ఞులు పారిశ్రామిక బంధాల నుంచి కార్మికులతో సంబంధాలు ఏర్పడటం వలన వర్గ పోరాటంలోకి ఆకర్షితులవుతారు. ఈ మార్గంలో శాస్త్రజ్ఞులు సోషలిస్టు విప్లవం నుంచి మాత్రమే ప్రజలకు సేవ చేయటంలో ఉపయోగ విలువలను ఉత్పత్తి చేయటానికి అంకితమయ్యే శక్తిగా శాస్త్రాన్ని శ్రమతో పునరైక్యం చేయవచ్చునని తెలుసుకుంటారు.

3. సరుకుగా కళ

"పెట్టుబడిదారీ ఉత్పత్తి కొన్ని బౌద్ధిక శ్రమశాఖలకు ప్రతికూలమైంది. ఉదాహరణకు కవిత్వం, కళ."[4]

శాస్త్రం ఉత్పత్తి శక్తిగా పరిణమించినట్లు కళ సరుకుగా పరిణమిస్తుంది. వినియోగవస్తువుగా ఈ సరుకు ఇతర సరుకులకంటె భిన్నమైనది. కళ విలువ నాగరిక వైఖరులలో (Fashions) మార్పులు, కళాఖండాలను సేకరించే సంపన్నుల, లాభాల కోసం వ్యాపారాన్ని నిర్వహించే వర్తకుల ఆర్థిక అంచనాల వంటి విశేషాంశాలతో నియతం అవుతుంది.

అర్ధబానిస సమాజంలో కళాకారుడు ఇతర చేతివృత్తుల వాళ్ళతో సమానంగా జాతి జీవితంలో అల్పస్థానంలో అయినా భద్రతాస్థానంలో వుండేవాడు. కళాకారుడు ప్రభు సేవలో వుండేవాడు. కానీ, ప్రభుకళాకారుల సంబంధం వ్యక్తిగతంగా వుండేది కానీ వ్యాపార సంబంధంగా వుండేదికాదు. సరుకుల ఉత్పత్తి అధికం కావటంతో ఈసున్నిత జానపద సంబంధాల స్థానంలో నగ్న ఆర్థిక సంబంధం వచ్చింది. బీథోవెన్ కాలంలో సంగీత కలాప కేంద్రం (centre of musical activity) ఆస్థాన సంగీత శాలల నుంచి ప్రదర్శన శాలలకూ, రాజపోషకుల నుంచి సంగీత కంపెనీ యజమానులకూ ప్రయాణం చేసింది. బీథోవెన్ ఈమార్పును ఆహ్వానించాడు, కానీ తాను మార్కెట్టుకు ఉత్పత్తిదారుడు అయ్యాననే బాధాకరమైన ఎరుక (aware ness) ఆయనకుంది.

"ప్రపంచంలో కళాకారుడుతన కళాఖండాలతో మరమ్మత్తుచేసి, వాటిని సృష్టించి తన అవసరాలను పొందే ఒకగొప్ప భద్రతాస్థలం వుండాలి. కానీ ఇప్పుడున్న పరిస్థితిలో కళాకారుడు సగం వర్తకుడుగా కూడా వుండాలి– దీనిని ఎలా సహించగలం ?"

పెట్టుబడిదారీ సమాజంలో కళాకారుని స్వేచ్ఛ మార్కెట్టుస్వేచ్ఛ.

పెట్టుబడిదారీ యుగంలో ఈస్వేచ్ఛ కూడా హరించ బడుతుంది. గొప్పవిద్యావంతులుగా పరిగణించబడే కొద్దిమందికి వినోదకారకంగాతప్ప గుత్తపెట్టుబడి దారులకు కళతో ఏమీ అవసరం వుండదు. మిగిలినది కళలను గుత్తపెట్టుబడి దారులు తమ లాభాలకు ఆధారంగా వుండే నైతిక, తాత్త్విక అవినీతినివ్యాపింపజేసే ప్రచారసాధనాలుగా వాడుకుంటారు. ఈ దుర్మార్గ ఫలితాలను ప్రతిచోటా చూడవచ్చును. సామ్రాజ్యవాద పిడికిలిలో ఇప్పటికీ వున్నదేశాల్లో ప్రజాసంస్కృతికి సంబంధించిన సంప్రదాయక కళారూపాలు క్రమబద్ధంగా నాశనం చేయబడడాన్ని స్పష్టంగా చూడవచ్చును.

ఈ పరిస్థితిలో కళాకారుడు తన యిష్టాన్ని తానే నిర్ణయించుకోవాలి. సరుకు ఉత్పత్తి దారుడుగా తనస్థానాన్ని అంగీకరించి వ్యాపారరీత్యా విజయాలను సాధించటం కోసం కృషి చేసుకోవచ్చును. కానీ అలాచేయటం కళాకారుడిగా తన చిత్తశుద్ధిని అమ్ముకోవటమే లేదా వ్యాపారవిలువలను నిరాకరిస్తూ కళాకారుడు కళాసృజన స్వాతంత్ర

ప్రతిపత్తిగల ఆత్మవ్యక్తీకరణ క్రియ (Autonomous act of self expression art) అని కళ కళకోసమే అనే సిద్ధాంతంతో శరణార్థికావచ్చును. కానీ ఆ వ్యాపార విలువల నుంచి తప్పించుకునే స్థితిని కలుగజేయకపోగా ఈసిద్ధాంతమే సరుకులఉత్పత్తిలో అంతర్గతంగావుండే అంతర్ముఖ వ్యక్తివాద అభివ్యక్తి (self- centred individualism inherent in commodity production). సామాజిక బాధ్యతను పరిత్యజించి కళాకారుడు తన భావావేశ ప్రేరణ మూలాధారం నుంచి తనకుతాను దూరం అవుతాడు. ప్రజలను ప్రేరేపించగల శక్తిని తిరిగి పొందాలంటే కళాకారుడు ప్రజల నుంచి ప్రేరణనుపొంది తీరాలి. తాను ప్రజలతో తాదాత్మ్యం చెందినప్పుడు మాత్రమేకళ అది ఇచ్చే అనుభూతికోసం విలువకు కట్టబడుతుందనీ మార్కెటువెలతో విలువ నిర్ణయించ బడదనీ కళాకారుడు నిశ్చయించు కోవచ్చును.

4. భావజాల పునరాకృతి.

సరుకుల ఉత్పత్తిలో వర్గదోపిడీతో అనుబంధమైవున్న భావాలు మన మనస్సుల్లో చాలా లోతుగా పాదుకొని వుంటాయి, ఆభావాల స్వభావాన్ని నిరంతర రాజకీయ పోరాటంతో మాత్రమే మనం పూర్తిగా గుర్తించగలుగుతాము. అందుచేత సోషలిస్టు విప్లవం జరుగుతున్నప్పుడు, తర్వాత కూడా పాత దోపిడీ వర్గాలకు మాత్రమే కాక కార్మికవర్గం మేధావులతో సహా విప్లవాన్ని సమర్థించిన వర్గాలకు కూడా– అన్ని వర్గాలకూ భావజాల పునరాకృతి ఇవ్వవలసిన అవసరం ఉంది.

"కార్మికవర్గం వర్గపోరాటంలో, ప్రకృతిమీద పోరాటంలో మొత్తం సమాజానికి పునరాకృతిని ఇస్తుంది– ఆ సమయంలోనే కార్మికవర్గం కూడా పునరాకృతిని పొందుతుంది."[5]

మేధావులకు నాయకత్వం వహించటంలో కార్మిక వర్గం పార్టీనాయకత్వంలో భావజాల పునరాకృతిని పొంది మాత్రమే నూతన సమాజానికి పూర్తిదోహదం చేయగలరని మేధావులను ఒప్పించాలి.

"మన సాహిత్య, కళాకార్యకర్తలు తప్పనిసరిగా ఈ కర్తవ్యాన్ని సాధించి తమదృక్పథాన్ని మార్చుకోవాలి. వాళ్ళ (ప్రజల) మధ్యకుపోయి కలిసి జీవించే క్రమం నుంచీ, వాస్తవ రాజకీయ పోరాటాలలో నిమగ్నులయ్యే క్రమం నుంచీ, మార్క్సిజాన్ని సమాజాన్ని అధ్యయనం చేసే క్రమం నుంచీ మన సాహిత్య, కళాకార్యకర్తలు తప్పనిసరిగా క్రమేపీ శ్రామికుల వైపునకు, రైతాంగంవైపుకు, సైనికుల వైపుకు, కార్మిక వర్గ పక్షంవైపుకు నడవాలి."[6]

"మేధావులు కొంత అభ్యుదయాన్ని సాధించారు. కానీ వాళ్ళు సంతృప్తి చెంద కూడదు. క్రిమేపీ తమ బూర్జువా ప్రాపంచిక దృక్పథం నుండి నవసమాజం అవస రాలకు సరిపడేవిధంగా కార్మిక, రైతాంగ వర్గాలతో సమైక్యం చెందడానికి మేధావులు పునరాకృతిని పొందుతూనే వుండాలి. ఈ ప్రాపంచిక దృక్పథం మార్పు చాలా ప్రాథ మికమయింది. మన మేధావులలో చాలామంది ఈ మార్పును సాధించారని చెప్పటానికి వీలులేదు. వాళ్ళు అభ్యుదయాన్ని సాధించటం కొనసాగిస్తారనీ, పని, అధ్యయనాల గమనంలో వాళ్ళు క్రమేపీ కమ్యూనిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని పొందుతారనీ, మార్క్సిజం- లెనినిజం మీద మంచి అవగాహనను సాధిస్తారనీ, కార్మిక-రైతాంగంతో సమైకం చెందుతారనీ మనం ఆశించ వచ్చును."7

ఈ క్రిమాన్ని కార్మిక వర్గనాయకత్వమే నిర్వహిస్తుంది. అది విజయ వంతం కావాలంటే మేధావుల స్వేచ్ఛా సమ్మతితో, వాళ్ళమీద పూర్తి విశ్వాసంతో కొనసాగించాలి.

"నాయకత్వంతో స్వేచ్ఛను, కేంద్రీకృత అధికారంగల ప్రజాస్వామ్యాన్ని మనం సమర్థిస్తూ వాదించటంలో భావజాల సమస్యలను లేదా ప్రజలలో తప్పు, ఒప్పులకు మధ్య వ్యత్యాసానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించటానికి నిర్బంధవిధానాలను అనుసరించాలని ఏ మార్గంలోనూ మనం ఉద్దేశించటం లేదు. భావజాల సమస్యలను, తప్పు, ఒప్పు సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వ శాసనాలనూ నిర్బంధ విధానా లనూ ఉపయోగించాలనే అన్ని ప్రయత్నాలూ శక్తి హీనాలేకాక నష్టదాయకాలు కూడా. మతాన్ని నమ్మవద్దని ప్రభుత్వ శాసనంతో కానీ, ప్రజల్ని బలవంతం చేసికానీ మనం మతాన్ని నాశనంచేయలేము. మార్క్సిజాన్ని నమ్మమని ఎలా బలవంతం చేయలేమో అలాగే భావవాదాన్ని వదిలిపెట్టమని ప్రజల్ని బలవంత పెట్టలేము. భావజాల సమ స్యల్ని పరిష్కరించే ఏకైకమార్గం, ప్రజలలో వివాదాస్పద సమస్యల్ని పరిష్కరించే ఏకైక మార్గం, చర్చ, విమర్శ, నచ్చచెప్పటం, విద్యావంతం చేయటం మొదలైన ప్రజాస్వామ్య పద్ధతులు. అంతేకానీ నిర్బంధం, అణచివేత విధానం ద్వారా పరిష్కరించలేము."8

గడచిన పావు శతాబ్దం నుంచీ చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవం కూడా ఈ మార్గంలో వ్యవహరించటం వల్లనే కార్మిక వర్గానికీ, మేధావులకూ మధ్యనున్న మిత్ర వైరుధ్యాన్ని విజయవంతంగా పరిష్కరించ వచ్చునని రుజువు చేసింది.

5. బూర్జువా నీతి, సంస్కృతి:

బూర్జువా భావజాలంలో తప్పొప్పులకు సంబంధించిన సమస్యలను దైవ సంకల్పానికో, మానవ సమాజానికి బాహ్యంగా నిలబడే ఇతర ప్రమాణానికో అన్వయించి ప్రస్తావిస్తారు. కార్మిక వర్గ భావజాలంలో తప్పొప్పులకు సంబంధించిన సమస్యలను కార్మిక విప్లవాన్ని కొనసాగించవలసిన వేగవంతమైన అవసరం వెలుగులో నిర్ణయించి మనిషి మనిషిని దోపిడీచేయటాన్ని అంతమొందిస్తుంది.

"మానవాతీత, వర్గాతీత భావనల మీద ఆధార పడి నీతిని మనం నిరాకరిస్తాం. ఇది భూస్వాముల పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక రైతాంగాన్ని వంచన చేసి, మభ్యపెట్టి, బుద్ధిహీనులను చేస్తుంది. మననీతి శ్రామికవర్గ వర్గపోరాటానికి పూర్తిగా విధేయంగా వుంటుందని మనం చెపుతాం."[9]

"పాత సమాజం దోచుకోలేదా దోచుకోబడు, ఇతరుల కోసం పనిచేయి లేదా నీకోసం ఇతరులతో పనిచేయించుకో, బానిస యజమానిగా వుండు లేదా బానిసగా వుండు అనే సూత్రం మీద ఆధారపడివుంది. నేను ఈ మడిచెక్క (సెంటో, కుంటో భూమి) లో పని చేస్తుంటే ఇతరులను గురించి ఏ మాత్రం పట్టించుకోను; ఇతరులకు తిండిలేకపోతే మరీ మంచిది, నా పంటకు నాకు ఎక్కువ ఆదాయం వస్తుంది. నాకు ఏదో ఒక ఉద్యోగం-డాక్టరో, ఇంజనీరో, ఉపాధ్యాయుడో, గుమాస్తానో ఏదో ఒకటి వుంటే చాలు ఇతరులను గురించి ఏ మాత్రం పట్టించుకోను. అధికార వర్గాలకు నేను భజన చేస్తే, నీచంగా వాళ్ళ దయను అర్థిస్తే నేను నా ఉద్యోగాన్ని భద్రంగా ఉంచుకోవచ్చు. అలా జీవితయాత్ర కొనసాగించి బూర్జువా కూడా కావచ్చు. ఒక కమ్యూనిస్టు ఇలాంటి మనస్తత్వానికీ, ఇలాంటి అభిప్రాయాలకూ చోటు ఇవ్వకూడదు.

ప్రజలు మనతో నీతిని గురించి మాట్లాడుతున్నప్పుడు కమ్యూనిస్టుకు నీతి అంతా ఐక్యక్రమశిక్షణలో దోపిడీదారులకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన ప్రజాపోరాటంలో లీనమై వుంటుందని మనం చెప్పాలి. శాశ్వత నీతిలో మనకు నమ్మకం లేదు. మనం నీతిని గురించిన పిట్టకథల అసత్యతను బహిరంగ పరచాలి. నీతి మానవ సమాజం ఉన్నతస్థాయికి అభివృద్ధి పొందటానికి సహాయం చేస్తూ, శ్రమను దోపిడీ చేయటం నుంచి స్వేచ్ఛను పొందటానికి సహాయం చేస్తుంది."[10]

బూర్జువా నీతిని మనం నిరాకరిస్తాం. ఆనిరాకరణ బూర్జువా సంస్కృతిని నిరాకరించటానికి దారి తీయకూడదు. ఇక్కడ మనం బూర్జువాల ద్వంద్వ స్వభావాన్ని మనస్సులో పెట్టుకొని వ్యత్యాసాన్ని చూపాలి.

శాస్త్రీయ సత్యం ఆచరణలో పరీక్షించబడిన బాహ్య ప్రపంచ వస్తుగత జ్ఞానం. ఆధునిక శాస్త్ర విజయాల వలన ఈనాడు మనిషి దోపిడీని అంతం చేసే అవకాశాన్ని భావించవచ్చును. ఆధునిక శాస్త్రం బూర్జువాల సృష్టి. మార్క్సిజం ఇలా చెపుతుంది. "పెట్టుబడిదారీ విధానంలో పోగుపడిన మానవజ్ఞానం దృఢ పునాది మీద ఆధారపడి వుంది."[11] కార్మిక వర్గం ఈ జ్ఞానాన్ని నిరాకరించదు. దానిని గ్రహిస్తుంది, అదనపు జ్ఞానాన్ని చేకూరుస్తుంది. ఆ జ్ఞానాన్ని మానవ ప్రయోజనం కోసం ఉపయోగపెడుతుంది.

కళా సత్యం కళాకారుడు వర్ణించే ఆవేశాల అంతరంగిక ప్రపంచ వ్యక్తీకరణ. ఒక వర్గానికీ మరొక వర్గానికీ, ఒక యుగానికీ మరొక యుగానికీ మారుతుండే సౌందర్యం, మంచీ చెడూ, తప్పూ ఒప్పులకు సంబంధించిన భావాలతో ప్రమేయంలో వుండే కళా సత్యం దాని స్వభావాన్ని అనుసరించే ఆత్మాశ్రయమైనది. చాలా కాలం బూర్జువా శాస్త్రంతో చేతులు కలిపి ప్రయాణం చేసిన బూర్జువా కళ నుంచి మానవుడు వ్యక్తమయ్యాడు. అలా వ్యక్తీకరించుకొంటూనే భవిష్యత్తు మీద తననూ తన విశ్వాసాన్ని దృఢం చేసుకున్నాడు. ఈ సందర్భంలోనే గొప్ప బూర్జువా వాస్తవిక వాదులకు తమ సమాజ హృదయంలోని పగులును గూర్చి నిజమైన చైతన్యం వుంది.

చెదరిపోయిన గుడ్డ పేలికల్లోంచి చిన్నచిన్న లోపాలు కనిపించితీరుతాయి
ఫర్ గౌన్లూ, పెద్దపెద్ద జుబ్బాలూ అన్నిటినీ దాచిపెడతాయి.
పాపాన్ని బంగారపు పూత పుయ్యి,
చట్టమనే బలమైన ఈటె దానిని గాయపరచదు
దానిని చింపిరి గుడ్డలతో కప్పావా, మరుగుజ్జుచేతిలోని గడ్డిపోచకూడ
దానిని పొడిచెయ్యగలదు.

ఇది వాళ్ళ కృషికి సంబంధించిన అనుకూల లేదా విప్లవ శీల అంశం. వాళ్ళ వర్గ, యుగ సంబంధమైన భావజాల పరిమితులను అనుసరించి బూర్జువా వర్గంలో ప్రతికూల, ప్రతీప అంశం కూడా వుంటుంది. వర్తమాన బూర్జువా సమాజంలో ప్రతికూల అంశం బాగా వ్యాప్తిలో వుంటుంది. కళాకారుని కళాఖండం సాంకేతికంగా నిపుణకృతి కావచ్చును కానీ దాని వస్తువు క్షీణంగా, నిస్సారంగా వుంటుంది. ప్రజా రాశులతో ఆకృతికి సంబంధం పోతుంది. అందుచేత అది వేళ్ళ దగ్గరే ఎండిపోతుంది.

బూర్జువా మహా కావ్యాల విషయంలో తమ ధోరణిని నిర్ణయించుకోవటంలో కార్మిక వర్గం తప్పనిసరిగా తన స్వీయ వర్గ ప్రయోజనాలనే దృష్టిలో వుంచుకోవాలి.

రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛ కళా ప్రమాణం వుండదు. ఐతే ఒక కళా ఖండాన్ని స్వచ్ఛ రాజకీయ దృక్కోణం నుంచి యుక్తమైన రీతిలో అంచనా కట్టలేం. కళా, రాజకీయ ప్రమాణాలను మిళితం చేయాలి.

"రాజకీయ ప్రమాణం వుంది, కళా ప్రమాణం వుంది. వాటి మధ్య సంబంధం ఏమిటి? రాజకీయాలూ, కళా ఒకటే అనరాదు. సాధారణ ప్రాపంచిక దృక్పథాన్ని కళా సృజన పద్ధతికీ, విమర్శనా పద్ధతికీ సమానం అని భావించరాదు. అరూపమైన, అఖండమైన, మార్పుపొందని రాజకీయ ప్రమాణం వుంటుందనటాన్ని మాత్రమేకాదు; అరూప, అఖండ, మార్పులేని కళాప్రమాణం వుంటుందనటాన్ని కూడా మనం నిరాకరిస్తాం: ప్రతి సమాజంలో ప్రతి వర్గానికీ సొంత రాజకీయ, కళా ప్రమాణాలు వుంటాయి. కానీ అన్ని వర్గ సమాజాల్లోనూ అన్ని వర్గాలూ తప్పకుండా రాజకీయ ప్రమాణాన్ని మొదటిగా, కళా ప్రమాణాన్ని రెండవదిగా చూస్తారు. బూర్జువాలు ఎంతటి కళానైపుణ్యం వున్నప్పటికీ శ్రామిక వర్గ కళా సాహిత్యాలను ఎప్పుడూ అణచి వేస్తారు. ప్రాచీన యుగాల్లోని కళా సాహిత్యాల మీద శ్రామిక వర్గం తమ దృక్పథాన్ని, చారిత్రికంగా వాటికి ప్రగతిశీలకసార్థకత వుందా, లేదా అనే విషయాలను పరీక్షించిన తర్వాత మాత్రమే నిర్ణయించుకోవాలి. రాజకీయంగా స్పష్టంగా అభివృద్ధి నిరోధకమైన కొన్ని కళాకృతులకు ఎంతో కొంత కళాగుణం వుండవచ్చును. వాటిల్లో వస్తువు ఎంత ఎక్కువ అభ్యుదయ వ్యతిరేకంగా వుంటుందో, వాటి కళా గుణం ఎంత ఉన్నతంగా వుంటుందో అవి ప్రజలకు అంతగా విషపూరితంగా వుంటాయి కాబట్టి వాటిని నిరాకరించటం ఎక్కువ అవసరం. దోపిడీ వర్గాలు పతనమయ్యే యుగంలో వాళ్ళ కళా సాహిత్యాలలో అభ్యుదయ వ్యతిరేక రాజకీయ వస్తువుకూ, శిల్పానికీ మధ్య వైరుధ్యం వుండటం ఒక సామాన్య లక్షణం. మనం కోరేది రాజకీయాలకూ కళకూ ఐక్యత, వస్తువుకూ శిల్పానికీ ఐక్యత, విప్లవ రాజకీయ వస్తువుకూ అవకాశం వున్నంత ఉన్నత సమగ్ర కళారూపానికీ ఐక్యత."13

బూర్జువా మహా కావ్యాలను తన స్వీయ దృక్పథం నుంచి పునర్ వ్యాఖ్యానించిన తర్వాత కార్మికవర్గం, ఆ కావ్యాల్లో వున్న సృజనాత్మక అంశాలను జీర్ణం చేసుకొని, జానపద సాహిత్యానికి సంబంధించిన గొప్ప సంచితంతో సహా స్వీయ కళా సంప్రదాయాల్లోకి కలుపుకోవాలి. ఈ అంశాల సమ్మేళనం నుంచి రాజకీయ పోరాట గమనంలో భవిష్యత్తుకు సంబంధించిన నూతన కళ – వస్తువులో సామ్యవాదం, రూపంలో జాతీయత వుండే కళారూపం పుడుతుంది.

ఈ విషయాలన్నిటిలోనూ ప్రజల్లో లీనం ఐనప్పుడే విప్లవ మేధావులు నిర్వహించాల్సిన అనివార్య పాత్రను నిర్వహించగలరు.

"మనం మన కళాసాహిత్య సంచితంలోని మంచి విషయాలనన్నిటినీ గ్రహించి, ఉపయోగకరమైన అన్నిటినీ విమర్శనాత్మకంగా జీర్ణం చేసుకోవాలి. మన స్థల కాలాల్లోని ప్రజా జీవితాల్లోని సాహిత్య కళా ముడిసరుకుల నుంచి మనం కళా ఖండాలను సృష్టిస్తున్నప్పుడు నమూనాలుగా ఉపయోగించుకోవాలి. కానీ ప్రాచీన కళాసాహిత్య సంపద నుంచి తీసుకోవటం, వాటిని నమూనాలుగా ఉపయోగించటం ఎన్నడూ మన స్వీయకళా సృజన స్థానాన్ని ఆక్రమించరాదు; అలాచేయటం కళాసృజనకాదు. చైనా విప్లవరచయితలు, యువరచయితలు, కళాకారులు ప్రజల్లోకి వెళ్ళాలి. వాళ్ళు చాలా కాలం సందిగ్ధాలు లేకుండా హృదయ పూర్వకంగా కార్మిక, రైతాంగ, సైనిక ప్రజా రాశుల్లోకి వెళ్ళాలి. విభిన్నరకాల ప్రజలసందర్శ్ని అన్నిరకాల జీవిత, పోరాటధోరణుల వైవిధ్యాన్నీ, కళాసాహిత్యాల ముడిపదార్థాలన్నిటినీ పరిశీలించటానికి, అనుభవం సంపాదించటానికి, అధ్యయనం చేసి విశ్లేషించటానికి ఒకే ఆధారమైన, విశాల సంపన్న ఆధారమైన పోరాటంలో నిమగ్నులు కావాలి."[14]

సరిగ్గా ఇదే సందేశాన్ని వాస్తవ పోరాటంలో నిమగ్నమై, విప్లవంలో జీవితాన్ని కోల్పోయిన అమరుడు క్రిస్టోఫర్ కాడ్వెల్ ఇంగ్లీషు మేధావులకు ఇచ్చాడు. వాళ్ళను కార్మిక వర్గం పేరుతో ఉద్దేశిస్తూ ఇలా అన్నాడు.

"అస్తిత్వంలోకి వస్తున్న నూతన ప్రపంచాన్ని వ్యక్తం చేయగలిగిన ఆ ప్రపంచాన్ని సాధించటంలో ఒకభాగంగా వుండేవిధంగా కళాశిల్పాన్ని, కళాప్రక్రియలను పునఃరూపొందించే క్లిష్టమైన, సృజనాత్మక మార్గాన్ని మనం చేపట్టాలి. అప్పుడు మనం మనకళను శ్రామిక కళగా, సజీవకళగా చెప్పవచ్చును. అప్పుడు మనం మన అంతరాత్మ భూతకాలంనుంచి బయట పడిందని చెప్పవచ్చును. అది జరిగిపోయిన కాలాన్ని వర్తమానంలోకి ఈడ్చుకురావాలి, భవిష్యత్తును సాధించటానికి బలవంతంచేయాలి."[15]

6. భ్రమ – వాస్తవికత

వర్గ సమాజంలో, ముఖ్యంగా వర్తమాన పెట్టుబడిదారీ సమాజంలో సత్యం, సౌందర్యం శత్రువైరుధ్యాలుగా కనిపిస్తాయి. వాస్తవం వికారం, అవాస్తవం సౌందర్యం. కళాకారుడు ఊహలో ఊహనుండి(In and through the imagination) ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటానికి ప్రయత్నిస్తాడు. ఈ విషయంలో కళాకారుడు

మాంత్రికునితో పురాణకర్తలతో పోలివుంటాడు. కాని మాంత్రికుడు, పౌరాణికుడు వాస్తవంతో భ్రమను గందరగోళ పరచగా, కళాకారుడు, భ్రమగానే తన భ్రమ విషయంలో చైతన్యంగా ఉంటాడు. కళాకారుడు, కార్మికవర్గ పక్షంలో చేరి పోయి నప్పుడు ప్రజారాశులకు అంకితమై పోయినప్పుడు ఇంకాలోతైన మార్పును పొందు తాడు. తనభ్రమను భ్రమగా గుర్తించటమే గాక, ఇప్పుడు ఆ భ్రమ సామాజికపునాది విషయంలో కూడా చైతన్యం పొందుతాడు. మార్క్సిస్టు- లెనినిస్టుగా కళాకారుడు మానవ చైతన్యం మానవ సామాజిక అస్తిత్వంతో నిర్ణయించబడుతుందని అవగాహన చేసుకుంటాడు. సాధారణంగా భౌతిక జీవితం మానసిక జీవితాన్ని నిర్ణయించినప్పటికీ మానసిక జీవితం భౌతిక జీవితం మీద తిరిగి ప్రభావం చేస్తుందని కూడా అవగాహన చేసుకుంటాడు. అందుచేత అతని దృష్టిలో కళాకారుని కర్తవ్యం వాస్తవికత నుంచి పలాయనం చేసి కాల్పనిక ప్రపంచంలో శరణార్థి కావటానికి ప్రయత్నించటం కాదు. తన సహశ్రామికులకు వాళ్ళు సృష్టించటానికి పోరాడుతున్న నూతన ప్రపంచ వాస్తవి కతను, దాని సర్వతోముఖ ఉదాత్తతను వ్యక్తంచేయటం; అలా వ్యక్తంచేస్తూ ఆ నవ్య ప్రపంచ సాధనను వేగవంతం చేయటం కోసం ఇంకామహత్తర కర్తవ్యాలను నిర్వ హించటానికి ఉత్తేజితులను చేయటం.

"విప్లవసాహిత్యం, విప్లవకళలు వాస్తవజీవితం నుంచి వైవిధ్యంగల పాత్రలను సృష్టించి చరిత్ర గతిని ముందుకు తీసుక పోవటానికి ప్రజలకు సహాయం చేయాలి. ఉదాహరణకు, ఒకవంక ఆకలి, చలి, అణచివేతల నుంచి బాధపడటం, మరొక వంక మనిషిని మనిషి దోపిడీ చేయటం, అణచివేయటం వుంది. ఈవాస్తవాలు అన్ని చోట్లా అస్తిత్వంలో వున్నాయి. ప్రజలు వాటిని సర్వసాధారణమైనవిగా చూస్తున్నారు. రచయితలు, కళాకారులు ఇలాంటి ప్రత్యక్ష విషయాల మీద దృష్టి కేంద్రీకరించి, వాటిల్లో వున్న వైరుధ్యాలను, పోరాటాలను ఉదాహరణలుగా చూపుతూ ప్రజలను మేల్కొలిపే, ఉత్సాహాన్ని జ్వలింపజేసే రచనలు సృష్టించి, పరిసరాలను మార్చటానికి ఐక్యమై పోరాటం చేసే విధంగా ప్రేరేపించి పురోగమింప చేయాలి."16

ఈ మార్గంలో కార్మికవర్గ విప్లవం తుదివిజయానికి పురోగమిస్తున్నప్పుడు, పాత సమాజ మేధావులు ప్రజలతో తాదాత్మ్యం చెందుతుంటే శాస్త్రీయమైన, కళాత్మ కమైన పాత సమాజ విజయాలను జీర్ణం చేసుకుంటూ ప్రజారాశులు సాంస్కృతిక స్థాయిని పెంచుకుంటే అప్పుడు సమాజం వర్గాలుగా విభజింపబడటం, మానసిక శ్రమకూ, శారీరక శ్రమకూ మధ్య విభజన రద్దయి, మానవ అనుభూతి అంశంతో

విశాల ప్రజానీకంలో చైతన్యం పెరుగుతున్నట్లుగానే తమ మౌలిక మానవ హక్కుల గురించి, ప్రజాస్వామ్య హక్కుల గురించి చాల ఏళ్ళుగా ముఖ్యంగా ఢిల్లీ పోలీసుల ఆందోళన, యు పి పోలీసుల ఆందోళన కాలం నుంచి పోలీసులకు కూడ స్పృహ పెరిగింది. పోలీసుల్లోకి విద్యావంతులైన యువకులను చేర్చుకోవడం కూడ ఇందుకు దోహదంచేసి వుండవచ్చు. విద్యావంతులైన యువకుల్లో నిరుద్యోగం పెరిగినా కొద్దీ ఇది అనివార్యం.

ఇవ్వాళ దేశవ్యాప్తంగా పోలీసులు ఆందోళన చేస్తున్న ముఖ్యమైన కోరిక యూనియన్ పెట్టుకునే హక్కు. మన హక్కుల ఖజానాలో ఎప్పుడూ మరో హక్కు సాధించడాని కవసరమైన ప్రాథమిక హక్కును భద్రపరచుకోవాలి. అదే సంఘం పెట్టుకునే హక్కు. పోలీసులు కోరిన ఇతర డిమాండులు : 1) పోలీసు కమీషన్ నివేదిక ప్రచురణ, 2) ఎనిమిది గంటల పని నియమం లేదా అదనపు పనికి అదనపు వేతనం, 3) వారానికో సెలవు, గెజెట్‌లో ప్రకటించిన సెలవులు, ఇతర సెలవులు లేదా వీటికి నష్టపరిహారం, 4) ఆఫీసర్లు, రాజకీయ నాయకులు అవమానకరమైన, అసభ్యకరమైన మాటలు వాడకుండా వుండుట, 5) ఆర్డర్లీపద్ధతి రద్దు అంటే వెట్టిచాకిరీ రద్దు, 6) వేతనాల పెంపుదల, ఇంక్రిమెంట్లు, అలవెన్సుల హెచ్చింపు, 7) గృహ వసతి, 8) టెరికాట్ యూనిఫామ్‌లు.

పంజాబ్‌లో ఈ డిమాండులతో పంజాబ్ పోలీసు యూనియన్ పేరుతో చాల చోట్ల పోస్టర్లు పడ్డాయి.

అకాలీ జోతేదార్లు, శాసన సభ్యులు, వాళ్ళ బంధువులు, మద్దతుదార్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పోలీసులను కొట్టిన ఉదంతాలు కూడ వున్నాయి. ఇప్పటి ఈ ఆందోళన కూడ పైన ప్రస్తావించినట్లుగా ఇటువంటి సంఘటనతోనే రగుల్కొన్నది.

మే 5వ తేదీన గోవిందఘర్‌లో దలీప్‌సింగ్ పాండే అనే అకాలీ ఎం ఎల్ ఎ ట్రాఫిక్ డ్యూటీలోవున్న ఒక పోలీసు కానిస్టేబుల్‌ను కొట్టాడు. ఆ కానిస్టేబుల్ చేసిన నేరమేమిటయ్యా అంటే ఎంఎల్ఎ గారికి శాల్యూట్ చేయలేదు. కానిస్టేబుల్ డ్యూటీ మీద తాగివున్నాడని ఎంఎల్ఎ ఆరోపించాడు. వైద్య పరీక్ష చేసిన డాక్టర్ కానిస్టేబుల్ తీవ్రమైన జ్వరంతో వుండడం వల్ల సరిగా చూడలేకపోయాడని చెప్పాడు.

ఈ సంఘటన నిప్పురవ్వగా పనిచేసింది. పాటియాలాలో రెండు వందల మంది పోలీసులు ఊరేగింపు తీసి ఎనిమిది గంటలు ప్రదర్శన చేసారు. రెండు రోజుల్లో

పంజాబ్ అంతా వ్యాపించింది. ప్రదర్శనలు, ఊరేగింపులు, సభలు ప్రతి జిల్లా కేంద్రంలోనూ, పట్టణాల్లోనూ జరిగాయి. ఇది ఇతర రాష్ట్రాలకు కూడ వ్యాపించింది. రాజస్థాన్, గుజరాత్ ముఖ్యంగా పేర్కొన దగ్గవి. ఒక అహ్మదాబాదులో తప్ప మిగతా అన్నిచోట్ల ఎన్ని కఠినంపు చర్యలు ఉన్నా పోలీసులు ప్రశాంతంగా ఆందోళన కొనసాగించారు. ఒక్క పంజాబ్‌లోనే ఇప్పటికి 800 కి పైగా అరెస్టు చేసారు. రెండు వేల మందిని ఉద్యోగాల్లోంచి తీసివేయాలని ఆలోచిస్తున్నారు. మూడు వందల మందిని అప్పుడే తొలగించారు కూడ. ఆందోళనకారులను శిక్షించడానికి జైళ్ళలోనే రహస్య విచారణ (ఇన్ కెమెరా ట్రయల్స్) నిర్వహించాలని అకాలీ-జనతా ప్రభుత్వం నిర్ణయించింది. ఆందోళనాకారులను అణచివేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతోవున్నది. పంజాబ్ పోలీసు యూనియన్ ఎక్కడ ప్రదర్శన చేయ తలపెట్టినా అక్కడ ప్రభుత్వం దారులన్నీ మూసివేస్తున్నది. వచ్చి పోయే ప్రతి వాహనమూ ఆపి వెతుకుతున్నది– ఎవరైనా పోలీసులుంటే అరెస్టు చేద్దామని. కాబట్టి నలభై జిల్లాల ప్రతినిధులతో ఏర్పడిన పంజాబ్ పోలీసు యూనియన్ ఒక రహస్య సమావేశంలో దీర్ఘకాలిక ప్రతిఘటన ద్వారా ప్రభుత్వం ఈ ప్రతీకార చర్యలు విరమించుకొని తమ డిమాండులన్నీ నెరవేర్చేదాకా పోరాటం కొనసాగించి అరెస్టులకైనా సిద్ధం కావాలని నిర్ణయించింది.

ఈ ఆందోళనకు విస్తృతమైన సహాయ సహకారాలు వున్నాయనడానికి మొత్తం పంజాబును సరిహద్దు రక్షక దళానికి (బి. ఎస్. ఎఫ్), కేంద్ర రిజర్వు పోలీసుకు (సి.ఆర్.పి) అప్పగించడాన్ని బట్టే తెలుస్తున్నది. కొన్నిచోట్ల పోలీసుల నణచడానికి సైన్యాన్ని కూడా తేవలసి వచ్చింది. ఆయుధాగారాల కాపలాను బిఎస్ఎఫ్, సిఆర్‌పి లను కూడా నమ్మక సైన్యానికి అప్పగించారు.

మరో గమనించ వలసిన అంశం ఏమిటంటే సాధారణంగా పోలీసుల చేతుల్లో వేధింపబడి, దౌర్జన్యానికీ హింసకూ గురి అయ్యే సామాన్య మానవులు కూడా ఈ ఆందోళన పట్ల సానుభూతి చూపారు. దాదాపు అన్ని ప్రగతిశీల ప్రజాతంత్ర సంస్థలు, ట్రేడ్ యూనియన్లు, విద్యార్థిసంఘాలు, కిసాన్ సభలు పోలీసు ఆందోళన కారులకు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. పోలీసులకు మద్దతుగా వాళ్ళు ప్రదర్శనలు చేసి అరెస్టయ్యేంత దూరం కూడా పోయారు.

మానవత్వాన్ని మొత్తం హరింపచేసే స్వభావం గల విధినిర్వహణ, మర యంత్రాలుగా మార్చే శిక్షణ పోలీసులను ఎంత మొద్దుబార చేస్తాయంటే ప్రజలపట్ల ఎంత క్రూరంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించేలా చేస్తాయంటే వాళ్ళకు తమ హక్కుల

కోసం పోరాడుతున్న తమ వర్గం సోదరుల భావాలనూ, బాధలనూ అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. వాళ్ళు యిప్పుడు ప్రజలనుంచి తామెట్లా వేరు చేయబడి ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వంతో అధికార స్వామ్యంతో దుర్వినియోగ పరచుకోబడుతున్నదీ తెలిసొస్తున్నది.

ఈ ఆందోళనను ఎట్లా ఎదుర్కోవాలనే విషయంలో రెండు వైఖరులు కనిపిస్తున్నవి. సైన్యాన్ని పిలిచి మొదటినాడే యీ ఆందోళనను తీవ్రంగా అణచివేయాలని పంజాబ్ పోలీస్ యిన్స్పెక్టర్ జెనరల్ అనుకున్నాడు. ఒక సాయుధబలం ఆందోళనను అంతకంటే శక్తివంతమైన మరొక సాయుధబలంతో అణచాలని ఆయన సూచన. మొదటినాడు అదిసాధ్యం కాలేదు. ఐ జి పి తీసుకున్న యీ తీవ్రవైఖరిని ఆర్ ఎస్ ఎస్ జనసంఘ్ లాబీ, భూస్వామ్య వర్గాల లాబీ, అకాళీదళ్‌లోని ఉన్మాదులు బలపరిచారు. వీళ్ళదే తర్వాత పైచేయి అయింది. ఫలితంగానే బి ఎస్ ఎఫ్, సీ ఆర్ పి, కొంతవరకు సైన్యం కూడా రంగంలోకి వచ్చాయి. కాని బ్యూరాక్రసీలో ఒక వర్గం, కొంత మంది క్యాబినెట్ మంత్రులు పోలీసులతో సంప్రదింపులు జరిపి వాళ్ళ కోరికలు సానుభూతితో పరిశీలించాలన్నారు. కర్రపెత్తనం దృక్పథం పనికిరాదని, పోలీసులను యింకెంతో కాలం యింటి సేవకులుగా చూడడం కుదరదన్నారు.

ఏడవరోజున పంజాబ్ ప్రభుత్వం ఎప్పుడైతే ఒక్కసారి నూరు రూపాయల జీతం పెంచేసిందాన్ని బట్టి ప్రభుత్వం దండోపాయాలను రెండిటినీ సామభేదాలను రెండిటినీ సమతూకంలో వాడదలచుకొన్నదని అర్థమవుతున్నది. ఒక చెంపన పంజాబ్ వేతన కమిషను సిఫారసు చేసిందానికన్నా ఆర్థిక సౌకర్యాలను ప్రకటించింది. మరొక చెంపన తమ సమస్యలను వీధుల్లోకి తీసుకపోయిన పోలీసు వాళ్ళకు తక్కిన వాళ్ళందరూ చూసి భయపడేంతగా గట్టి వాత పెట్టడానికి కృతనిశ్చయమై వున్నది.

ఎక్కువ ఆర్థిక సౌకర్యాలు కూడా పోలీసులనేమీ తృప్తి పరచలేదు. అన్ని తీర్ల నిరసన ప్రదర్శనలు అసాధ్యమైపోయినప్పుడు వాళ్ళిప్పుడు ఆందోళనను దీర్ఘకాలికం సాగించి అరెస్టు కావాలని నిర్ణయించుకున్నారు.

ఈ ఆందోళన పోలీసుల్లో ఆర్థిక, యితర ప్రజాస్వామిక హక్కుల కోసం కలిగిన యీ చైతన్యం దేశంలో తప్పకుండా కొత్త పరిణామాలకు దారితీస్తుంది. ఈ [క్రమశిక్షణాయుత] క్రింది శ్రేణులు తామింతకాలమూ పాలకవర్గాల చేత సామాన్య ప్రజలకి వ్యతిరేకంగా అమానుషంగా ఉపయోగించుకో బడ్డామని గ్రహిస్తారు. పోలీసులకు యూనియన్లు వస్తే ప్రజాతంత్ర ఉద్యమాలను అణచివేయడానికి తాము ఉపయోగ

పడ కూడదన్నే ఒక సంఘ చైతన్యం కలుగుతుంది. కింది పోలీసు అధికారులకు కూడా వున్న అవినీతి, లంచగొండి తనం, చెడ్డపేరు తొలగిపోవడానికి కూడా తోడ్పడవచ్చు. కాని ఈ యూనియన్లు నామమాత్రపు యూనియన్లో, కీలు బొమ్మ యూనియన్లో ప్రభుత్వమూ, పోలీసు ఉన్నతాధికారులూ పోలీసుల కొరకు పెట్టిన యూనియన్లో అయితే అవి తప్పకుండా ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావంగల వ్యక్తుల చేతుల్లోకి పోతాయి. ఉన్నతాధికారులూ వారితొత్తుల చేతుల్లో పడుతాయి. అప్పుడవి ప్రజలను అణచివేయడానికి మరింత శక్తివంతమైన పనిముట్లవుతాయి. అంటే ఫాసిజానికి ఉపయోగపడే పోలీసు యూనియన్లు అవుతాయి. కాని కనీసం పంజాబ్ పోలీసు ఆందోళన యీ ప్రమాదాన్ని కూడా గుర్తించి జాగ్రత్త పడుతున్నదనే సూచనలనిస్తున్నది. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బలపరచకుండా ప్రజలపై అణచివేత పనిముట్లుగా వుపయోగపడడానికి నిరాకరించకుండా ప్రజల సహకారాన్ని కోరే నైతికహక్కు తమకు లేదని పోలీసులు గుర్తించిన నాడే వాళ్ళ న్యాయమైన హక్కులు సాధించుకోగలరు. అప్పుడు మాత్రమే ప్రజలకూ, పోలీసు కానిస్టేబుళ్ళకూ మధ్య సద్భావం పెరుగుతుంది.

[సుబాసింగ్ గిల్, అమర్‌సింగ్ ఆజాద్ జూన్ 2 ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ జూన్ 9 ఫ్రాంటియర్‌లలో రాసిన వ్యాసం ఆధారంగా - వరవరరావు 21-6-79]

నీకూ, నాకూ — మనకు తెలుసు

భారత్‌బాబు

అవునన్నా; నీవూ మా వాడివే
మా రక్తం పంచుక పుట్టిన వాడివే
గుప్పెడు గింజల కోసం
మనస్సునీ, శరీరాన్నీ కూడా
తాకట్టు పెట్టాల్సిన జాతికి
నీవూ ప్రతినిధివే
కడుపు చించుకుంటే
కాళ్ళ మీద పడుతుంది
ఆ సత్యం నీకూ తెలుసు
మన వేలితో మనకన్నే
పొడవగల నేర్పరులు
వాళ్ళు నిన్నూ నన్నూ వేరుచేశారు
నాపై నిన్ను ప్రయోగిస్తున్నారు
అవసరం కాని డ్రిల్లులతో
అర్థంలేని క్రమశిక్షణతో
నీలోని మనిషిని చంపేస్తున్నారు
పశువును వెలికి తీస్తున్నారు
కళ్ళకు గంతలు కట్టి,
భుజాన తుపాకి బెట్టి,
గానుగ ఎద్దును జేసి
ఈవ్యవస్థకు నిన్ను కట్టేస్తున్నారు
విరామ మెరుగని "విధి" తో
నిన్ను చుట్టూ తిప్పుకుంటున్నారు

మరో ప్రపంచాన్ని,
మహా ప్రపంచాన్ని,
కోరిన వీరుల గుండెలు
ఆ ఒరిపిడిలో నలిగి, ముద్దలై
నెత్తురు ఒక్కొక్క బొట్టూ కారుతుంటే
దానితో వాళ్ళఅత్తర్లు వండుకుంటున్నారు
నీకింత ఎండుగడ్డి పడేస్తున్నారు
తమ తెలివికి తామే మురిసి పోతున్నారు
కాని, మాకు తెలుసు
ఈ మోసం ఎంతో కాలం దాగదనీ
ఈ దోపిడి ఎల్లకాలం సాగదనీ
మాకు తెలుసు

నీవూ మనిషివనీ; మా వాడివనీ
మనసుందనీ, ఆలోచించే మెదడుందనీ
తమ రక్షణకై ధనస్వాములు
నీ చుట్టూ అల్లిన పశుత్వపు జడత్వాన్ని
ఛేదించే వెలుగు నీలో దాగుందనీ
మాకు తెలుసు.

మన అందరి కష్టాన్ని దిగమింగి
బొజ్జలు పెంచుకునే యాజమాన్యపు
భయంకర స్వార్థాన్ని
అన్నను తమ్ముడిపైకి ఉసిగొల్పి
శత్రు నిశ్శేషం గావించే పాలకజాతి
క్రూర కుటిలత్వాన్ని
నీవు గ్రహించే రోజు
దగ్గరలోనే ఉందని
మాకు తెలుసు.
అన్నా,
మాకు తెలుసు.

నీవూ నేనూ ఒకటిగ నిలచిన నాడు,
ఈ పీడక జాతి తుడిచి పెట్టుకపోతుందనీ
ఆరోజు తొందరలోనే వస్తుందనీ,
నీకూ, నాకూ
మన శ్రామికవర్గ మంతటికీ,
తెలుసు
ఈ నిజం మనకు తెలుసు.

రోడ్డు మీద సూర్యుడు

కె. రాంమోహన్‌రాజు

రోడ్డంతా కదిలి కదం తొక్కుతున్న సైన్య సంగీతం
ఊరిమీద అలవోకగా వాలిన మబ్బు తునక
బెదిరి పారిపోయింది
పర్వతాలు పట్టుకుని పాకుతూ వస్తున్న
బాలసూర్యుడు స్వర్ణ కేశాలింకా సవరించుకోక ముందే
రోడ్డుమీద నిలువెత్తు మంటలు
అగ్ని తూలికలు ఉష్ణీషాలు ధరించి
ఖడ్గ సంగీతాలు పాడుతూ పొరలుతూ, కెరలుతూ
అలలు అలలుగా, పొరలు పొరలుగా
సూర్య సంతానం సాగుతోంది రోడ్డుమీద
గాలికి మతిభ్రమించి వెర్రిగా పరుగెత్తింది
ఆకాశాన్ని కప్పేసిన జెండాలు దాటి

నినాదాలింకా పైకి అట్నుంచి లోకంలోకి
ప్రవహిస్తున్నాయి
సృష్టిలో పరమాణువులన్నీ
విస్ఫోటనకు సిద్ధంగా వున్నాయి
పలుచగా పైకిలేస్తున్న ఊపిర్లు వెచ్చగా
ఆకాశానికి ఎర్ర పూతపూశాయి
పాదాల తాకిడికి రేగిన నేలతల్లి నిట్టూర్పుల ధూళి
ఊరిమీద సింగిణి చిత్రాన్ని గీసింది.
ద్వారాలు తెరుచుకుని, గవాక్షాలు విచ్చుకుని
సుత్తెలూ, కొడవళ్లూ, నాగళ్లూ, కలాలూ, పుస్తకాలూ
మగ్గాలూ, తలలూ, కళ్లూ, మనసూ అన్నీ
సైన్య సంగీతానికి లయగా అడుగేస్తున్నాయి.
అపరిష్కృత సమస్యా వలయాలు,
అంతులేని జీవనదుర్గ విశీర్ణ శిథిలాలు
అన్నీ కళ్లలో రవ్వలు పొదుగుకుని
స్వేచ్ఛవల్ల సహజంగా ఉద్భవించే వికాసంతో
ఉత్సాహంతో, బలంతో, శక్తితో నడుస్తున్నాయి
అరికాళ్ల కింద బొబ్బలు పగిలి రోడ్డంతా నెత్తురు
ఆకాశంలో సూర్యుడు రోడ్డుమీద రక్తంలో ఫలిస్తున్నాడు
నెమ్మదైన అలవాట్లు వద్దు వద్దు
నిర్జీవ క్రమపద్ధతులు వద్దు వద్దు
మరణానంతర ప్రశాంతి కోసం స్వేచ్ఛను త్యాగం చేయొద్దు
ఆడంబర సంస్కృతీ ప్రహసనాలు వద్దు
ఇతర్ల కోసం మానెత్తురు ధారపోతలు వద్దు
పాలిష్డ్ బ్లోను పరిచిన బాత్‌రూంలో
షవర్ మంద్రంగా మోగుతుంది
కుషన్ బెడ్‌లు సౌందర్య స్వప్నాల్లో విహరిస్తున్నాయి
రక్తపు బిందువులతో బంతులాడుకునే
నాజూకుతనాల వాళ్ల జీవన రహస్యాలు తెరిచే
తాళంచెవి ఏదో సూర్య కిరణ పుంజాల్లో
పునీతమయ్యే నగ్నమలిన దేహాలకు దొరికింది
రేపటి నుంచి వాళ్లే సూత్రధారులు
ఇంతవరకూ ప్రపంచమంతా ఆభాస నాటకం
ఇంక నాటకం రక్తి కడుతుంది.

కంపూచియా అంటే ఏమిటి?

[ఇటీవల కాలంలో అత్యంత దుష్ప్రచారానికి గురైన విప్లవంగా మాల్కొలమ్ కాల్డ్వెల్ పేర్కొన్న ప్రజాతంత్రి కంపూచియా గురించి, అక్కడ ప్రస్తుతం జరుగుతున్న జాతీయ విముక్తి పోరాటం గురించి మన దేశంలో విప్లవాభిమానుల్లో సైతం ఏర్పడిన సందేహాలు, గందరగోళం ఒక్క కలంపోటుతోనో, ఒక్క వ్యాసంతోనో, ప్రశ్నలకు జవాబులుగానో తొలగించ గలిగేవికావు. అయితే ఒక ఆగ్నేయాసియాదేశం, ఒక వ్యవసాయ దేశం, ఒక మూడో ప్రపంచదేశం తనదేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడానికి, తన కాళ్ళపై తాను నిలవడానికి ఎటువంటి పోరాటాన్ని చేపట్టింది, ఆ పోరాటానికి మార్గదర్శకమైన పంథా ఏమిటి అనేది భారతదేశ స్వాతంత్ర్యం గురించి ఆలోచించే ప్రతి దేశభక్తుడు పట్టించుకోవలసిన విషయం. అందువల్ల కంపూచియా భూగోళము-చరిత్ర మొదలుకొని కంపూచియాపై వియత్నామ్ దురాక్రమణ వెనుకవున్న చారిత్రకతాత్త్వక కారణాలేమిటి అనే మౌలిక అంశాల వరకు ప్రత్యక్ష ఆధారాలతో కూడిన ప్రామాణికమైన రచనలు సృజనలో వీలయినంతవరకు ప్రచురించే ప్రయత్నం చేయదల్చుకున్నాం.

రెండవ ప్రపంచ యుద్ధానికి నేపథ్యంగా 1936 నుంచి 39 వరకు జరిగిన స్పెయిన్ అంతర్యుద్ధం ప్రపంచ ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఎట్లా తమ యుద్ధంగా, తమ కర్తవ్యంగా భావించారో మళ్ళీ ఈనాడు కంపూచియాలో పోల్‌పాట్ నాయకత్వంలో జరుగుతున్న గెరిల్లా పోరాటం తమ పోరాటంగా, తమ కర్తవ్యంగా భావించాల్సిన తరుణం వచ్చింది. అట్లా గుర్తించిన ఐ. ఎఫ్. స్టోన్, నోమ్‌చామ్‌స్కీ, ఎలిజబెత్ బెకర్‌ల అభిప్రాయాలు కూడ యిస్తున్నాం. ఈనాడు అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని ధిక్కరించే ఎందరో మేధావులకు, రచయితలకు వీళ్ళు, మాల్కొలమ్ కాల్డ్వెల్ పేర్కొనదగిన ప్రతినిధులు మాత్రమే. — 'సాహితీ మిత్రులు']

భూగోళం

కంపూచియా ఆసియా ఖండంలోని ఆగ్నేయ దిశనవున్న చిన్నదేశం. వియత్నామ్, లావోస్, థాయ్‌లాండ్ దీనికి ఇరుగు పొరుగు దేశాలు. ఈ దేశాలన్నీ ఇటీవల కాలం వరకు అమెరికన్ సామ్రాజ్యవాదానికి నయా వలసలుగా వున్నవే.

కంపూచియా విస్తీర్ణం 181,035 చదరపు కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్ కన్నా దాదాపు ఒక లక్ష చదరపు కిలోమీటర్లు తక్కువ విస్తీర్ణం. (ఆంధ్రప్రదేశ్ 2,76,814 చదరపు కిలోమీటర్లు). గుజరాత్, కర్నాటకలకన్నా చిన్న దేశం. ఇందులో 16%

వ్యవసాయం, 74% అడవులు. జనాభా 82 లక్షలు. తెలంగాణకన్న తక్కువ. వీరిలో 45% పదిహేను సంవత్సరాల లోపు పిల్లలు.

ఒకే జాతి. పేర్కొనదగిన ఇతర మైనారిటీ వర్గాలులేవు. జననాలరేటు వెయ్యికి 47, మరణాలు 18. జీవన వయోప్రమాణం 45 సంవత్సరాలు. వలస వచ్చే వారితో కలిపి జనాభా పెరుగుదల సంవత్సరానికి 2.3%. శిశు మరణాలు వెయ్యికి 150.

1977 లెక్కల ప్రకారం శ్రామికుల సంఖ్య 26 లక్షలు. వ్యవసాయోత్పత్తి 1974లో 48% వుంటే 76కు 81%కి పెరిగింది.

రాజకీయ చరిత్ర

కాంబోడియా 1864లో ఫ్రెంచి రక్షిత (ప్రొటెక్టరేట్) దేశమైంది. ఇండో చైనాలో ఫ్రెంచి అధికారాన్ని జపాన్ అంతం చేసిన తర్వాత 1945 మార్చిలో ఇక్కడ స్వాతంత్ర్యం ప్రకటింపబడింది. కాని అనతికాలంలోనే రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపానుల ఓటమితో మిత్రదేశాల విజయంతో ఫ్రెంచి వాళ్ళు కాంబోడియాకు తిరిగి వచ్చారు. 1941లో నరోదమ్ సిహనౌక్‌ను ఫ్రెంచివాళ్ళు సింహాసనంపై కూర్చుండ బెట్టారు. అప్పటి నుంచీ ఆయన సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభించాడు. 1953లో ఈ స్వాతంత్ర్యం సిద్ధించింది. తన తండ్రిని సింహాసనంపై కూర్చుండబెట్టి తాను ఆయనకు సహాయకుడుగా మాత్రమే తన దేశాన్ని మరింత పటిష్ఠంగా నడుపగలననుకొని నరోదమ్ సురమరిత్‌ను 1955 మార్చి 22న రాజును చేసాడు సిహనౌక్. సురమరిత్ 1960లో చనిపోయాడు.

1970 లో సిహనౌక్ మాస్కోలో వుండగా రక్తపాత రహిత తిరుగుబాటు ఒకటి కాంబోడియాలో వచ్చి మార్షల్ లాన్‌నాల్ అధికారంలోకి వచ్చాడు. సిహనౌక్ పదభ్రష్టుడయ్యాడు.

సిహనౌక్ మాస్కో నుంచే పెకింగ్ వెళ్ళిపోయాడు. అప్పటి నుంచీ అక్కడే వుండిపోయాడు. కంపూచియా జాతీయ ఐక్యసంఘటన నాయకత్వంలో నేషనల్ యూనియన్ రాయల్ ప్రభుత్వం (గ్రంక్) ఏర్పాటుచేసినట్లుగా ఆయన 5 మే 1970న ప్రకటించాడు. దానికాయనే అధిపతి.

గ్రంక్ సైన్యాలు ఏప్రిల్ 17, 1975 న నామ్‌ఫెన్‌ను కైవసం చేసుకోవడంతో అమెరికా తొత్తు లాన్‌నాల్ ప్రభుత్వం పతనమైంది.

కియూసాంఫన్ నాయకత్వంలో నూతన వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. ఈ వామపక్ష ప్రభుత్వం వెనుకవున్న నిజమైనశక్తి కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుగానీ, దానికి కార్యదర్శి పోల్‌పాట్ అనే విషయంగానీ 1977 దాకా బయటి ప్రపంచానికి తెలియదు.

ఈ కార్మిక–కర్షక ప్రజాతంత్ర కాంపూచియా ప్రభుత్వంపై 25 డిసెంబర్ 1978 న వియత్నామ్ ప్రభుత్వం దాడిచేసింది. కంపూచియా ప్రజలు వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిఘటనా యుద్ధాన్ని కొనసాగిస్తూ కోల్పోయిన జాతీయ స్వాతంత్ర్యాన్ని తిరిగి సాధించుకోవడానికి పోరాడు తున్నారు.

ప్రజాతంత్ర కంపూచియా (17 ఏప్రిల్ 1975 నుంచి 25 డిసెంబర్ 1978 వరకు) ప్రభుత్వం. అధ్యక్షుడు కియూసాంఫన్. ప్రధాని పోల్‌పాట్. ఉపప్రధానులు ఇయాంగ్‌సారీ (విదేశాంగశాఖ) వార్నెవెట్ (ఆర్థిక శాఖ) సాన్‌సెన్ (రక్షణశాఖ) ప్రచార, సమాచార, సాంస్కృతిక, విద్యాశాఖ మంత్రి శ్రీమతి యున్‌యట్. ప్రజారోగ్యం థియోన్ థియోన్, సాంఘిక, ప్రవర్తన - శ్రీమతి ఇయాంగ్ తిరిత్.

టనెల్ చివరన నిప్పంటుకున్నది (ప్రసిద్ధ రచయితల అభిప్రాయాలు)

ఐ. ఎఫ్. స్టోన్:

రచయిత, పత్రికారచయిత. ఆయనా, ఆయన భార్యా కలిసి వాషింగ్టన్ డి.సీ. నుంచి ఐ. ఎఫ్. స్టో వీక్లీ అనే పత్రిక నడుపుతున్నారు. వియత్నామ్‌లో అమెరికా విధానాలను సవాల్ చేసిన సమాచారానికి, విశ్లేషణకు తొట్ట తొలి ఆధారం ఈ పత్రిక. అమెరికా వ్యతిరేక వియత్నామ్ యుద్ధాన్ని తొలినుంచీ బలపరచిన మేధావి.

"నేను వియత్నామ్ దురాక్రమణను ఖండిస్తున్నాను. ఇది సామ్రాజ్యవాదం' లాటిన్ అమెరికాలో మనమేం చేసామో, తూర్పు యూరపు దేశాల్లో రష్యా యేం చేసిందో, ఆగ్నేయాసియాలో ఇప్పుడు వియత్నామ్ ఆ పనిచేస్తున్నది బలవంతమైన పెద్దదైన పొరుగువారి అధికారం బలవంతంగా ఒక ప్రభుత్వాన్ని (చిన్న దేశంపై) రుద్దడం. సామ్రాజ్యవాదమంటే ఇదే. వియత్నామీయులు తమంత తాము ఒక చిన్న వియత్నామ్‌ను సాధించుకున్నారు. ఇప్పుడు వియత్నామ్ అమెరికా అయింది. ఇప్పుడు వాళ్ళకు శక్తివంతమైన ఆయుధాలున్నాయి, విమానాలున్నాయి. వియత్నామ్‌లో ఎట్లా చేసామో అట్లా ఇవ్వాళ వియత్నామ్ సులభంగా పట్టణాల్లో ప్రవేశించి ఆక్రమించుకో గలదు. కాని ఒకసారి నువ్వు పట్టణాలకు అలవాటు పడ్డావంటే నీకింక గ్రామాలు వుండవు. ఈ పరిస్థితి చాలకాలం కొనసాగితే నేనేమీ ఆశ్చర్యపడను.

వియత్నామీయులు చాల సామ్రాజ్యవాద స్వభావం గల వారని నా కెప్పుడూ అనిపిస్తూ వుండేది. నేను అమెరికా యుద్ధాన్ని వ్యతిరేకించిన రోజుల్లో కూడ ఈ వాస్తవం నా స్పృహలో వున్నది. వాళ్ళు ఖ్మేర్ ప్రజలనుంచి మెకాంగ్ డెల్టాను కైవసం చేసుకొని కొద్దిశతాబ్దాలు మాత్రమే గడిచింది. ఇది పాతవైరమే. దక్షిణానికి, ఈశాన్యానికి వ్యాపించిన చైనా నాగరికతకు వియత్నామ్ చివరి మజిలీ అయితే అదే ప్రాంతానికి వ్యాపించిన భారతీయ నాగరికతకు కాంబోడియా చివరి మజిలీ.

ఇందులో కొంతబాధ్యత రష్యా మీద కూడ వుంది. చైనా తనపై దాడిచేయదనే హామీ లేకుండా కాంబోడియాలోకి వియత్నామ్ ప్రవేశించేదికాదు. ఆ హామీ చైనా యిచ్చింది కాదు రష్యాయిచ్చింది. చైనా దాడిని నిరోధించడానికి వియత్నామ్ రష్యాతో రక్షణ ఒడంబడికలు చేసుకున్నది; చైనా సైన్యాలను వియత్నామ్‌లోకి పంపించడానికి భయపడుతుందని ఆశించింది.

మనం ఆ సమస్యలో ప్రవేశించి ఆ ప్రాంతానికిగానీ ప్రపంచానికిగానీ చేయగల ఉపకారం ఏమీలేదు; ఉన్న సమస్యను మరింత జటిలమూ, రక్తపంకిలమూ చేయడం తప్ప. మనం కంబోడియాను నాశనం చేసాం. అక్కడున్న భయంకరమైన కష్టాలకు కారణం ఇదివరలో అమెరికా దురాక్రమణ; ప్రతి ఒక్కరూ మట్టిని తవ్వి, ఆహారాన్ని సరఫరా చేసుకోవడం కన్న మనం చేసిన నష్టం తర్వాత కంబోడియాకు మిగిలిన మార్గం ఏముంది? అందువల్ల చాలమంది కష్టపడి వుండవచ్చు. కాని ఆ కష్టాలకంతా ముందూ వెనుకా మనమే బాధ్యులం. నిక్సన్, కిసింజర్ చేసిన పని అది. వియత్నామీయులు అంతకన్నా భిన్నంగా చేస్తారనుకోను. వియత్నామ్‌కు కాంబోడియా నుంచి ఏ ఉపద్రవమూ లేదు. అది చాల స్పష్టం. కాంబోడియాకు చెప్పుకోదగిన సైన్యం లేదు; అది వియత్నామ్‌పై దాడి చేయబోవడం లేదు. చిన్న దేశాలను పెద్ద దేశాలు కబళించటం నేను సహించను. ఈ దురాక్రమణ నాకు మింగుడు పడడంలేదు. వియత్నామ్‌కు (కాంబోడియాతో) సరిహద్దు తగాదాలు వుంటే వుండవచ్చు, కాని అది దేశాన్ని మొత్తంగా ఆక్రమించడానికి సాకయితే ఎట్లా?

నోమ్‌చామ్‌స్కీ :

సుప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త, అమెరికాలోని మసెచుసెట్స్ సాంకేతిక సంస్థలో అధ్యాపకుడు. వియత్నామ్‌లో అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా క్రియాశీలంగా పోరాడినవాడు.

"చాల విషాదకరమైన పరిస్థితి. కాంబోడియాకు, వియత్నామ్‌కు రెండింటికీ విషాదకరమైందే. వివాదాస్పదమైన సరిహద్దు వుండొచ్చు. చారిత్రకంగా తమకు

ఎర్నెస్ట్ మళ్ళీ మాట్లాడ్డానికి ఉపక్రమించాడు.

"సోషలిజం అనివార్యమే కాకుండా, సన్నకారు పెట్టుబడిదార్లు తుడిచిపెట్టుకు పోవటం కూడా అనివార్యం. అట్లాగే పెద్ద పెద్ద పెట్టుబడిదార్లు, గుత్త సంస్థలు తుడిచిపెట్టుకు పోవటంకూడా అనివార్యం. పరిణామవెల్లువ తిరోగమించదని జ్ఞాపకం వుంచుకోండి. అది ముందుకి, మున్ముందుకి ప్రవహిస్తుండి. పోటీనుంచి సంఘటనకు స్వల్ప సంఘటన నుంచి విశాల సంఘటనకు, విశాల సంఘటన నుంచి బృహత్తర సంఘటనకు పరిణామవెల్లువ ప్రవహిస్తూపోతుంది. అక్కణ్ణుంచి సోషలిజానికి పురోగమిస్తుంది. అది వీటన్నిటి యొక్క మహా బృహత్తర సమ్మేళనం."

"నేను కలలు కంటున్నానని మీరంటారు. మంచిది. నా కలకి సంబంధించిన కచ్చితమైన లెక్కలు మీముందు పెడతాను. నాలెక్కలు తప్పని నిరూపించమని మిమ్మల్ని ముందుగా సవాల్ చేస్తున్నాను. పెట్టుబడిదారీ వ్యవస్థ విచ్ఛిన్నం కావటం అనివార్యమని మీకు చూపిస్తాను. అది ఎందుకు విచ్ఛిన్నమైపోతుందో గణితశాస్త్ర పరంగా మీకు ప్రదర్శిస్తాను."

"మొట్ట మొదట, మనం ఒక పారిశ్రామిక ప్రక్రియని పరిశీలిద్దాం. ఒక చెప్పుల ఫ్యాక్టరీ వుంది. అది తోళ్ళుకొని జోళ్లు తయారుచేస్తుంది. వంద డాలర్ల ఖరీదుచేసే తోలు వుందనుకుందాం. అది ఫ్యాక్టరీలో అనేక దశలుదాటి జోళ్ళ రూపంలో బైటికి వస్తుంది. ఆ జోళ్ళ విలువ రెండు వందల డాలర్లు అనుకుందాం. యిక్కడేం జరిగింది? తోలు విలువకి మరో వంద డాలర్ల విలువ వచ్చి చేరింది. అదనంగా ఆవిలువ ఎలా చేరింది?"

"శ్రమశక్తి, పెట్టుబడి కలిసి యీవంద డాలర్ల విలువని తోలు వెలకి కలిపాయి. పెట్టుబడి, ఫ్యాక్టరీని స్థాపించింది; యంత్రాల్ని నెలకొల్పింది; ఖర్చులన్నిట్నీ భరించింది కార్మికులు శ్రమశక్తి సమకూర్చారు. పెట్టుబడి, శ్రమశక్తి — యీ రెంటి సంయుక్త కృషివల్ల నూరుడాలర్ల విలువ కొత్తగా చేరింది. యింతవట్టుకి, మీరు ఒప్పుకుంటారా?"

అందరూ అంగీకార సూచకంగా తలలూపారు.

"శ్రమశక్తి, పెట్టుబడి కలిసి ఆ వంద డాలర్లు సృష్టించాక, ఆడబ్బుని పంచుకోటానికి కూర్చున్నాయ్. యీ భాగాల పంపిణీకి సంబంధించిన లెక్కలు భిన్నాల్లోవున్నాయ్ కాబట్టి, మన సౌకర్యం కోసం ఆ అంకెలు రమారమిగా వుండేట్లు పూర్ణాంకాల్లోకి మార్చుకుందాం. పెట్టుబడి తనవాటాకింద యాభై డాలర్లు తీసుకుంటుంది. కార్మికులు

తమ వాటా కింద కూలి రూపంలో యాభైడాలర్లు తీసుకుంటారు. భాగాల పంపిణీలో వుండే కజ్జాల జోలికి మనం వెళ్లొద్దు. ఎన్నికజ్జాలైనా జరగనీండి, చివరికి ఒక శాతం అటూ, యిటుగా భాగ పరిష్కారం జరిగింది. యీ సందర్భంలో ఒక్క విషయం గుర్తుంచుకోండి: యీ నిర్దిష్టమైన పారిశ్రామిక ప్రక్రియకి యేది వర్తిస్తుందో, మిగతా పరిశ్రమలకి కూడా అదే వర్తిస్తుంది. నేను చెప్పింది సరియైందిగా వుందా?"

బల్ల చుట్టూ కూర్చున్న యావన్మందీ ఎర్నెస్ట్‌తో యేకీభవించారు.

"ఇప్పుడు, కార్మికులు తమ యాభై డాలర్లు పుచ్చుకున్నాక ఆ చెప్పులు కొనేసు కుందా మని అనుకున్నారు. వాళ్లు యాభై డాలర్ల విలువగల జోళ్ళనిమాత్రమే కొను క్కోగలరు. అంతవరకి స్పష్టంగానే వుందా?"

"ఇక యిప్పుడు మనం యీనిర్దిష్ట ప్రక్రియల నుంచి అమెరికా సంయుక్త రాష్ట్రాల అన్ని పారిశ్రామిక ప్రక్రియల మొత్తానికి వద్దాం. ఆ ప్రక్రియల్లో తోలు, ముడి సరుకు, రవాణా, అమ్మకం వగైరా అన్నీ చేరి వుంటాయి. అమెరికాలో ఒక సంవత్సరం ఉత్పత్తి అయిన మొత్తం సంపద నాలుగు లక్షలకోట్ల డాలర్లు అనుకుందాం ఆ సంవత్సరం, కార్మికులు వేతనాల రూపంలో రెండు లక్షల కోట్ల డాలర్లు పుచ్చు కుంటారు. నాలుగు లక్షల కోట్ల డాలర్ల సంపద ఉత్పత్తి అయింది. ఇందులో శ్రమశక్తి తిరిగి ఎంత కొనగలుగుతుంది? రెండు లక్షల కోట్లు. దీన్ని గురించి వివాద మేమీ లేదనుకుంటాను. ఆమాటకొస్తే, నేనిక్కడ చెప్పేశాతాలు తగ్గుబాటువి. పెట్టుబడిదారీ విధానంలో వున్న వేలాది మాయాపుర్మాల వల్ల, మొత్తం ఉత్పత్తి అయిన సరుకులో శ్రమశక్తి సగంకూడా తిరిగి కొనుక్కోలేదు."

"శ్రమశక్తి రెండు లక్షల కోట్ల డాలర్ల విలువగల సరుకుని తిరిగి కొనుక్కుంటుం దనుకున్నాం. అంటే, శ్రమశక్తి ఖర్చు చేయగల్గింది రెండు లక్షల కోట్లు మాత్రమే యింకా, రెండు లక్షల కోట్ల డాలర్లు మిగిలి వున్నాయ్. ఆవిలువని శ్రమశక్తి తిరిగి కొనుక్కోనూలేదు. భరాయించనూ లేదు."

"కార్మికులు తమ వాటా కింద సంపాయించిన ఆ రెండు లక్షల కోట్ల డాలర్లని కూడావాడుకోలేరు. వాడుకుంటే, వాళ్ళకి సేవింగ్స్ బ్యాంకుల్లో డిపాజిట్లే వుండి వుండవు" అన్నాడు కోవాల్ట్.

"సేవింగ్స్ బ్యాంకుల్లో వుండే కార్మికులకు డిపాజిట్లు ఒక రకమైన రిజర్వు డబ్బు లాంటివి. అవి ఎంత వేగంగా పెరుగుతాయో, అంత వేగంగానూ తరిగిపోతాయ్.

యీ డిపాజిట్లు వృద్ధాప్యంలో ఉపయోగించుకోటానికి, జబ్బులు, ప్రమాదాలు సంభవించి నప్పుడు వాడుకోటానికి, అంత్యక్రియల కోసం కూడ బెట్టుకున్నవి. సేవింగ్స్ బాంకులో దాచుకున్న డబ్బు ఎటువంటి దంటే. రేపటి భోజనం కోసం యీపేళతుంచి పెట్టుకుని బీరువాసొరుగులో దాచుకున్న రొట్టెముక్క లాంటిది. మీరు చెప్పినట్లుగా కాకుండా, కార్మికులు తమవేతనాలు ఎంతమొత్తాన్ని కొనగలుగుతాయో, ఆ మొత్తాన్ని ఖర్చుపెట్టుకుంటారు."

"పెట్టుబడికి రెండులక్షల కోట్లడాలర్లు మిగిలాయి. అది దాని ఖర్చుపోను మిగిలినమొత్తాన్ని ఖర్చుచేసుకోగలదా? పెట్టుబడి తనవాటాకివచ్చిన మొత్తాన్ని ఖర్చు చేసుకోగల్గుతుందా?"

ఎర్నెస్ట్ తనప్రసంగం ఆపి, అక్కడ కూర్చున్నవాళ్లలో అనేకమందిని ప్రశ్నించాడు. వాళ్లు అడ్డంగా తలలుతిప్పారు.

"నాకుతెలీదు" అనిస్పష్టంగా చెప్పేశాడొక పెద్దమనిషి.

"మీకుతెలుసు. ఒక్కక్షణం ఆగి, ఆలోచించండి. పెట్టుబడి గనక తనవాటా కొచ్చినమొత్తాన్ని ఖర్చుపెట్టివుంటే పెట్టుబడిరాశి పెరగలేదు. అది ఒకేచోట నిలబడి పోతుంది. మీరు అమెరికా సంయుక్తరాష్ట్రాల ఆర్థికచరిత్రని ఒక్కసారి పరిశీలించి చూస్తే, పెట్టుబడిరాశి పెరుగుతూపోవటం మీకు కనిపిస్తుంది. కాబట్టి, పెట్టుబడి తన వాటాకొచ్చినడబ్బుని ఖర్చుచేసుకోదు. ఒకప్పుడు మనరైల్వేబాండ్లు ఇంగ్లండ్ దగ్గర వున్న విషయం జ్ఞాపకంవుందా, యేళ్ళుగడిచిన కొద్దీ, ఆబాండ్లని మనం తిరిగి కొనేసు కున్నాం. అంటే దానర్థం యేమిటి? పెట్టుబడి తనవాటాకింద వచ్చిన సొమ్ములో ఖర్చు పెట్టుకోకుండా మిగుల్చుకున్న మొత్తంతో ఆబాండ్లుకొనేసుకుంది. యివాళ అమెరికా పెట్టుబడిదార్ల దగ్గర కోటానుకోట్లడాలర్ల విలువచేసే మెక్సికో, రష్యా, ఇటలీ, గ్రీస్ బాండ్లు వున్నాయంటే దీనిఅర్థమేమిటి? పెట్టుబడితను ఖర్చుపెట్టని పెట్టుబడి వాటాలో భాగంగా యిన్ని కోటాను కోట్ల డాలర్లు చేరాయని అర్థం. యింకాచెప్పాలంటే, పెట్టు బడిదారీ వ్యవస్థ ప్రారంభమైనప్పటినుంచీ కూడా, పెట్టుబడి తన వాటాకి వచ్చిన డబ్బుని తినెయ్యలేదు.

"యిప్పుడిక అసలు విషయాని కొద్దాం. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒక సంవత్సరంలో నాలుగు లక్షల కోట్ల డాలర్ల సంపద సృష్టి అవుతున్నది. కార్మికులు, రెండు లక్షల కోట్ల డాలర్ల వస్తువుల్ని కొనుక్కొని ఖర్చు పెట్టుకుంటున్నారు. పెట్టుబడి తన వాటా డబ్బుని, అంటే మిగిలిన రెండు లక్షల కోట్ల డాలర్లని ఖర్చు చేసుకోదు.

ఖర్చుపెట్టుకోకుండా మిగిలిన మొత్తం చాలా వుంది. యీ మిగులు యేమైంది? దాంతో యేం చెయ్యవచ్చు? కార్మికు లింకేమీ ఖర్చుపెట్టుకోలేరు. ఎంచేతంటే, వాళ్ళకి ముట్టిన మొత్తాన్ని యీ వరకే ఖర్చుపెట్టేసుకున్నారు. యీ మిగుల్ని పెట్టుబడి తనకి గాను ఖర్చుపెట్టుకోదు. దాని స్వభావానుగుణంగా అది ఎంత వ్యయంచేసుకోగలదో అంతా వ్యయపర్చుకుంది. అయినా చాలా మిగిలి వుంది. దాంతో యేం చేయ్యగలం? దాన్ని యేం చేశాం?"

"దాన్ని విదేశాల్లో అమ్ముకున్నారు" అన్నారు కోవాల్ట్.

"సరిగ్గా అదే. యీ మిగులు నిల్వలవల్ల మనకి విదేశ మార్కెట్ల అవసరం యేర్పడింది. దీన్ని విదేశాల్లో అమ్మారు. విదేశాల్లో అమ్మక తప్పదు. దాన్ని వొదిలించుకోటానికి వేరే మార్గం లేదు. విదేశాల్లో విక్రయమైన ఆ ఖర్చుగాని నిల్వ ఉభయ దేశాల వాణిజ్య మారకంలో మనకు అనుకూలత కలగజేస్తుంది. యింతవరకి మీరంతా ఒప్పుకున్నట్లేనా?" అనడిగాడు ఎర్నెస్ట్.

"వాణిజ్యానికి సంబంధించిన యీ ఓనమాలని యింత విపులీకరించి చెప్పటం వృథా కాలహరణం. మా అందరికీ అవి తెలుసు" అన్నాడు కాల్విన్ వాడిగా.

"నే నింత జాగ్రత్తగా విపులీకరించి చెప్పిన యీ ఓనమాలతో మిమ్మల్ని దిగ్భ్రాంతుల్ని చేస్తాను. అక్కడే వుంది సొగసు."

"అమెరికా పెట్టుబడిదారీ దేశం. అది తన వనరుల్ని అభివృద్ధి చేసుకుంది. పెట్టుబడిదారీ పంథాని అనుసరించి సాగే దాని పారిశ్రామిక విధానంవల్ల, దానికి ఖర్చుకాకుండా మిగిలిన నిధులున్నాయి. ఆ నిల్వల్ని వొదిలించుకోవాలి. ముఖ్యంగా, విదేశాల్లోనే వాటిని విరగడ చేసుకోవాలి. అమెరికాకు వర్తించే పరిస్థితి, అభివృద్ధి చెందిన వనరులున్న ప్రతి పెట్టుబడిదారీ దేశానికీ సమానంగా వర్తిస్తుంది. యీ అన్ని దేశాల్లో వుండే కార్మికులు తమ వేతనాల్ని ఖర్చు పెట్టేసుకున్నారు. మిగులు నిల్వల్ని కొనుక్కోగలిగిన స్థితి వాళ్ళకు లేదు. యీ అన్ని దేశాల్లోనూ పెట్టుబడి స్వభావ సిద్ధంగా తనకు చేతనై నంత ఖర్చు పెట్టుకుంది. అయినా, ఎంతో మిగులు నిలువ వుండిపోయింది. యీ మిగులు నిల్వల్ని వాళ్లెలా వొదిలించుకో బోతున్నారు?"

"వనరులు అభివృద్ధికాని బడుగు దేశాలకు అమ్మేస్తారు" అని సూచించాడు కోవాల్ట్.

"సరిగ్గా అదే. అమెరికా తన మిగులును బ్రెజిల్ వంటి బడుగు దేశంలో విడుదల చేసిందనుకుందాం. అమెరికా తన మిగులుకు బదులుగా బ్రెజిల్ నుంచి యేం తెచ్చుకుంటుంది?"

"బంగారం" అన్నాడు కోవాల్ట్.

"ప్రపంచంలో బంగారం కొంత పరిమాణంలో మాత్రమే వుంది గాని అంతకు మించి లేదు" అని ఎర్నెస్టు అభ్యంతరం చెప్పాడు.

"సెక్యూరిటీల రూపంలో, బాండ్ల రూపంలో, యింకా తదితర రూపాల్లో వున్న బంగారం" అని కోవాల్ట్ సవరణ తెచ్చాడు.

"అదీ అసలు విషయం. అమెరికా తన మిగులు నిల్వల్ని బ్రెజిల్ లో విడుదల చెయ్యటం ద్వారా బ్రెజిల్ నుంచి తను బాండ్లు, సెక్యూరిటీలు పొందుతుంది. అంటే, దీనర్థం యేమిటి? అమెరికా బ్రెజిల్ లో రైల్వేల్ని, ఫ్యాక్టరీల్ని, గనుల్ని, భూముల్ని సొంతం చేసుకోబోతుందన్న మాట."

"మళ్ళీ దీనర్థం యేమిటో నేను చెప్తాను. బ్రెజిల్ లో వనరులు అభివృద్ధి చేయబడుతున్నాయ్. పెట్టుబడిదారీ విధానంతో బ్రెజిల్ తన వనరుల్ని అభివృద్ధి పర్చుకున్న తర్వాత, ఆ దేశానిక్కూడా ఖర్చు కాని మిగులు చేరుతుంది. ఆ మిగులుని బ్రెజిల్ అమెరికాలో విడుదల చెయ్యలేదు. ఎందుకంటే, అమెరికాలోనే ఆ మిగులు నిల్వలు పుష్కలంగావున్నాయి. అప్పుడేం జరుగుతుందో తెలుసా! ఈ ఉభయదేశాలు కలిసి బడుగు దేశాలెక్కడున్నాయా అని వెతుకుతాయి. అవి ఆదేశాల్లో తమ మిగులుని విడుదల చేసుకోవాలి. ఆవిధంగా, ఆయాదేశాలు కూడా తమ వనరుల్ని అభివృద్ధి చేసుకుంటాయ్. మళ్ళీ అవి తమ మిగులుని ఎక్కడ విడుదల చెయ్యాలా అని అన్వేషణలో పడతాయ్. భూగోళం కొంతవరకే విస్తీర్ణమైంది. ప్రపంచంలో పరిమిత సంఖ్యలోనే దేశాలున్నాయ్. ప్రపంచంలో ఆ విధంగా చిట్టచివరిగావున్న చిన్న చిన్న దేశాల్తోసహా, అన్ని దేశాలకూ యీ మిగులు నిల్వలు పెరిగిపోయినప్పుడు ఒకదానికొకటి పోటాపోటీగా నిలబడ్డప్పుడు యేంజరుగుతుంది?"

ఎర్నెస్ట్ తన ప్రసంగం ఆపి, శ్రోతలకేసి చూశాడు. వాళ్ళ ముఖాల్లో కలవరపాటు చూడముచ్చటగా వుంది. అంతేనా. వాళ్ళ ముఖాల్లో భయం నీడలు ముసురుకుని వున్నాయ్. అమూర్తమైన వాటిలోంచి ఒక దృశ్యాన్ని కల్పించి వాళ్ళ కళ్ళకు కట్టి చూపించాడు. యిప్పుడు వాళ్ళు దాన్ని చూస్తున్నారు. ఆ దృశ్యం వాళ్ళ కళ్ళ ముందు ఆడి, వాళ్ళకి వొణుకు పుట్టిస్తోంది.

"మిష్టర్ కాల్విన్! మనం ఓనమాలతో ప్రారంభించాం. యిప్పుడు మీకు మిగతా అక్షరమాలనంతా అందించాను. యిక మీరు చెప్పండి. ప్రపంచంలో వున్న ప్రతి దేశానికీ ఖర్చుకాని మిగులు వుండిపోతే యేమవుతుంది? మీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎక్కడుంటుంది?"

కాల్విన్ ఆందోళనతో సతమతమవుతూ బుర్రవూపాడు. ఎర్నెస్ట్ చేసిన వాదంలో తప్పెక్కడ దొరుకుతుందా అని గాలిస్తున్నాడు.

"మళ్ళీ మనం చెప్పుకున్న విషయాన్ని పునశ్చరణ చేసుకుందాం. మనం ఒక నిర్దిష్టమైన పారిశ్రామిక ప్రక్రియతో ప్రారంభించాం. అదొక చెప్పుల ఫ్యాక్టరీ. సంయుక్త కృషిద్వారా జరిగిన ఉత్పత్తిని యేవిధంగా పంచుకున్నారో, అది మొత్తం పారిశ్రామిక ప్రక్రియల కెట్లా వర్తిస్తుందో తెలుసుకున్నాం. కార్మికులు తమకుముట్టిన కూలితో ఉత్పత్తిలో కొంతభాగాన్ని మాత్రమే తిరిగి కొనుక్కోగలరనీ, పెట్టుబడి మిగిలిన ఉత్పత్తి మొత్తాన్ని ఖర్చుచేసుకోలేదని గ్రహించాం. తర్వాత మిగులుతో తమ నిల్వల్ని గురించి, అవి విదేశాల్లో ఎలా విడుదలయ్యేది, ఆయాదేశాలు యీమిగులు వనరులు అభివృద్ధి పర్చుకుని చివరికి తాముకూడా ఖర్చుకాని మిగులు నిల్వల్ని కూడ బెట్టుకోవటం జరుగుతుందని చెప్పుకున్నాం. మనం యీ పరిణామాన్ని భూగోళంమీద వున్న అన్ని దేశాలకూ అన్వయించాం. ప్రతిదేశం, ప్రతియేటా, ప్రతిరోజూ యీ విధంగా మిగులుని ఉత్పత్తిచేసి, ఆమిగులుని మరెక్కడా విడుదల చెయ్యలేని స్థితిలో పడుతుందని చెప్పుకున్నాం. యిప్పుడు మిమ్మల్ని అడుగుతున్నాను. ఆమిగులుతో మనం యేంచెయ్యబోతున్నాం?"

ఎవ్వరూ మాట్లాడలేదు.

"మిష్టర్ కాల్విన్" అని పిలిచాడు.

కాల్విన్ తనకేమి చెప్పాలో తెలీటంలేదని ఒప్పేసుకున్నాడు.

"అటువంటిది సంభవిస్తుందని నేనెన్నడూ కలలోకూడా వూహించలేదు, అచ్చు వేసినట్లుగా నాకది స్పష్టంగా కనిపిస్తున్నది" అన్నాడు అస్మన్ సెన్.

యిక్కడ నావిషయం ప్రస్తావిస్తాను. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతాన్ని యింత విపులంగా వినటం నాకిదే మొదటిసారి. ఎర్నెస్ట్ ఆ సిద్ధాంతాన్ని చాలా తేలికగా అర్థమయ్యేట్లు వివరించాడు, నేనుకూడా నివ్వెరపోయి మూగమొద్దులా కూర్చుండిపోయాను.

"ఆమిగులు ఉత్పత్తిని ఎలా విరగడ చేసుకోవాలో నేను మార్గం చూపెడతాను. దాన్ని సముద్రంలో కుమ్మరించండి. ప్రతియేటా లక్షల కోట్ల డాలర్ల విలువ చేసే జొన్నని, గోధుమని, బట్టల్ని, తదితర వాణిజ్యసామగ్రినంతా సముద్రంలోకి తోసెయ్యండి అప్పుడు దానిరోగం కుదుర్తుందా?"

"రోగం కుదుర్తుందిగాని, మీరా విధంగా మాట్లాడ్డం విపరీతంగావుంది" అని కాల్విన్ జవాబిచ్చాడు.

ఎర్నెస్టు అయన మీద మెరుపులాగా విరుచుకుపడ్డాడు. వాళ్ళ యంత్ర విధ్వంసన ఉద్దేశ్యాన్ని తూర్పారబట్టాడు. గుత్తయజమాన్లకు, కార్మికుల మధ్య రాబోయే యుద్ధంలో యే పక్షమూ యంత్రాలు ధ్వంసంకావాలని కోరదని చెప్పాడు. ఆ యుద్ధంలో మధ్య తరగతి స్థానమే వుండదని వివరించాడు.

"పెట్టుబడిదారీ వ్యవస్థ అనివార్య పతనాన్ని నేను లెక్కల్తో సహా మీ ముందు ప్రదర్శించాను. ప్రతి దేశం ఖర్చుకాని మిగులు నిల్వలతో, అమ్ముకునే జాగా దొరక్క అలమటించినప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థ తనంతట తాను కట్టుకున్న లాభాల భయంకర కట్టడం కింద కూలిపోతుంది. అప్పుడు యంత్రాల మీద ఆధిపత్యం గురించి పోరాటం ప్రారంభమవుతుంది. కార్మికులు గెలిచారా, మీకు నిశ్చింత. అమెరికాయే కాకుండా సమస్త ప్రపంచం అద్భుతమైన ఒక నూతన యుగంలో ప్రవేశిస్తుంది. నాశనమైపోయిన మీ మధ్యతరగతి కార్మికప్రజలలో విలీనమైపోతుంది. అప్పుడు కార్మికవర్గం తప్ప వేరే వర్గమేదీ వుండదు. ఆ అద్భుత యంత్రాలు ఉత్పత్తి చేసిన వస్తుసంపదని మీరు, మిగిలిన కార్మికులు సమానంగా పంచుకోవటంలో పాల్గొంటారు. మేం, మనమంతా, యింకా అద్భుతమైన కొత్త యంత్రాల్ని సృష్టిస్తాం. లాభాలనేవి వుండవు కాబట్టి ఖర్చుకాకుండా నిలవవుండి పోయిన మిగులంటూ యేమీ వుండదు."

"ఆ యుద్ధంలో గుత్తసంస్థలు గెలిచి, యంత్రాల్ని, ప్రపంచాన్నీ కైవసం చేసుకుంటే?" అని కోవాల్ట్ ప్రశ్నించాడు.

"అప్పుడు-మానవ చరిత్ర పుటల్ని మలినం చేసిన అన్ని నిరంకుశ ప్రభుత్వాల మాదిరిగానే యిక్కడా ఆ భయంకర నిరంకుశ ప్రభుత్వపు ఉక్కుపాదం మిమ్మల్ని, కార్మికుల్ని, మనల్నందర్నీ నిర్దాక్షిణ్యంగా తొక్కిపారేస్తుంది. ఆ నిరంకుశ ప్రభుతకి 'ఉక్కుపాదం' అన్న పేరు చక్కగా అతికిపోయింది" అని ఎర్నెస్టు జవాబిచ్చాడు.

చాలసేపు అంతా మౌనంగా వుండిపోయేరు. ప్రతిఒక్కడూ అలవాటు లేని ధ్యానముద్ర ధరించి గంభీరంగా కూర్చున్నాడు.

"మీ యీ సోషలిజం ఒక కల" అన్నాడు కాల్విన్.

'కల' అనే మాటని రెండుటూర్లు వొత్తి పలికాడు.

"కల కానిదేదో మీ కళ్ళముందు ప్రదర్శిస్తాను. ఆ 'యేదో' అనేది అల్ప సంఖ్యాకుల నిరంకుశ ప్రభుత. మీరు దాన్ని ధనస్వామ్యం అంటారు, మనం మాట్లాడే మాటల్లో తేడాయేతప్ప, రెంటి అర్థం ఒకటే. ఆ కొద్ది మంది అంటే పెద్ద పెద్ద పెట్టుబడిదార్లు లేదా గుత్తసంస్థలు. అధికారం ఎక్కడుందోచూదాం. దానిగ్గాను, సమాజాన్ని వర్గాలకింద విభజిద్దాం."

"సమాజంలో మూడు పెద్ద వర్గాలున్నాయ్. మొదట ధనికవర్గం వస్తుంది. యీ వర్గంలో డబ్బు కలిగిన బ్యాంకులు, రైల్వే గుత్తాధిపతులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, గుత్తసంస్థల యజమాన్లు వున్నారు. రెండవది మధ్య తరగతి–అంటే మీ వర్గం. ఇందులో రైతులు, వ్యాపారస్తులు, సన్నకారు ఉత్పత్తిదార్లు, వివిధ వృత్తుల్లో కుదురుకున్న ఉద్యోగస్తులు మొదలైనవాళ్లు వున్నారు. మూడవది, అంటే చివరిది నావర్గం–కార్మికవర్గం. కూలిమీద బ్రతికే వ్యాళవర్గం అది."

"సంపద ఎవరి చేతుల్లో వుందో వాళ్ళే అమెరికాలో నేడు అధికారచక్రం తిప్పుతున్నారంటే ఒప్పుకోకతప్పదు. యీ సంపద యే యే వర్గాల చేతుల్లో ఎంతెంత వుందో చూద్దాం. ధనస్వామ్యవర్గంలో 67 లక్షల కోట్ల ధనం వుంది. అమెరికాలో అనేక వృత్తుల్లో, ఉద్యోగాల్లో వున్న మొత్తం జనసంఖ్యలో ధనికవర్గం ఒక శాతం కూడా నిండాలేదు. (ఒక శాతంలో పదింట తొమ్మిది వంతులు). నిండా ఒక్క శాతం కూడా లేని ధనికవర్గానికి దేశ సంపద మొత్తంలో 70 శాతం వుంది. మధ్యతరగతి వర్గానికి 24 లక్షల కోట్ల ధనంవుంది. వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో వున్న యీ మధ్యతరగతి ప్రజలు మొత్తం జనాభాలో 29 శాతం వున్నారు. దేశ సంపద మొత్తంలో వీళ్ళది నాల్గవవంతు. యిక మిగిలింది కార్మికవర్గం. వీళ్ళు నూటికి డెభ్బై మంది వున్నారు. వీళ్ళకున్న సంపద 4 లక్షల కోట్లు. నూటికి డెభ్బై మంది వున్న కార్మిక వర్గానికి దేశసంపదలో నాలుగు శాతం వుంది. బలం, అధికారం ఎవరిదగ్గరున్నాయ్?"

"మీ రిచ్చిన లెక్కలప్రకారం, కార్మికులకంటే మా మధ్యతరగతి వాళ్ళమే బలవంతులం" అన్నాడు అస్మన్ సెన్.

"ధనస్వామ్య బలంముందు మీరు మమ్మల్ని బలహీనులన్నందువల్ల మీరు బలవంతులైపోరు" అని ఎర్నెస్ట్ఎత్తిపొడిచాడు. "సంపదకంటే శక్తివంతమైన బలం

వేరొకటి వుంది. అది మిగతా వాటికన్నా బలమైంది. దాన్నెవరూ కాజెయ్యలేరు. అది మా బలం-అంటే మా కార్మికవర్గ బలం-ఆ బలం మాకండల్లో వుంది; ఓట్లు వెయ్యటానికది మాచేతుల్లో వుంది. తుపాకి ట్రిగ్గర్ నొక్కటానికది మావేళ్ళల్లో వుంది. మానుంచి అపహరించలేని బలం అది. ఇది అనాదిగా వున్న ఆదిమశక్తి; జీవం మొలకలెత్తే అమృతశక్తి. సంపదకన్నా బలీయమైన శక్తి సంపద. ఎవ్వరూ అపహరించుకుపోలేని శక్తి సంపద."

"మీ బలమంటారా? దాన్ని మీ నుంచి వూడగొట్టవచ్చు; మీ దగ్గర్నుంచి అపహరించుకుపోవచ్చు. ధనికవర్గం యిప్పటికీ మీకు వొచ్చే లాభాల్ని గుంజుకుంటోంది. చివరికి, మీ సంపదంతా లాగేసి మిమ్మల్ని బికార్లు చేస్తుంది. అప్పుడు మధ్యతరగతి వర్గంగా మీమనుగడ పోతుంది. మీరు మావర్గంలో కలిసిపోతారు; శ్రమచేసి బ్రతికే కూలివాళ్ళవుతారు. యిక్కడున్న తమాషా అదే. మీరంతా కలిశాక మనబలం పెరుగుతుంది. సోదరులుగా మిమ్మల్ని ఆహ్వానిస్తాం. మానవజాతి ఆదర్శంకోసం భుజం భుజం కలిసిపోరాడ్దాం."

"కాని, యిప్పటి మీ పరిస్థితి సింహం-పెద్దపులుల మధ్య బిక్కు బిక్కుమనే గొర్రెపిల్ల లాంటిది. ఎవళ్ళో ఒకళ్ళు మిమ్మల్ని నోట కరుచుకుంటారు. మొట్ట మొదట ధనికవర్గం మిమ్మల్ని నోట కరుచుకుంటే, ఆ ధనికవర్గాన్ని మేం నోట కరుచుకోడం ఎన్నో రోజులు పట్టదు."

"యిప్పుడు మీకున్న సంపదయినా మీబలానికి సరైన ప్రమాణం కాదు. ప్రస్తుతం మీ ధనబలం గుడ్డిగవ్వ విలువచేయదు. మీ అశక్తత మీకుతెలుసు. ఇక, రైతులకేం అధికారంవుంది? నూటికి యాభై మందికిపైగా చాకిరీ చేసే సేవకుల్లాగా వున్నారు. కేవలం పాలికాపులుగానో, తాకట్టు పడ్డవాళ్ళగానో బ్రతుకు వెళ్లదీస్తున్నారు. పంటల మార్కెటింగు యంత్రాంగం యావత్తూ గుత్త యజమాన్ల చేతుల్లో వుంది. శీతల గిడ్డంగులు, రైళ్ళు, ట్రాములు, బరువులెత్తే ఎలివేటర్లు, ఆవిరి ఓడలు-ఒకటేమిటి, సకల సాధనాలూ వాళ్ళ గుప్పెట్లో వున్నాయి. మరి, రైతులు దాసులుకాక మరేమిటి? గుత్త యజమాన్లు రైతుల్ని పిండేసినట్లుగానే, చిన్నచిన్న వ్యాపారస్తుల్నికూడా పీల్చి పిప్పిచేస్తున్నారు. చిట్టల ఫ్యాక్టరీలు పెట్టినవాళ్లు పొగాకు గుత్త యజమాన్ల చేతుల్లో అరిపోయారు. పూర్వం బొగ్గు గనులున్న యజమాన్లు రైల్వే గుత్త యజమాన్ల పెత్తనంకింద బుగ్గయిపోయారు. బొగ్గు గనులు, చమురు గనులు రైల్వే గుత్తసంస్థ గుప్పెట్లోకి వెళ్ళిపోయాయి. స్టాండర్డ్ అయిల్ సంస్థకి యిరవై పైచిలుకు సముద్ర

మార్గాలున్నాయ్. రాగి వ్యాపారం యావత్తూ గుప్పెట్లో బిగించుకుంది. ఆ సంస్థ అజమాయిషీలో, యాజమాన్యంలో వెయ్యి పైచిలుగ్గా పట్నాల్లో లైట్లు వెలుగుతయ్. పట్నాలేమిటి, పల్లెలేమిటి, వాడవాడలా, ఎల్లెడలా విద్యుద్దీపాలు వెలిగించే గుత్తసంస్థ అది. దానిముందు, సన్నకారు పెట్టుబడిదార్లు చాలమంది పూడ్చుకుపోయారు."

"యిక ఉద్యోగస్తులు, కళాకారుల సంగతికొద్దాం. వాళ్ళ సంఘంలో విలన్లు. పాఠాలు నేర్పే ప్రొఫెసర్లు, మతబోధచేసే ప్రీచర్లు, పత్రికా సంపాదకులు ధనస్వామ్యానికి సేవచేస్తూతమ ఉద్యోగాలు, వృత్తులు నిలబెట్టుకుంటున్నారు. ధన స్వామ్యానికి ఎసరుపెట్టని భావాల్ని, పుష్టికూర్చే భావాల్ని ప్రచారం చేసిపెట్టటం వాళ్లవృత్తి. దాని చాపకిందికి నీళ్లు తెచ్చే ప్రచారం చేశారో, వాళ్ళ వుద్యోగాలు వూడిపోవటం ఖాయం. గడ్డు రోజులొచ్చి డబ్బుకి కటకటలాడే పరిస్థితి కలిగి నప్పుడు వాళ్ళు కూలివాళ్ళ స్థితికి దిగజారిపోతారు. సర్వనాశనం కావటమో శ్రామికవర్గ ఆందోళన కారులుగా తయారు కావటమో జరుగుతుంది. ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రచండ శక్తివంతమైన సాధనాలు- పత్రికలు, చర్చి, విశ్వవిద్యాలయాలు అనిమాత్రం మర్చిపోకండి. జాతి విచారధారకి దారితీసేవి అవి. యిక, కళాకారులంటారా! ధనస్వామ్యపు చాటబారు అధిరుచులకి తాళం వేసేమేళగాళ్ళు."

"కాని, డబ్బు ఒక్కటేవాస్తవ అధికారం కాదు. అది అధికారానికి సాధనం. ఆ అధికారం ప్రభుత్వం. యీరోజు, ప్రభుత్వాన్ని అదుపుచేసేదెవరు? సమస్త వృత్తుల్లో శ్రమచేసే రెండు కోట్ల శ్రామికవర్గమా కాదు. వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం, సద్యోగం చేసుకునే ఎనభై లక్షల మధ్యతరగతి ప్రజలా? కాదు. మరింకెవరు? ధనికవర్గం! రెండున్నర లక్షల మంది వున్న ధనిక వర్గం. యీ రెండున్నర లక్షల మందీ ప్రభుత్వాన్ని అదుపుచేస్తారా? లేదు. ధనికవర్గ మేధస్సు ప్రభుత్వాన్ని అదుపుచేస్తుంది. యీ మేధస్సులో యేడు కూటాలు- సంఖ్యలో చిన్నవి, శక్తిలో పెద్దవి అయిన యేడు ముఠాలు ఒక త్రాటిమీద నడిచేవి వున్నాయ్."

"ఆముఠాల్లో ఒక్కదాన్ని గురించి చెప్తాను. అది రైలు మార్గాల గుత్తసంస్థ. న్యాయస్థానాల్లో ప్రజలకి న్యాయం జరగనీకుండా అది నలభై వేలమంది న్యాయవాదుల్ని పోషిస్తోంది. జడ్జీలు, బ్యాంకర్లు, పత్రికా సంపాదకులు, మంత్రులు, విశ్వవిద్యాలయ మనీషులు, ప్రజా ప్రతినిధులు - ఒక్కరనేమిటి, సవాలక్ష మందికి పైసా ఖర్చులేకుండా ప్రయాణం చెయ్యటానికి పాసులిచ్చింది. రాష్ట్ర రాజధానుల్లో, దేశ రాజధానిలో విలాసవంతమైన లాబీలు నిర్వహిస్తోంది. అడుగడుగునా తన ప్రయోజనాల్ని కాపాడే అసంఖ్యాక చోటా రాజకీయ నాయకుల్ని, వకీళ్ళని ఊరూరా మేపుతోంది."

"ఆయేడు మతాల్లో ఒక్కమతాను మాత్రమే మీకు రేఖా ప్రాయంగా ప్రదర్శించాను. మీ మధ్యతరగతివర్గం గడించే 24 లక్షల కోట్ల డాలర్లూ మీకు పాతిక పైసలపాటి ప్రభుత్వాధికారాన్ని ప్రసాదించలేకపోయాయ్. మీ డబ్బు గుడ్డిగవ్వ పాటి చెయ్యదు. ఆగుడ్డిగవ్వకూడా మీచేతుల్లోంచి జారిపోతుంది. యీనాడు అధికారమంతా ధనికవర్గం చేతుల్లోవుంది. అది యీనాడు చట్టాలు చేస్తోంది; శాసనాలు చేస్తోంది. ఆ చట్టాలు, శాసనాలు చెయ్యటానికి దానికింద సెనేట్‌వుంది; కాంగ్రెసు వుంది; కోర్టులున్నాయ్; రాష్ట్రశాసనసభ లున్నాయ్. అంతేకాదు; చట్టాన్ని అమలుపర్చే శక్తిసాధనాలు కావాలి. ధనికవర్గానికి అవీవున్నాయ్. చట్టాల్ని చేసే సభలూ వున్నాయ్; చట్టాల్ని అమలుపర్చే సాధనాలూ వున్నాయ్. అవి సైగచేస్తేచాలు, సైలంటూ దూకే పోలీసులు సైన్యం, నౌకాదళం, యింకా మీరూ, నేనూ, మనమంతా బలవంతంగా వుండే పౌరసేన వున్నాయ్."

ఎర్నెస్ట్ తన ప్రసంగం ముగించాడు. తర్వాత అట్టే చర్చ సాగలేదు. విందు పూర్తయింది. అంతా చల్లబడిపోయారు. ఎవరికి వాళ్ళు శలవు తీసుకుని చప్పుడు చెయ్యకుండా యిళ్ళకు సాగారు,

"పరిస్థితి తీవ్రంగా వున్నమాట నిజమే. మీరు దాన్ని చిత్రించిన సరళితో కూడా నాకు తగాదాలేదు. మధ్యతరగతి అవసానాన్ని గురించి మాత్రం మీతో నేను యేకీభవించను. మేం నశించం; గుత్తయజమానుల్ని పడదోస్తాం" అన్నాడు కాల్విన్ ఎర్నెస్ట్‌తో.

"పడదోసి, మీతాతల పంథాకి తిరోగమిస్తారు" అని ఎర్నెస్ట్ మిగతా భావాన్ని పూరించాడు.

"యంత్రాలు విరగ్గొట్టటం అర్థంలేని పనని నాకు తెలుసు. అయినా, యీనాడు జీవితం అర్థరహితంగా కనిపిస్తున్నది. ధనికవర్గాల జిత్తులమారి ఎత్తుల మాటేమిటి? అర్థం ఉన్నదనండీ! లేదనండీ-యేమైనా, మాతరహా యంత్ర విధ్వంసనం కనీసం ఆచరణ యోగ్యమైంది. అది సాధ్యంకూడా. కానీ, మీ కల అట్లాకాదు. మీసామ్యవాద స్వప్నం వున్నదే-అదొక కల. మేం మీవెంటరాలేం," అన్నాడు కాల్విన్ నిర్వికారంగా.

"మీ మనుషులకి పరిణామవాదం, సమాజ శాస్త్రాల గురించి కాస్తయినా తెలిసి వుంటే బాగుండేదనుకున్నాను. మీకు తెలిసుంటే, మాకీ శ్రమతప్పేది" అని ఆశాజనకంగా మాట్లాడ్తూ ఎర్నెస్టు వాళ్ళతో కరచాలనం చేశాడు.

పుస్తక పరిచయం :

దుష్ప్రచారానికి గురైన విప్లవం

"ప్రపంచంలో అన్నిటి కంటే ఎక్కువ దుష్ప్రచారానికి గురైన విప్లవం" కంపూచియా విప్లవం అంటాడు మాల్కొమ్ కాడ్‌వెల్. చిత్తశుద్ధితో విప్లవోద్యమానికి కట్టుబడిన బ్రిటిష్ మేధావి ఈయన. అందుకే దురుద్దేశపూరితమైన ప్రచారాన్ని ఆయన నమ్మలేదు. అంతేకాదు ఈ ప్రచార వాస్తవవాస్తవాలను ఆయన స్వయంగా పరిశోధన చేశాడు. అవసరమైన మరికొన్ని వివరాలు సేకరించడానికి డిసెంబర్ 78 లో ఆయన కంపూచియా వెళ్ళినప్పుడు బూటకపు ప్రచారాలను బట్ట బయలు చేసే ఆయన కృషి అంటే గిట్టని వాళ్ళు ఆయనను (డిసెంబర్ 23 న) హత్య చేశారు.

స్పెయిన్‌లో నిరంకుశుడైన ఫ్రాంకోకు వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాటును సమర్థిస్తూ ప్రపంచ ప్రజాస్వామ్య వాదుల మద్దతుకై కృషి చేస్తూ ఆనాడు ప్రాణ త్యాగం చేసినవాడు క్రిస్టోఫర్ కాడ్‌వెల్ అయితే, పోల్‌పాట్ ప్రభుత్వానికీ, కంపూచియా కమ్యూనిస్టు పార్టీకీ ప్రజాదరణ లేదనీ, అవి క్రూరమైనవనీ ప్రపంచ ప్రజలను నమ్మించడానికి వియత్నాం, సోవియట్ రష్యాలు ప్రయత్నిస్తున్న ఈనాడు-కంపూచియా విప్లవం గురించిన వాస్తవాలు సేకరించి వెల్లడిచేస్తూ తన ప్రాణాలనే బలి యిచ్చిన వాడు మరో కాడ్‌వెల్ కావడం విశేషం. ఆనాడు క్రిస్టోఫర్ కాడ్‌వెల్ కృషి వెంటనే ఫలించకపోవచ్చు, అల్లే ఈనాడు పోరాటం చేస్తున్న కంపూచియా ప్రజలు యింకా రివిజనిస్టు దురాక్రమణ దారులకు పూర్తిగా బుద్ధి చెప్పకపోవచ్చు అంత మాత్రం చేత-విప్లవం యిక లాభం లేదులే, ఏదో సర్దుబాటు చేసుకొని బతికితే చాలు-అనుకునే స్వభావం ప్రజల్లో లేదనేది నిజం. ఏ దేశం ప్రజలైతే నేం, భయంకర దారిద్ర్యంతో, యుద్ధాలతో సతమతమవుతున్న వాళ్ళ సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి సాగించిన ఆదర్శవంతమైన కృషిని సంపూర్ణంగా సమర్థించటం నిజమైన మేధావి లక్షణమని నిరూపించిన వాళ్ళు ఈ యిద్దరు కాడ్వెల్‌లు.

మాల్కొమ్ కాడ్‌వెల్ విద్యావేత్త. లండన్ ఓరియంటల్ స్కూల్, ఆఫ్రికన్ స్టడీస్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తూ ఉండేవాడు. ప్రఖ్యాత పత్రిక "కాంటెంపరరీ ఆసియా" కు సహసంపాదకుడిగా కూడా పనిచేసాడు. అందువల్ల ఆయన దృక్పథం శాస్త్రీయ పంథాలో ఉండేది. వాస్తవాల కోసం తీవ్ర అన్వేషణ సాగించి, చివరకు కంపూచియా విప్లవకారులకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రచారాలలో అత్యధిక భాగం పచ్చి అబద్ధాలనే నిర్ణయానికి ఆయన వచ్చాడు. అంతటితో ఊరు

కోలేదు. సత్యాన్ని వెలికితేవడానికి తీవ్ర పోరాటం సాగించాడు. కంపూచియా గురించి ఆయన రాసిన తొలి చిత్తు ప్రతిని పశ్చిమ జర్మనీలో ఒక సెమినార్‌కు ఆయన సమర్పించాడు. ఆయన హత్య కావించబడకపోతే సరిహద్దు యుద్ధం గురించి యింకా ఎక్కువ వివరాలు మనకు అందించి ఉండేవాడు. ఆయన మరణం తర్వాత ఆ యుద్ధం పూర్తి స్థాయి యుద్ధంగాను, ఆక్రమణగాను పెరిగిపోయింది.

ఒక సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి కంపూచియా పిచ్చి మార్గం అను సరిస్తున్నదని మరో అసత్య ప్రచారం. ఇదెంత మాత్రం పిచ్చి మార్గం కాదని, ఈ మార్గం కంపూచియాకే కాదు, యిప్పటి సామ్రాజ్య వాద యుగంలో మూడవ ప్రపంచంలో వెనుకబడి వున్న అత్యధిక దేశాలకు అత్యుత్తమమైనదని కూడ కాడ్‌వెల్ నిరూపించాడు. క్యూబా, వియత్నాం, లావోస్ మొదలైన సోషలిస్టు దేశాలతో సహా మూడవ ప్రపంచదేశాలన్నీ స్వాతంత్ర్యం సంపాదించుకున్న తర్వాత పరులపై ఆధారపడే దుస్థితిలోనే కొనసాగాయి కాని, చైనా, ఉత్తర కొరియా, కంపూచియా యీ మార్గం అనుసరించలేదు. విముక్తికి పూర్వం దేశంలో నెలకొని వున్న ఆ నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన వాస్తవ పరిస్థితుల మీద ఆధారపడ్డ ఒక నిర్దుష్ట విశ్లేషణ ప్రాతిపదిక మీద కంపూచియా విప్లవ నాయకులు స్వల్ప కాలిక ఎత్తుగడల్ని, దీర్ఘ కాలిక సామాజికార్థిక వ్యూహాన్ని రూపొందించారు.

వలసపాలనకు పూర్వం-గ్రామసీమల్లో జీవించే రైతుల ఆహారావసరాలు పోను, రాబోయే పంటకు అవసరమైన వంగడాలు పోను, మిగిలిన గ్రామీణ ధాన్యపు నిల్వల్ని రాజు, రాజ పరివారం, ఉత్పత్తి చేసే ప్రవృత్తి లేని భూస్వామ్య, ప్రభుత్వాధికార వర్గాలు దిగ మింగారు. ఆ వర్గాలు రైతుల దగ్గర ఎంతగా గోక్కుడగొట్టి ధాన్యం వసూలు చేసుకున్నా, సాగుభూమి పుష్కలంగా వున్న కారణంచేత ఆ బాధ వాళ్ళ నంతగా పీడించి వుండక పోవచ్చు. ఫ్రెంచి విజేతలు రాక పూర్వం, వ్యాపార వాణిజ్యాలు కొత్తగా అభివృద్ధి కానందు వల్ల, రైతుల్ని కాల్చుకు తిని బలిసే తదితర పరాన్న భుక్కులు లేరు. అందుచేత ఆసియాలో యీ ప్రాంతంలో పంట దిగుబడి హీనంగా వున్నప్పటికీ సాధారణంగా రైతులు తిండి తిప్పలకు లోటులేకుండా బతుకు వెళ్ళబుచ్చారని మనం ఊహించవచ్చు.

ఫ్రెంచి వలస పాలనవచ్చి ఆపరిస్థితుల్ని మార్చివేసింది. గ్రామీణ రుణభారం, రైతాంగ పతనం ప్రారంభమయ్యాయి. కొత్తగా అవతరించిన దళారీ వర్గం నుంచి వచ్చిన పద్దతుతో పాటు వరి, మొక్కజొన్న పండించే వాళ్ళ కడుపులు గొట్టటంతో

విశేషంగా ఎగుమతులు పెరిగాయి. పెరిగే ఎగుమతుల్ని ఆర్థిక "అభివృద్ధి"కి కొల మానంగా తీసుకున్నారు: దేదీప్య మానంగా వెలిగిపోయే ఫలహారశాలల్లో, పానశాలల్తో విపరీతంగా లాభాలు గడించే విలాస వస్తు విక్రియ శాలల్తో, మదించిన మేజిస్ట్రేట్లతో, పానశాలల సుతారపు మదవతులతో సకల నాగరిక ఆకర్షణల్తో, వికారాల్తో, మెరిసిపడే రాజధాని నాంఫెన్ నగరాన్ని రెక్కలు ముక్కలు చేసుకుంటూ, చెమటలు కక్కుకుంటూ పొలాల మీద పని చేసే కష్టజీవులు తీవ్రమైనకసితో అసహ్యించుకునేవారు. ఆప్రజలు తమ రాజధాని నగరాన్ని మెకాంగ్ నదీతీరాన కులికే "పెద్దపడుపుగత్తె"గా పేర్కొన్నారు. 1970కి పూర్వపు కంబోడియా గురించి యిచ్చిన చిత్రణలో 19,20వ శతాబ్దాల అభివృద్ధి ప్రజలందరకూ మేలు చేసినట్టు చిత్రించబడడమే కాకుండా గ్రామీణ జీవితం ఆకాశానికెత్తి వెయ్యబడింది. నిజం చెప్పాలంటే, మొత్తం జనాభాలో 85 శాతం పై చిలుగ్గా ప్రజలకు జీవితం హాయిగా లేదు. భూమి, పుట్రా లేని బీదవాళ్ళు లేదా గోరంత మడి చెక్కలున్న నిరుపేద రైతాంగం. తక్కువ ఫలసాయం, హెచ్చు కౌళ్ళు, ప్రాణాలు తీసే దుర్మార్గపు వడ్డీలతో రైతాంగం పేదరికంలో, అశాంతిలో కూరుకుపోయి కృంగి కృశించి పోయింది. యీ చిక్కులు యింకా తీవ్రతరమైన దశలో (1960) లోన్‌నాల్, సిరిక్ మటక్, సోన్‌గాన్‌థాన్‌ల నాయకత్వంలో సైనిక, పోలీసు, దళారీ, బడా భూస్వామ్య వర్గాల బలవంతులైన అధికార్లు, ఉద్యోగస్తులు, సిగ్గు విడిచి భూములు ఆక్రమించుకోవటం, రైతాంగాన్ని వీధిలోకి విసిరి పారేసే ఎంగిలి విస్తరాకుల్లా అసహ్యంగా చూడటం ప్రారంభించారు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం, స్వాతంత్ర్యావతరణ తరువాత, కంబోడియాకు 'ఆధునికీకరణ' సిద్ధాంతపు అంటు రోగం సోకింది. 1963లో నరోదమ్ సిహనౌక్ అమెరికా సహాయాన్ని నిరాకరించినప్పుడు 'డాలర్ వ్యసన పరుల' వర్గం అమెరికా వాళ్ళని తిరిగి రప్పించుకొని, చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని కూలదోసింది. స్వావలంబన విధానానికి ప్రతికూలమైన 'సహాయం' కంబోడియా దేశభక్తులు నిరాకరించారు. అమెరికా చెప్పుచేతల్లో వున్న పట్టణాలన్నీ దారుణమైన నీచ స్థితికి దిగజారి పోయాయి. విముక్తి ప్రాంతాల్లో వ్యవసాయాన్ని సర్వనాశనం చెయ్యటమే ప్రభుత్వం ప్రధాన ధ్యేయంగా పెట్టుకుంది.

కోతలు, కుప్ప నూర్పిళ్ళ కాలంలో రైతాంగ గెరిల్లా దళాలు వేర్వేరు చోట్లకు చెదిరిపోయి ప్రజలతో కలిసి పొలాల్లో పనిచేసే వాళ్ళు. "సాయుధ పోరాటాన్ని సాగించటం, దానితో పాటు ఉత్పత్తి కోసం పోరాడడం" అనే ఆదేశాన్ని వాళ్ళు

పాటించారు. వినతులు, విజ్ఞాపనల వల్ల బొత్తిగా ఫలితం కనబడనందువల్ల, ఒక విప్ల వాత్మక పోషలిస్టు దృష్టి రూపొందించుకొని దాన్ని చేపట్టటం అనివార్యమని తేలింది. రైతాంగం యొక్క అభిప్రాయాల్ని, ఆశల్ని ప్రతిధ్వనించిన వాళ్ళలో శాంఫన్ ఒకరు. ఆయన ప్రజాతంత్ర కంపూచియా అధ్యక్షుడు. ఆయనతో భుజం కలిపిన మార్క్సిస్టు ముఖ్యులు హ్యూనిమ్, హోయూన్. వాళ్ళంతా ఎప్పుడూ కార్యకర్తలకు రైతులతో పాటు కాయకష్టం చేయటం ముఖ్యమని చెప్పడమే కాకుండా, తాము స్వయంగా రైతులతో పాటు కాయకష్టం చేసి ఒక ఆదర్శాన్ని నెలకొల్పారు. పారితోషికాలను సుఖాలను తృణీకరించారు. పేదల బతుకుల్లో పూర్తిగా పాలుపంచుకున్నారు. విముక్తి సాధించిన తర్వాత కూడా వాళ్ళు సుదూర గ్రామ సీమల్లోనే తమ కార్యాలయాలను అట్టే పెట్టుకొని ప్రజల్లో పని చేసారు.

చైతన్యవంతమైన స్వతంత్ర అభివృద్ధి వాస్తవంగా అవసరమని శాంఫన్ నొక్కి చెప్పాడు. కంబోడియాలో పెట్టుబడిదారీ విధానానికి మూడు ముఖ్య లక్షణాలున్నాయని హోయూన్ చెప్పాడు: (1) రైతులకు కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి; (2) అంతు లేని లాభాలు కూర్చిపెట్టే కొనుగోలు, మార్పిడి అన్నవి నిజానికి పచ్చి దొంగతనం, (3) నగరాలు, మార్కెట్ టౌన్లు గ్రామీణ ప్రాంతాల్ని అణచివేస్తాయి— యీ పరిస్థితి చక్కబడాలంటే సాంకేతిక, సంక్షేమ దృక్పథాలమీద దృష్టి నిలపాలని ఆయన వివరించాడు. వ్యవసాయిక సహకార సంఘాల ద్వారా గ్రామీణ సమస్యల్ని పరిష్కరించుకోవాలని ఆయన సిఫార్సు చేసాడు. ఆ సంఘాలు మూల ధనాన్ని సమకూర్చుకోగలిగి ఆధునిక యంత్రాల్ని, ఎరువులు మొదలైన పెట్టుబోతల్ని కొనగలిగినవై వుండాలి.

1973 మార్చి నుంచి ఆగస్టు వరకు ఆ ఒక్క ఏడు మాసాల కాలంలో కాంబోడియా మీద అమెరికా వేసిన బాంబులు రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ మీద వేసిన ప్రేలుడు పదార్థాలకంటె బరువులో యాభై శాతం ఎక్కువ. విముక్త ప్రాంతంలో రెండు లక్షల మంది హతులయ్యారు లేదా గాయపడ్డారు. దేశంలో చాలాకాలం నుంచి పనిచేస్తున్న శక్తుల వేగవంతమైన సమీకరణకు పోరాట సన్నద్ధతకు 1970–75 కాలం ప్రాతినిధ్యం వహించింది. "కార్యాచరణకి దిగటానికి చాలా కాలం ముందునుంచీ, యిక్కడి మార్క్సిస్టు మేధావులు రైతాంగం నుంచి పాఠాలు నేర్చుకున్నారు. అతి ఓపిగ్గా నిదానంగా ఒక రాజకీయ పంథాను రూపొందించుకున్నారు. పరిస్థితుల కనుగుణమైన మార్పులు, చేర్పులు చేసుకున్నారు–" అని ఛార్లెస్ మేయర్ అనే ఒక ఫ్రెంచి పెద్దమనిషి 1975 లో రాసాడు.

1967 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు విజృంభించిన మొదటి తిరుగుబాటు విప్లవ వాదులకు గ్రామసీమల్లో స్థానం కల్పించింది. నాలుగు వేలకు పైగా గ్రామ ప్రజలు తిరుగుబాటులో పాల్గొనటంతో పట్టణాల్లోవున్న అనేకమంది వామపక్షీయులకు 'ప్రజలు' కదిలారనే నమ్మకం కుదిరింది. వాళ్ళు అధిక సంఖ్యలో రహస్య విప్లవ సైన్యంలో వచ్చి చేరారు. యిట్లా చేరిన కార్యకర్తలకు యే భ్రమలూ లేవు. కర్తవ్యభారాన్ని గురించి యే పొరపాటు అభిప్రాయాలూ లేవు. ఎందుకంటే, తక్కువ ఫలసాయం, ఋణభారం, భూమి లేకపోవటం అనే సమస్యలు వివిధ భౌగోళిక, చారిత్రిక కారణాల వల్ల ఆ ప్రాంతంలో చాలా తీవ్రంగా వున్నాయి.

అమెరికా - లోన్‌నాల్ కూటమి దౌర్జన్యానికి గురైన సమస్త సామాజిక శక్తుల దేశభక్తి యుత సహకారాన్ని విప్లవకారులు సంపాదించుకున్నారు. పాశ్చాత్య తరహా స్వంత ఆస్తి అనే భావన కాంబోడియాలో కొత్తగా వెలసిన విదేశీ కల్పన. నీటి పారుదల సౌకర్యాల నిర్మాణం, నాట్లు, కోతలు మొదలైన వ్యవసాయ పనుల్లో కలిసికట్టుగా పాల్గొనడం మొదలైన వాటిలో గ్రామీణ సహకారానికి సంబంధించిన సజీవ సంప్రదాయం అక్కడ వుంది. యుద్ధ ఫలితంగా గ్రామసీమల అపరిమిత విధ్వంసం, యిళ్ళు, వాకిళ్ళు కోల్పోయిన ప్రజల దుర్భరమైన దీనస్థితి కూడా విప్లవకారులకు అనుకూల పరిస్థితిగా తయారైంది.

లోన్ నాల్ అనుకూల శక్తుల భూముల్ని ఆక్రమించుకొని తిరిగి పంపిణీ చేసారు. నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ముఖ్య విజయం. అమెరికా జోస్యాలకు విరుద్ధంగా 1975 లో కంబోడియా ప్రజలు మూకఉమ్మడిగా ఆకలితో అలమటించి పోలేదు. నాంఫెన్ విముక్తి జరిగింది. 1976 ఫిబ్రవరిలో పెకింగ్‌లోని పాలస్తీనా విమోచన సంస్థ ప్రతినిధి కంపూచియా సందర్శించాడు. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ఒక వియత్నాం శరణార్థి తూర్పు కంపూచియా నుంచి పశ్చిమ కంపూచియాకు దాటి వెళ్తూ 350 మైళ్ళు కాలినడకన ప్రయాణించాడు. దారిలో ప్రయాణానికి కావలసిన ఆహారం కోసం వరిపొలాల్లో పనిచేసాడు. థాయ్‌లాండ్ చేరేదాకా కంపూచియా ప్రభుత్వ అమానుషత్వం గురించి వినవచ్చే కథ లేవీ అతని చెవుల్లో పడలేదు. అదే కాలంలో స్వీడన్ రాయబారి 15 రోజులు కంపూచియా సందర్శించాడు ఏప్రిల్‌లో నావోకీ మాబుచీ అనే ఒక జపాను పాత్రికేయుడు థాయ్‌లెండ్ నుంచి సరిహద్దు దాటి కంపూచియాలో ప్రవేశించాడు. కంపూచియన్లని నాగళ్ళకు కట్టి దున్నిస్తున్నట్టుగా బ్యాంకాక్ వార్తా పత్రికల్లో వచ్చిన ఛాయా చిత్రాల్లాంటి దృశ్యాలు వీళ్ళెవరికీ కనిపించలేదు.

ఇక శరణార్థుల కథనాల్లో ఎక్కువ భాగం సంపన్న కాందిశీకులవి. వాళ్ళు చెప్పే కథలకే పాశ్చాత్య దేశాల్లో ఖచ్చితంగా ప్రబల ప్రచారం దొరుకుతుంది. కార్మిక కర్షక కుటుంబాల్లోంచి వచ్చిన వాళ్ళ యదార్థ కథలు వాస్తవాల వెల్లడిలో, వ్యాఖ్యానంలో పూర్తిగా విభేదిస్తాయి. పియాంగ్ సోఫీ అనే ఓ కార్మికుడు ఖ్మేర్ రూజ్ ప్రభుత్వాన్ని గురించి ప్రశంసా పూర్వకంగా మాట్లాడాడు.

కంపూచియా లోపల స్వదేశీ, విదేశీ కరెన్సీ వాడకం అనేది లేదు. వర్తమాన ప్రపంచంలో, ఆఖరికి సోషలిస్టు దేశాలలో సైతం యిట్లాంటిది కనిపించదు. బ్యాంకు నోట్ల వెంబడి పరుగులెత్తుతున్న ఫలితంగా, ప్రస్తుత ప్రపంచ సమాజాన్ని పట్టి పీడించే అనేక వ్యాధుల్తో పోల్చి చూస్తే యీ పద్ధతి బాగుందని కాడ్‌వెల్ రాసాడు.

నిత్యావసర వస్తువులను ఉత్పత్తిచేస్తున్న వ్యాపారాలకు ప్రాధాన్యం యిస్తున్నట్టు ప్రధాని పోల్‌పాట్ ప్రకటించాడు. అక్కడి ప్రజలు మొట్ట మొదటి సారిగా తమ భావికి తామే నిర్ణేతలమని భావించారు. కంపూచియాలో కంటె న్యూయార్క్ వీధుల్లో ఎక్కువ భయోత్పాతం వున్నది. నాంఫెన్ విముక్త మయ్యాక, పస్తుల్తో ప్రాణాలు విడిచినవాళ్ళు లేరు. ప్రతి ఒక్కరి అవసరాలకు చాలినంత ఆహారం వున్నది.

1973 లో ఆనాటి విముక్తి మండలాల్లో ఆయుద్ధ సంక్షోభకాలంలో మొట్టమొదట నిర్మించిన సహకార కేంద్రాలు దేశ మంతటా వ్యాపించాయి. అవి ప్రాథమిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ యూనిట్లు. వాటిల్లో చాలా భాగం గ్రామ కేంద్రాల స్థాయినుండి కమ్యూన్-సహకార కేంద్రాలుగా పైకితేలడ్డాయి. 1978 మార్చి నెలలో కంపూచియాను సందర్శించిన నలుగురు యుగొస్లోవియా పాత్రికేయుల కథనం ప్రకారం, సహకార కేంద్రాల్లో జీవితం పూర్తిగా సమిష్టిపరంగా వున్నది; "సైకిళ్ళు, కుట్టుమిషన్లు, పశువులు మొదలైన చరాస్తి అందరిదీ. ఆహారం తినడం నుంచి పిల్లల పెంపకం దాకా ప్రతిపనీ సమిష్టిగా సాగుతుంది." "సహకార కేంద్రాల్లో శ్రమించే సభ్యులు డబ్బు తీసుకోరు, ఒక్కొక్కరికి, రోజుకి ఒక కిలో బియ్యం, యేడాదికొక జత బట్టలు ముడతాయి."

చెక్కలు ముక్కలుగా వికృతంగా చెల్లా చెదరై వున్న ముప్పయి లక్షల చిన్న చిన్న కొంద్రల్ని తుడిచివేసి క్రమబద్ధమైన పెద్ద భూకమతాలు రూపొందించ బడ్డాయి. ప్రతిచోటా సీటివనరులకు సంబంధించి బ్రహ్మాండమైన శ్రద్ధాసక్తులున్నాయి. కొన్ని ప్రాంతాల్లో యేటా మూడు పంటలు కూడా పండుతున్నాయి.

సహకార కేంద్రాల కంటే కూడా ముఖ్యంగా 'సంచారదళాల'ను పేర్కొనాలి. జట్లు జట్లుగా కలిసి పనిచేసే యువకుల్తో యీ 'సంచారదళాలు' ఏర్పాటు చేయబడ్డాయి.

యీ దళాల్లో సుమారు యిరవై వేల మంది వున్నారు. వీళ్ళు ఒక ప్రాజెక్టు నుంచి మరొక ప్రాజెక్టుకు కదలి వెళ్తుంటారు.

"అన్ని చోట్లా పండించు! పండించు!! పండించు!!! అంగుళం మేర నేల కూడా విడిచిపెట్టకు" అనే నినాదం కింద రైతులు, కార్మికులు, సైనికులు, విభిన్న వృత్తులు, వుద్యోగాలు చేసుకునేవాళ్ళు- అంతా పళ్ళు, కాయగూరలు పండిస్తారు. గృహ పరిశ్రమలు విశిష్టంగా అభివృద్ధి చెందివున్నాయి. "మా ఆర్థిక విధానం వ్యవసాయాన్ని ఆధారభూతంగా, పరిశ్రమని ప్రధానాంశంగా పరిగణిస్తుంది" అని ఐక్య రాజ్య సమితిలో యియాంగ్ సారీ ప్రకటించాడు. విద్య ఉత్పత్తికృషికి అనుబంధంగా నిర్వహింపబడుతున్నది. పిల్లలు అయిదారేళ్ళు రాగానే రోజూ రెండు మూడు గంటలు చదువుకుంటారు. మిగతా సమయంలో పైర్లమీద పడి తినే పిచ్చుకల్ని తోలివెయ్యడం, ఆవుల్ని గేదెల్ని కాయడం, సహజ ఎరువుని సేకరించడం మొదలైన పనిపాట్లలో సంతోషం పొందుతారు. వైద్య సదుపాయాలు పెంపొందింపబడ్డాయి. అభివృద్ధి అయిన ప్రపంచ దేశాల్లో అనివార్యం, అత్యంతావశ్యకం అని భావించే టెలివిజన్లు, టెలిఫోన్లు, కార్లు యిక్కడ తొలగింపబడ్డాయి.

ప్రజాతంత్రి కంపూచియాకు వచ్చి వ్యతిరేకంగా బూతు కూతలు కూస్తూ తప్పెట్లు, తాళాల్తో బృందగానం చేసే కొందరు, అక్కడ విప్లవం అణిచివేయబడి వుంటే అది యీ వేళ ఏ రకంగా తయారై వుండేదో మనకు తెలపవలసిన బాధ్యత తమకున్నదని ఒప్పుకోరు; ఏదైనా అద్భుతం జరిగి వాళ్ళు నాంఫెన్‌లో సంపూర్ణ నిరంకుశాధికారం చూస్తే దాని ఫలితం ఎలా వుంటుందో కూడా తెలుపరు. గతంలో కానీ, యిప్పుడు కానీ, యిక ముందు కానీ, మనిషి ఉత్పత్తి చేసే ముఖ్యాతిముఖ్యమైన వస్తువు ఆహారం- ప్రజలకు భూమి అందుబాటయ్యే హక్కు, వాళ్ళు కష్టించి పండించిన పంట మీద హక్కు వున్నప్పుడు చాలినంత ఆహారం దొరకదనే భయంగానీ, యేడాది పొడుగునా ఆహార సరఫరా గ్యారంటీ గురించి చింతగానీ వుండవు. యిటువంటి వ్యవస్థ కంపూచియాలో వున్నది. "పంట పండించటానికి పండించిన పంట అనుభవించటానికి అవకాశ మిచ్చే విధానాలు అనుసరించబడ్డపుడు ప్రజలకు ఆకలి బాధ ఉండదు." ఈ విధానాలు కంపూచియాలో వున్నాయి.

అమెరికాలో 200 సంవత్సరాల అభివృద్ధి తర్వాత కూడా సరియైన పోషణ లేని అమెరికన్లు రెండు కోట్ల మంది వున్నారు. పేదల ఆదాయం తగ్గుతూ వుంది. దేశంలో ఇరవై శాతం అతిపేద వాళ్ళు. దేశాదాయంలో ఏడు శాతం మాత్రమే పొందుతున్నారు. ఇరవై శాతం అత్యంత ధనికులు ఆదాయంలో అరవై శాతం పొందుతున్నారు.

కంపూచియా యొక్క పొరుగుదేశాలు ఒక్కొక్కటి ఒక్కొక్క రకంగా అయితే కావచ్చు కాని, ఒక రకపు సంకట పరిస్థితిలో చిక్కుకున్నాయని. వాటి ప్రభుత్వాలు ఎంత సమర్ధవంతమైన వైనా, ఎంత ఆధునికదృష్టికల వైనా, అవి ఎంచుకున్న అభివృద్ధి పథంలో ఎంతదూరం వెళ్ళితే, ఎక్కువ మంది ప్రజల్ని పీడించే సమస్యలు అంత క్లిష్టంగాను, అపరిష్కృతంగాను తయారవుతాయి. వాళ్ళ సమాజాల్లో గూడు కట్టుకొనివున్న దారుణ అసమానతల్ని, అన్యాయాల్ని తొలగించటానికి అవసరమైన చర్యల్ని తీసుకోవటానికి శక్తి చాలక, ఈ ప్రభుత్వాలు మరింత దారుణమైన, నిరంకుశమైన నిర్బంధకాండకి పూనుకొని, సామ్రాజ్య వాద దేశాల ఆర్థిక, సైనిక తోడ్పాటు కోసం దేవిరిస్తాయి. చైనీయులు మొదట సామాజిక అధికార వ్యవస్థను ధ్వంసం చేసి పమమట్టం చేసి వాళ్ళ కొత్త సమాజాన్ని దాని శిథిలాల మీద నిర్మించారు. గ్రామీణ పరిస్థితిపై కంపూచియన్ల అంచనా చైనీయుల అంచనాతో చాలా దగ్గరగా ఏకీభవిస్తుంది. ఇది ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. వాళ్ళు తప్పకుండా పూర్వ దృష్టాంతాలను అధ్యయనం చేశారు. అయితే దానిని అనుకరించలేదు-ఏవో కొన్ని సముచిత సందర్భాల్లో అవసరమైనంత మేరకు తప్ప. అయితే సామాజిక అధికార వ్యవస్థను ధ్వంసం చేసి సమమట్టం చేయడానికి కంపూచియాలో తీసుకున్న చర్యలు చైనాలో కంటె తీవ్రంగాను, కఠినంగాను వున్నాయి. యిలా చేయడం ద్వారా కంపూచియన్లు రాబోయే చాలా యిబ్బందుల్నుంచి తప్పించుకొన్నారని వూహించవచ్చు.

యూరప్‌లోని సోషలిస్టు దేశాలతో పోల్చితే ఉత్తర కొరియా అనుభవంలోని గొప్ప సుగుణం ఏమిటంటే దాని సర్వతోముఖ విజయాలు దాని సురక్షితమైన వ్యావసాయక స్వయంసమృద్ధి మీద ఆధారపడ్డాయి. విదేశీ సహాయాన్ని అంగీకరించడం లేదు. వియత్నాం నమూనా అనేక విషయాల్లో ఉత్తర కొరియా నమూనాకన్నా యూరోపియన్ సోషలిస్టు నమూనాకి దగ్గరగా వున్నది. కంపూచియాకు సంబంధించినంత వరకు అది వియత్నాం నమూనాకు పూర్తిగా భిన్నంగా వున్నది.

కంపూచియా విప్లవం 20 వ శతాబ్ది ఆఖర్లో ప్రపంచాన్ని కుదిపి వేసే బృహత్తరమైన, అవసరమైన మార్పులకు మొదటి సూచన అనిస్పష్టంగా తెలుస్తుంది. ఈ మార్పులు ప్రపంచాన్ని ప్రమాదమార్గం నుంచి తప్పించి అందరికి గొప్ప భవిష్యత్తు చూపిస్తాయి. కంపూచియా ప్రజల జీవన ప్రమాణాలు అంతకంతకూ పెరుగుతున్నందుకు మనం సంతోషించవచ్చు. అదేసమయంలో వాళ్ళ 'స్వేచ్ఛా' ప్రపంచపు పొరుగు ప్రజల జీవన ప్రమాణాలు తరుగుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో రష్యా సహాయంతో వియత్నాం కంపూచియా మీద దురాక్రమణ చేయడం సహజమే.

సోషలిజం నిర్మాణంలో కంపూచియా దీర్ఘకాలిక కృషిని అర్థం చేసుకోవడానికి పునాది వేస్తున్నది మాల్కొమ్ కాడ్‌వెల్ పుస్తకం. దీనిని తెలుగులోనికి తెచ్చిన జనతా ప్రచురణల వారి కృషి ప్రశంసనీయం.

— జీ.డి.

కంపూచియా (యదార్థ కథా కథనం) వెల రు. 4-00
— మాల్కొమ్ కాడ్‌వెల్
జనతా ప్రచురణలు, 10-1-17/2 (మేడమీద)
శ్యాంనగర్, హైదరాబాద్ - 500 004.

ఈ సంచికలోని "సోషలిజం ఒక కల?" జాక్‌లండన్ రాసిన 'ఉక్కుపాదం' లోనిది.
ప్రతులకు అనుపమ ప్రచురణలు 10-2-317/33 విజయనగర్ కాలనీ,
హైదరాబాద్ - 500 028 కు రాయాలి.

రచనలకోసం విజ్ఞప్తి

ఆర్థిక ఇబ్బందులు, నిర్వహణా సమస్యలతోపాటు సృజన రచనల విషయంలో కూడ తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నది. కళా విలువలులేని నినాదప్రాయమైన పాటలు, కవితలు, మూసలోపోసిన ఫార్ములా పద్ధతి కథలు, ఇతర భాషల్లోని మంచి రచనలకు (చెడ్డ) అనువాదాలు తప్ప మౌలికమైన ఉత్తేజకరమయిన కనీసం తృప్తికరమైన రచనలు రావడంలేదు. ముఖ్యంగా సాహిత్య విమర్శ, సమీక్షలు, మౌలికమైన సృజనాత్మక రచనలు కరువయినాయి. ఉత్తమమైన రచనలు పంపించి ప్రజాసాహిత్య ప్రమాణాలు ఉన్నతంగా కాపాడడంలో సృజనకు ఇతోధికంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— 'సాహితీ మిత్రులు'

సవరణ

46 పేజీలో రెండో పేరా ప్రారంభాన్ని "మానవాతీత వర్గాతీత భావనలమీద ఆధారపడిన నీతిని మనం నిరాకరిస్తాం" గా చదువుకోవాలి.

48 పేజీలో "చెదిరిపోయిన........వొడిచెయ్యగలదు" అధోజ్ఞాపిక 12గా చదువుకోవాలి. దాంట్లోనే మూడోలైను 'పాపానికి బంగారపు పూతపుయ్యి'గా చదువుకోవాలి.

సృజనవద్ద దొరికే పుస్తకాలు

విరసం ప్రచురణలు :

1.	కథ, నవల - జీవితం — సాహిత్య పాఠశాల ప్రసంగ వ్యాసాలు	0-40
2.	తెలంగాణా పోరాట పాటలు	4-00
3.	ప్రజలు విప్లవాన్ని కోరుకున్నారు — ప్రసంగవ్యాసం	0-30
4.	అభ్యుదయ రచయితల సంఘానికి కాయకల్ప చికిత్స — వ్యాసం	1-25
5.	పోరాటాల శ్రీరాములు — రచనల సంకలనం	0-75
6.	పోరాట పాటలు	2-00

సృజన ప్రచురణలు :

7.	భూమి భాగోతం — నృత్య నాటకం	1-00
8.	సాంస్కృతిక దళాల నిర్మాణం — ప్రచార కార్యక్రమం	0-15

ఇతర ప్రచురణలు :

9.	తెలంగాణా వీరయోధులు — బుర్రకథ	0-60
10.	కరపత్రాల దుమారం — తెరవెనుక భాగోతం	3-00
11,	మాపల్లె — నవల	4-00
12.	ప్రజల మనిషి — ఒక పరిచయం	3-00
13.	స్వేచ్ఛ — కవితలు	2-50
14.	ఋతువు — కవితలు	2-50
15.	కవిత్వం చైతన్యం — వ్యాసాలు	3-00
16.	మావో రచనలు	15-00
17.	గమ్యం — కవితలు	2-00
18.	నగ్నముని కథలు	5-00
19.	భూపాల్ పాటలు	1-00

పై పుస్తకాలన్నింటికీ ముందే ఎం.ఓ. చేయాలి. ఐదు కాపీలకు పైబడే ఆర్డర్లకు సృజన ప్రచురణలమీద 25%, విరసం ప్రచురణలమీద 20%, ఇతర ప్రచురణలమీద 15% కమీషన్ యివ్వబడుతుంది.

మేనేజర్,

సృజన, హనుమకొండ 506 001

SRJANA Telugu Monthly **May 79** **H/WL-10**
Regd. No. with Registrar of News Papers 10953/67

మేడే

సోదర కార్మికులారా! ప్రపంచ కార్మికుల గొప్ప పండగ దినం సమీపిస్తూంది. వారు సూర్యకాంతికి మేల్కొని జ్ఞాన మార్జించినందుకు సంతోష చిహ్నంగా మే ఒకటవ తేదీని పండగ చేసుకుంటారు. సమస్త పీడనకు వ్యతిరేకంగా, సమస్త నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, సమస్త దోపిడీకి వ్యతిరేకంగా సోషలిస్టు సమాజ స్థాపనకై పోరాడేందుకు ఒక సోదర బృందంగా ఐక్యమయినందుకు వారు ఆనాడు ఉత్సవం జరుపుకుంటారు. కష్టించి పనిచేసే వారందరూ, తమ కష్టంతో ధనికుల-సామంతుల కడుపులు నింపే వారందరూ, స్వల్ప జీతాలకు నడుములు విరిగేటట్లు యావజ్జీవితం శ్రమించే వారందరూ, తమ శ్రమ ఫలితాల్ని ఎన్నడూ అనుభవించని వారంతా, నేటి నాగరికత ప్రసాదించిన విలాసాల-భోగభాగ్యాల మధ్య బ్రతుకు భారంగా పశుజీవితం గడిపే వారంతా-ఆ రోజున కార్మికుల విముక్తి కోసం, కార్మికుల సౌఖ్యం కోసం పోరాడ్డానికి ఒకరి చేతులొకరు అందుకుంటారు. భిన్న జాతులకు, లేదా మతాలకు చెందిన కార్మికుల మధ్య వైరం సమసిపోవాలి; కార్మికుల అజ్ఞానం మీద, అనైక్యత మీద బ్రతికే దోపిడీగాండ్రకు, నిరంకుశ పాలకులకు మాత్రమే యీ వైరం ప్రయోజనకారి. హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, జైనులు, యూదులూ-క్రైస్తవులూ, ఆర్మీనియన్లూ-టాటార్లూ, పోలులూ-రష్యన్లూ, ఫిన్నులూ-స్వీడులు, లెట్టులూ-జర్మన్లూ- అందరూ, వీరందరూ సోషలిజం అనే పతాకం క్రింద కదం తొక్కుతూ కలిసి నడుస్తారు. కార్మికులందరూ సోదరులు; వారి దృఢ ఐక్యత మాత్రమే శ్రమజీవులందరి, పీడిత జనులందరి సంక్షేమానికి, సౌఖ్యానికి హామీ. మే మొదటి తేదీని సకల దేశాల కార్మిక సమాఖ్య, అంతర్జాతీయ శ్రామిక ఉద్యమం తన బలాలను బేరీజు వేసుకొంటుంది; స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరత్వం కొరకు మరింత నిర్విరామంగా మరింత దృఢ నిశ్చయంతో పోరాడ్డానికి తన శక్తినంతనూ సమీకరించుకొంటుంది.

— లెనిన్